PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ

ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 185 | విజయవాడ, శుక్రవారం 9 ఫిబ్రవరి 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Friday 9 February 2024 | Rs

దిగిరాని వడ్డీ రేట్లు ఆరోసారి యథాతథం

- ఆర్‌బిఐ నిర్ణయం

3

వైసిపి రాజ్యసభ అభ్యర్థుల ప్రకటన

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

రాష్ట్రం నుంచి రాజ్యసభకు పోటీచేసే అభ్యర్థులను వైసిపి ప్రకటించింది. వైసిపి సీనియర్ నాయకులు వైవి సుబ్బారెడ్డి, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, కడప జిల్లాకు చెందిన మేడా రఘునాథ్‌రెడ్డిని రాజ్యసభ అభ్యర్థులుగా ప్రకటించింది. ముగ్గురు రాజ్యసభ అభ్యర్థులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అసెంబ్లీ ఆవరణ లోని సిఎం కార్యాలయంలో గురువారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సిఎం రమేష్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కనకమేడల రవీంద్రకుమార్ పదవీకాలం ముగియడంతో ఈ ఎన్నికలు అనివార్యమయ్యాయి. మేడా రఘునాథ్‌రెడ్డి స్థానంలో ముందు చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేరును ప్రతిపాదించారు. టిడిపి అభ్యర్థిని రంగంలోకి దించితే సమస్య రాకుండా ఆర్థికంగా బలమైన మేడా రఘునాథ్‌రెడ్డి పేరును తెరపైకి తెచ్చినట్లు తెలిసింది.

ఢిల్లీలో కేరళ సిఎం పినరయి విజయన్ ధర్నాకు హాజరైన వివిధ పార్టీల నేతలు

కేంద్ర వివక్షపై సమిష్టి పోరు

ఢిల్లీలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సహా మంత్రివర్గం ధర్నా

లెఫ్ట్, ఆప్, డిఎంకె, నేషనల్ కాన్ఫరెన్స్, ఎస్పీ, విసికె సహా పలు పార్టీల మద్దతు

లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి ఓటమే లక్ష్యం : ప్రతిపక్షాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పన్ను వాటాను నిరాకరించడం, గ్రాంట్లు నిలిపివేయడం, రుణ పరిమితిని తగ్గించడం, అభివృద్ధి ప్రణాళికలను తిరస్కరించడం వంటి కేంద్ర ప్రభుత్వ దురుద్దేశపూరిత చర్యలకు వ్యతిరేకంగా ఢిల్లీలో కేరళ ప్రభుత్వం ఆందోళన నిర్వహించింది. జాతీయ నాయకులను సమీకరించి జరిపిన ఈ ఆందోళన లోక్‌సభ ఎన్నికల ముందు ప్రతిపక్షాలకు ఐక్య వేదికగా మారింది. కేంద్రంలోని నిరంకుశ మోడీ ప్రభుత్వానికి కేరళ పోరాటం గట్టి హెచ్చరికగా నిలిచింది. జాతీయ స్థాయిలో విపక్షాల ఐక్యత ఇప్పటికీ బలంగానే ఉందన్న సందేశాన్ని యావత్ దేశానికి అందించింది. బిజెపియేతర ప్రతిపక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాలపై మోడీ ప్రభుత్వం చూపుతున్న వివక్షపై జాతీయ చర్చకు ఈ ఆందోళన తెర లేపింది.

గురువారం ఉదయం కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, వామపక్ష నేతలు, కార్యకర్తలు కేరళ హౌస్ నుంచి పోరాట వేదిక జంతర్‌మంతర్‌కు ప్రదర్శనగా చేరుకున్నారు. 'ఫెడరలిజాన్ని కాపాడేందుకు పోరాటం' అన్న బ్యానర్‌తో ర్యాలీ సాగింది. సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, తమిళనాడు మంత్రి పళనివేల్ త్యాగరాజ్ ర్యాలీలో పాల్గొన్నారు. అక్కడ జరిగిన ఆందోళనకు సిపిఐ(ఎం) రాజ్యసభ పక్షనేత ఎలమరం కరీం స్వాగతం పలికారు. సిపిఐ జాతీయ కార్యదర్శి బినయ్ విశ్వం అధ్యక్షత వహించారు. లోక్‌సభ ఎన్నికల్లో మోడీ ప్రభుత్వంపై ఐక్యంగా పోరాడాలని ప్రతిపక్ష పార్టీల నేతలు పిలుపునిచ్చారు. బిజెపికి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో ప్రతిపక్షాల ఐక్యతకు ఈ ఆందోళనకు వేదికైంది.

సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా, డిఎంకె ఎంపి తిరుచ్చి శివ, వికెసి ఎంపి తోల్ తిరుమావళవన్, కేరళ కాంగ్రెస్ నేత జోస్ కె మణి తదితరులు మాట్లాడారు. జాన్ బ్రిట్టాస్ వక్తలను వేదికపైకి ఆహ్వానించారు. ఎల్‌డిఎఫ్ కన్వీనర్ ఇ పి జయరాజన్ వందన సమర్పణ చేశారు. ఈ ఆందోళనలో సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్, బృందాకరత్, ఎంఎ బేబి, ఎ. విజయరాఘవన్, కేరళ రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ మాస్టార్ తదితరులు పాల్గొన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ పంపిన సందేశం వీడియోను వేదిక వద్ద ప్రదర్శించారు.

కేంద్ర-రాష్ట్ర సంబంధాల సమతుల్యత అవశ్యం : పినరయి విజయన్

కేంద్ర-రాష్ట్ర సంబంధాల సమతుల్యతను కాపాడుకోవడం కోసమే కేరళ పోరాటమని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. 'యూనియన్ ఆఫ్ స్టేట్స్' అనే భావనపై ఆధారపడిన ప్రజాస్వామ్యం 'యూనియన్ ఓవర్ స్టేట్స్' అనే అత్యంత అప్రజాస్వామిక పరిస్థితిలోకి నెట్టబడుతున్నదని విమర్శించారు. దీని పర్యవసానాలు దేశమంతటా

మిగతా 7లో..

రాష్ట్రాలను మున్సిపాలిటీలుగా చూస్తున్న మోడీ

- కేంద్రంపై స్టాలిన్ ఆగ్రహం
- కేరళ నిరసనోద్యమానికి సంఘీభావం

ఫెడరల్ వ్యవస్థను ఖూనీ చేస్తోన్న బిజెపి

- ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కేరళ సంఘీభావ ధర్నాలు

లోపలి పేజీలో..

అసెంబ్లీలో కోరం లేదు.. మండలిలో మంత్రులు లేరు

- చివరిరోజూ సమావేశాల్లో కొనసాగిన నిర్లిప్తత
- అసెంబ్లీ నిరవధిక వాయిదా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాల్లో చివరిరోజైన గురువారం కూడా సభ్యులలో నిర్లిప్తత కొనసాగింది. ఉభయ సభల్లోనూ సభ్యుల హాజరు చాలా తక్కువగా కన్పించింది. శాసనసభ ప్రారంభమయ్యే సమయానికి కేవలం ఐదారుగురు సభ్యులు మాత్రమే సభలో ఉన్నారు. టిడిపి ఉప నాయకులు కె అచ్చెన్నాయుడు సభలో కోరం లేదు చూడండి అని చెప్పడం వినిపించింది. దీంతో సభ నిర్ణీత సమయం కన్నా కొద్దిసేపు ఆలస్యంగా ప్రారంభమైంది. ప్రభుత్వ కార్యక్రమాలు ముగిసిన వెంటనే సభను వాయిదా వేశారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభమైన సభలోనూ సభ్యుల హాజరు పలుచగా కనిపించింది. దీంతో కొద్దిసేపు నామమాత్రంగా సభను నిర్వహించి, నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. నాలుగు రోజుల సమావేశాల్లోనూ సభలో కూర్చొన్న వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. ప్రధానంగా అధికార పక్ష సభ్యుల హాజరు అంతంత మాత్రంగానే ఉంది. ఎక్కువ మంది సమావేశాలకు హాజరు కాకపోవడం, హాజరైనా సభల్లో కూర్చొని చర్చల్లో పాల్గొనకుండా బయటకు వెళ్తున్న పరిస్థితి ఉభయ సభల్లో నెలకొంది. గురువారం మధ్యాహ్నం శాసనమండలిలో బడ్జెట్‌పై ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రసంగించే సమయానికి కేవలం 15 మంది సభ్యులు మాత్రమే ఉన్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మండలిలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై చర్చకు అనుమతి కోరి కొద్దిసేపటికి మండలి నుంచి శాసనసభకు వెళ్లిపోయారు. అయితే మండలిలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మంత్రి అమర్‌నాథ్, ఇతర మంత్రులు బడ్జెట్‌పై చర్చ సమయంలో సభలో లేకుండాపోయారు. దాదాపు 13 మంది సభ్యులు మాట్లాడగా ఒక్క మంత్రి కూడా ఈ సభలో లేకపోవడం గమనార్హం.

శాసనసభలో మొదటిరోజు మినహా మిగతా మూడు రోజులు సస్పెన్షన్ల పర్వం కొనసాగింది. మండలిలో సస్పెన్షన్లు లేకున్నా సభ్యుల హాజరు శాతం చాలా తక్కువగా ఉంది. శాసనసభతో పోల్చితే మండలిలో హాజరు 50 శాతం వరకు ఉంది. చర్చల్లో అధికార పార్టీతో పాటు టిడిపి, పిడిఎఫ్ సభ్యులు ఎక్కువగా చర్చలో పాల్గొన్నారు. మొత్తంగా నాలుగు రోజుల కాలంలో శాసనసభలో 10 గంటల రెండు నిమిషాలు సభా కార్యకలాపాలు జరగ్గా, 9 బిల్లులు ఆమోదించారు. 20 మంది సభ్యులు ప్రసంగించారు. శాసనసభలో వైసిపికి 151 మంది, టిడిపికి 22, జనసేన 1, ఖాళీ ఒక్కటి ఉన్నట్లు సభ అనంతరం స్పీకరు తమ్మినేని సీతారాం ప్రకటించారు. అదే విధంగా శాసనమండలిలో 9 గంటల 15 నిమిషాలు సభ కార్యకలాపాలు జరగ్గా 9 బిల్లులు ఆమోదించారు. ఆరు వాయిదా తీర్మానాలను ప్రతిపాదించారు. 17 ప్రత్యేక ప్రస్తావనల ద్వారా వివిధ అంశాలను సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. సభలో వైసిపికి 35, టిడిపి 8, పిడిఎఫ్ 2, ఇండిపెండెంట్‌లు 4, నామినేటెడ్ 8, ఖాళీలు ఒక్కటి ఉన్నట్టు మండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు ప్రకటించారు.

అప్పులపై తప్పుడు ప్రచారం

- మండలిలో బడ్జెట్‌పై చర్చలో మంత్రి బుగ్గన

2

ఒకరి వెంట ఒకరు

- బాబు, పవన్, జగన్ ఢిల్లీ యాత్ర
- బిజెపి అగ్రనేతల ప్రసన్నం కోసం పాట్లు

శ్వేత పత్రం వర్సెస్ బ్లాక్ పేపర్

- అధికార, ప్రతిపక్షాల మధ్య 'ఆర్థిక యుద్ధం'
- పార్లమెంటులో రభస

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రధాన ప్రతిపక్షాన్ని దెబ్బతీయాలన్న తలంపుతో బిజెపి, గత పదేళ్ల బిజెపి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్న సంకల్పంతో ప్రతిపక్షం గురువారం పార్లమెంటు వేదికగా రణానికి దిగాయి. ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో తన అట్టర్ ఫ్లాప్ రికార్డును దాచిపెట్టేందుకు దశాబ్దం క్రితం నాటి యుపిఎ ప్రభుత్వంపై దాడి చేయడమే లక్ష్యంగా 59 పేజీల శ్వేత పత్రాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. దీనికి కౌంటర్‌గా ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ 'బ్లాక్ పేపర్' పేరుతో 54 పేజీల పత్రాన్నొకదానిని రాజ్యసభలో ప్రవేశపెట్టింది. ఈ రెండు పత్రాలపై శుక్రవారం పార్లమెంటులో చర్చ జరిగే అవకాశముంది.

శ్వేత పత్రం అలా..

దేశ ఆర్థిక స్థితిగతులపై లోక్‌సభ లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శ్వేత పత్రాన్ని ప్రవేశపెడు తూ, యుపిఎ పాలన పై విమర్శలు గుప్పించారు. అదే సమయంలో మోడీ ప్రభుత్వ పదేళ్ల పాలనలో ఆర్థిక వ్యవస్థ దివ్యంగా వెలిగిపోయినట్లు షో చేశారు. ఏ స్థూల ఆర్థిక కొలబద్ద ప్రకారం చూసినా యుపిఎ కన్నా ఎన్డీయే ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ తీరు చాలా మెరుగ్గా వుందని మిగతా 7లో

బ్లాక్ పేపర్ ఇలా..

కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఈ బ్లాక్ పేపర్‌ను గురువారం రాజ్యసభ లో ప్రవేశపెడు తూ పదేళ్ల నరేంద్ర మోడీ పాలన వైఫల్యాలను ఎత్తి చూపే ప్రయత్నం చేశారు. బిజెపి హయాంలో అధిక ధరలు, అంతులేని నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, మహిళలు, మైనార్టీలపై దాడులు పెరిగిపోయాయని ఆ పత్రంలో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ తన వైఫల్యాలను దాచిపెట్టి ఎంతసేపు మిగతా 7లో

ఆశావర్కర్లను ఈడ్చివేస్తున్న మగ పోలీసు

ఆశావర్కర్ నోరునొక్కుతూ బస్సులోకి నెట్టివేస్తున్న పోలీసు

ఆశాలపై ఉక్కుపాదం

- కార్యాలయాలకు తాళాలు వేసి నిర్బంధించిన పోలీసులు
- పగులకొట్టుకుని దూసుకొచ్చిన ఆశాలు
- వడ్డేశ్వరం, మంగళగిరిలో జాతీయ రహదారిపై రాస్తారోకో

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆశా వర్కర్లపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. జిల్లాలోనే ముందస్తు అరెస్టులు చేసిన ప్రభుత్వం గురువారం నాడు కూడా విజయవాడకు రానీయ కుండా పరిసర ప్రాంతాల్లో అడ్డుకుంది. దీంతో తాడేపల్లి, వడ్డేశ్వరం, మంగళగిరి ప్రాంతాల్లో జాతీయ రహదారిపై ఎక్కడికక్కడ ఆశాలు బైఠాయించారు. రాస్తోరోకోకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో పెద్దఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో బలవంతంగా అరెస్టులు చేసి వివిధ ప్రాంతాలకు తరలించారు. అంతకుముందు బుధవారం రాత్రి చర్చల్లో పాల్గొని బయటకు వస్తున్న ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మిని, ఇతర నాయకులను మంగళగిరిలో వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం బయటే పోలీసులు బలవంతంగా అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. చర్చలకు రమ్మని పిలిచి పోలీసులకు సమాచారం ఇచ్చి అరెస్టు చేయించిన ప్రభుత్వం తీరుపై సిపిఎం, సిఐటియు రాష్ట్ర కమిటీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఆ తరువాత కూడా ప్రభుత్వ నిర్బంధం కొనసాగింది. వడ్డేశ్వరంలోని సుందరయ్య స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లో ఉన్న ఆశా వర్కర్లను బయటకు రానీయ కుండా బుధవారం రాత్రే పోలీసులు తాళాలు వేశారు. వడ్డేశ్వరం కెబి భవన్లోనూ ఆశావర్కర్లను నిర్బంధిం చారు. తాళాలు తీయాలని ఎంత బతిమి లాడినా తీయకపోవడంతో ఆశాలు గేట్లు, గోడదూకి బయటకు వచ్చారు. బయటకు వచ్చిన వారు తాళాలు పగుల కొట్టడంతో మిగిలిన వారు బయటకు వచ్చేశారు. ఊహించని పరిణామం తో పోలీసులు నిశ్చేష్టుల య్యారు. అక్కడ నుండి పరుగు పరుగున జాతీయ రహదారిపైకి చేరుకుని నడిరోడ్డుపై బైఠాయించారు. దీంతో మిగతా 7లో

ఆర్థికమంతా అప్పులే

- కాగ్ నివేదిక వెల్లడి
- రూ.15 వేల కోట్లకు లెక్కల్లేవు
- వెలిగొండలో అదనపు చెల్లింపులు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ఆర్థికస్థితి పూర్తిగా అప్పుల్లో కూరుకుపోయిందని, అనుకున్నదానికంటే ఎక్కువ అప్పులు చేశారని, అంతర్గత రుణాలే రూ.45,579 కోట్లకు చేరుకున్నాయని నివేదిక వెల్లడించింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కాగ్ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఆర్థిక అంశాలతోపాటు, పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులో తనిఖీ చేసిన అంశాలనూ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం రిజర్వు బ్యాంకు నుండి గతేడాది అడ్వాన్సులు 166 రోజులు సాధారణ పద్ధతుల్లోనూ, 23 ప్రత్యేక డ్రాయింగ్ సదుపాయంతోనూ, 152 రోజులు ఓవర్ డ్రాఫ్టుల రూపంలోనూ తీసుకుందని నివేదిక పేర్కొంది. వేజ్ అండ్ మీన్స్ అడ్వాన్సులపై వడ్డీ రూ.149 కోట్లు చెల్లించారనీ పేర్కొన్నారు. 7.29 శాతం నుండి 8.07 శాతం వరకూ మార్చుకోదగిన వడ్డీ రేటు ప్రకారం రూ.57,479 కోట్లు బహిరంగ రుణాలు తీసుకున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. వీటిల్లో రూ.2,099 కోట్లు ఆర్‌బిఐ రుణాలు, బహిరంగ ఆర్థిక సంస్థలకు చెందిన రూ.1,155 కోట్లు తిరిగి చెల్లించారని తెలిపారు. ఇప్పటి వరకూ అంతర్గత రుణం రూ.45,579 కోట్లు ఉందని పేర్కొన్నారు. రెవెన్యూలోటు రూ.42,487 కోట్లు, 2023 మార్చి 31 నాటికి ద్రవ్యలోటు రూ.52,508 కోట్లు ఉందని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో, రెవెన్యూ లోటులోనే ఉందని పేర్కొంది. 2018-19లో రెవెన్యూలోటు రూ.13,889 కోట్లు ఉంటే 2023-24 నాటికి రూ.43,487 కోట్లకు చేరిందని పేర్కొంది. ఆర్థిక లోటు 2018-19లో 35,467 కోట్లు ఉంటే 2022-23 నాటికి రూ.52,508 కోట్లకు చేరిందని నివేదికలో వెల్లడించింది. మొత్తంగా రూ.15 వేల కోట్లకు లెక్కలు లేవని తెలిపింది.

పెరుగుతున్న ఆదాయం

పన్నుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న ఆదాయం ఏటా పెరుగుతోందని కాగ్ పేర్కొంది. మొత్తం ట్యాక్స్ రెవెన్యూ రూ.1,16,203 కోట్లు ఉందని తెలిపారు. రాష్ట్ర సొంత ట్యాక్స్ రెవెన్యూ 2019లో రూ.50,031 కోట్లు ఉంటే, 2022-23 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.78,026 కోట్లకు పెరిగింది. సొంత పన్నుల్లో ఎస్‌జిఎస్‌టి వాటా 2019లో రూ.20,611 కోట్లు ఉంటే 2022-23 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.27,981 కోట్లకు పెరిగింది. వ్యాపార, వాణిజ్య రంగం ద్వారా రూ.18,004 కోట్లు వస్తోంది, స్టేట్ ఎక్సైజ్ ద్వారా వచ్చే ఆదాయం 2019లో రూ.6220 కోట్లు ఉంటే గతేడాదికి రూ.14,798 కోట్లకు చేరింది. వాహనాల మీద పన్నులు గత ఐదేళ్లలో రూ.331 కోట్ల నుండి రూ.4,320 కోట్లకు పెంచారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఆదాయం ఐదేళ్లలో రూ.5,428 కోట్ల నుండి రూ.8,022 కోట్లకు చేర్చారు. మొత్తంగా ఐదేళ్లలో పన్నులు విపరీతంగా పెంచేశారు. దీంతోపాటు ఎలక్ట్రిసిటీ డ్యూటీ ఈ ఏడాది అమాంతంగా రూ.4,243 కోట్లు వసూలు చేశారు.

వెలిగొండలో అధిక చెల్లింపులు

వెలిగొండ ప్రాజెక్టులో అగ్రిమెంటు చేసుకున్న ధరల కంటే అదనపు చెల్లింపులు చేశారని కాగ్ నివేదిక వెల్లడించింది. లెక్కల్లోనూ మిగతా 2లో

ఐఆర్‌ఆర్ కేసులో చంద్రబాబుపై ఛార్జిషీట్

ప్రజాశక్తి-అమరావతి, అమరావతి బ్యూరో

ఇన్నర్ రింగ్‌రోడ్డు (ఐఆర్‌ఆర్) కేసులో ఎ-1 ముద్దాయిగా టిడిపి అధినేత చంద్రబాబును పేర్కొంటూ ఎసిబి కోర్టులో సిఐడి గురువారం ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఎ-2గా మాజీ మంత్రి నారాయణ ఉన్నారు. వీరితోపాటు నారా లోకేష్, లింగమనేని రాజశేఖర్, లింగమనేని రమేష్‌ను ముద్దాయిలుగా సిఐడి పేర్కొంది. సింగపూర్‌తో చంద్రబాబు ప్రభుత్వం గవర్నమెంట్ టు గవర్నమెంట్ ఒప్పందం చేసుకున్నామంటూ తప్పుదారి పట్టించారని, అటువంటి ఒప్పందమే జరగలేదని సిఐడి నిర్ధారించింది. సింగపూర్‌తో ఒప్పందానికి కేంద్రం అనుమతి లేదని పేర్కొంది. చట్టవిరుద్ధంగా మాస్టర్ ప్లాన్ పేరుతో సుర్బానా జురాంగ్‌కు డబ్బులు చెల్లింపులు జరిగినట్లు నిర్ధారణ చేసింది. నిందితులకు మేలు చేసేలా ఇన్నర్ రింగ్‌రోడ్డు, సీడ్ క్యాపిటల్, మాస్టర్ ప్లాన్ రూపొందించినట్లు పేర్కొంది. ఇన్నర్ రింగ్‌రోడ్డును లింగమనేని భూములు, హెరిటేజ్ భూములు, నారాయణ భూములకు అనుగుణంగా మార్చినట్లు సిఐడి ఛార్జిషీట్‌లో వెల్లడించింది. '58 ఎకరాల భూములను బంధువుల పేరుతో మాజీ మంత్రి నారాయణ కొన్నారు. లింగమనేని 340 ఎకరాల ల్యాండ్ బ్యాంకుకు మేలు చేసేలా అలైన్‌మెంట్ మార్పులు చేశారు. లింగమనేని నుండి చంద్రబాబుకు ఇంటిని ఇచ్చారు' అని సిఐడి తెలిపింది. లింగమనేని ల్యాండ్ బ్యాంక్ పక్కనే హెరిటేజ్ 14 ఎకరాల భూములు కొన్నట్టు పేర్కొంది.

వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ నివాసాల్లో ఎన్ఐఎ సోదాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో : హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) గురువారం సోదాలు నిర్వహించింది. మావోయిస్టులతో సంబంధాలున్నాయన్న ఆరోపణలతో హిమాయత్‌నగర్‌లోని వీక్షణం పత్రిక ఎడిటర్, ప్రొఫెసర్ వరవరరావు అల్లుడు ఎన్.వేణుగోపాల్ నివాసంలో సోదాలు నిర్వహించింది. వేణుగోపాల్‌ను ప్రశ్నించిన అనంతరం ఆయన కంప్యూటర్ హార్డ్ డిస్క్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఎల్‌బినగర్ రాక్‌టౌన్‌లో నివాసం ఉంటున్న రవిశర్మ నివాసంలోనూ సోదాలు చేసింది. ఆయన సెల్‌ఫోన్‌తో పాటు సాహిత్యాన్ని ఎన్ఐఎ సీజ్ చేసి, స్వాధీనం చేసుకుంది. మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యులు దీపక్‌ను ఇటీవల కూకట్‌పల్లిలో పోలీసులు అరెస్టు చేశారు.

మందుల రంగంలో అక్రమాలను అరికట్టాలి

- ఎఫ్ఎంఆర్ఎఐ సమావేశాల్లో పలు తీర్మానాలు

పాక్ పోలింగ్ హింసాత్మకం

- ఇద్దరు చిన్నారులతో సహా 12 మంది మృతి
- ప్రారంభమైన ఓట్ల లెక్కింపు

జగన్‌పై దాడి కేసులో నిందితుడు శ్రీనుకు బెయిల్

- పలు షరతులు విధింపు

లోపలి పేజీలో..

అప్పులపై తప్పుడు ప్రచారం

- మండలిలో బడ్జెట్‌పై చర్చలో మంత్రి బుగ్గన

మాట్లాడుతున్న మంత్రి రాజేంద్రనాథ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి ప్రభుత్వం రూ.లక్షల కోట్లు అప్పులు చేసిందని ప్రతిపక్ష పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆరోపించారు. గురువారం శాసనమండలిలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై జరిగిన చర్చకు ఆయన సమాధానం ఇచ్చారు. 13 మంది సభ్యులు చర్చలో పాల్గొనగా, చివరగా మంత్రి సమాధానం చెబుతూ.. టిడిపి హయాంలో చేసిన అప్పుల కన్నా గత నాలుగున్నరేళ్లలో చేసిన అప్పులు తక్కువేనని ఆయన తెలిపారు. టిడిపి మాదిరి తాము మేనిఫెస్టోను నిర్లక్ష్యంగా పక్కన పడేయలేదని, ప్రతి అంశాన్నీ అమలు చేశామని అన్నారు. పాలనా వికేంద్రీకరణ, మహిళలను మహరాణులుగా చేయడం, అన్నపూర్ణ ఆంధ్రగా ఆహార ఉత్పత్తులను పెంచడం, 65 లక్షల మందికి పింఛన్లు ఇవ్వడం ద్వారా పేదలకు చేయూతను అందించామని, భూ రక్ష, భూ యాజమాన్యాలకు శాశ్వత భూ హక్కులు కల్పించడం, స్థిరమైన అభివృద్ధి, విద్య, వైద్య, ఆరోగ్య, వ్యవసాయ రంగాలకు ఇతోధిక ప్రోత్సాహంతో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ రంగాలకు సమాన ప్రాతినిధ్యం ఇచ్చినట్టు తెలిపారు. 2018-19లో రూ.1.91 లక్షల కోట్ల బడ్జెట్‌ను ఆమోదించగా, రూ.1.64 లక్షల కోట్లను మాత్రమే అప్పటి ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. 2023-24లో తమ ప్రభుత్వం 2.79 లక్షల కోట్ల బడ్జెట్‌కు ఆమోదం తెలపగా, రూ.2.75 లక్షల కోట్ల వరకు ఖర్చు చేసినట్టు తెలిపారు. 2014-19 వరకు కేంద్ర ప్రభుత్వం చేసిన అప్పులు 60 శాతం ఉండగా, 2019-24 మధ్యలో కేంద్రం అప్పులు 86 శాతానికి పెరిగాయన్నారు. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వం అప్పులు గతంలో కన్నా 126 శాతం పెరగ్గా, 2019-24 మధ్య వైసిపి హయాంలో అప్పులు 95 శాతం మాత్రమే పెరిగిన విషయం గమనించాలన్నారు. టిడిపి హయాంలో రుణమాఫీ చేస్తామని తప్పుడు హామీ ఇచ్చి రైతులను మోసం చేసిందన్నారు. మొత్తం రూ.87,610 కోట్ల వరకు రుణమాఫీ చేస్తామని కేవలం రూ.15 వేల కోట్లు రుణాలు మాఫీ చేసి రైతులకు అసలు, వడ్డీలు చెల్లించలేక నష్టపోయే పరిస్థితిని కల్పించిన టిడిపిని రైతులు ఎప్పటికీ నమ్మరన్నారు. సున్నా వడ్డీకి రూ.11 వేల కోట్ల ఖర్చు చేయాల్సి ఉండగా, టిడిపి హయాంలో రూ.600 కోట్లు ఖర్చు చేసిందన్నారు. డ్వాక్రా రుణాల మాఫీ చేస్తామని మహిళలను మోసం చేశారన్నారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విభజన హామీల్లో భాగంగా రూ.1050 కోట్లు విడుదల చేసినట్లు బడ్జెట్ ప్రసంగంలో చెప్పారని గత ఐదేళ్లలో ఈ నిధులు వచ్చాయా? అని ప్రశ్నించారు. దీనికి బుగ్గన సమాధానం ఇస్తూ.. టిడిపి హయాంలో ఏడాదికి ఏడు జిల్లాలకు రూ.350 కోట్ల చొప్పున రూ.1,050 కోట్లు కేటాయించినప్పటికీ రూ.700 కోట్లు ఖర్చు చేయకపోవడం వల్ల వెనక్కి వెళ్లాయన్నారు. టిడిపి ప్రభుత్వ విధానాల వల్లే పోలవరం నిర్మాణంలో జాప్యం జరిగిందన్నారు. పట్టిసీమ కోసం పోలవరం పనులను రెండేళ్లపాటు ఆలస్యంగా ప్రారంభించారని అన్నారు. పట్టిసీమ రూ.600 కోట్లతో చేపట్టాల్సి ఉండగా రూ.1600 కోట్లు ఖర్చు చేశారని అన్నారు. పోలవరం కుడికాలువ ద్వారా ఎంత ఉపయోగమో పట్టిసీమ వల్ల అంతే ఉపయోగం అన్నారు. పోలవరం నిర్మాణం కేంద్రమే నిర్మించి ఉంటే ఇబ్బంది లేకుండా పూర్తయ్యేదన్నారు. చర్చ అనంతరం బడ్జెట్ ప్రతిపాదలను ఆమోదిస్తున్నట్టు మండలి ఛైర్మన్ మోషేను రాజు ప్రకటించారు. అనంతరం సభ వాయిదా పడింది.

స్పీకరు ముందుకు రెబల్ ఎమ్మెల్యేలు

వైసిపి రెబల్ ఎమ్మెల్యేలు అనర్హతకు సంబంధించిన పిటిషన్ విచారణలో భాగంగా గురువారం స్పీకరు తమ్మినేని సీతారామ్ ముందు ఆయన ఛాంబర్‌లో హాజరయ్యారు. ఎమ్మెల్యే ఆనం నారాయణరెడ్డి తన న్యాయవాదులతోపాటు హాజరయ్యారు. తమపై చీఫ్ విప్ ప్రసాదరాజు చేస్తున్న ఆరోపణలకు సంబంధించి సర్టిఫైడ్ కాపీలు ఇవ్వాలని స్పీకరు కోరారు.

స్పీకరుకు సిఎం జన్మదిన శుభాకాంక్షలు

శాసనసభ స్పీకరు తమ్మినేని సీతారామ్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గురువారం రాష్ట్ర శాసనసభ ఆవరణలోని స్పీకరు ఛాంబర్‌కు సిఎం జగన్ వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే శాసనమండలి ఛైర్మన్ మోషేన్‌రాజు కూడా స్పీకరుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శాసనసభ ప్రారంభం కాగానే సభలో వున్న వైసిపి, టిడిపి సభ్యులంతా మూకుమ్మడిగా స్పీకరు తమ్మినేని సీతారామ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

అభివృద్ధి జాడ లేని బడ్జెట్

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

మండలిలో మాట్లాడుతున్న ఎంఎల్సీలు లక్ష్మణరావు, ఐవి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రప్రభుత్వ బడ్జెట్ అభివృద్ధి వైపు దృష్టిసారించలేదని శాసనమండలి పిడిఎఫ్ ఫ్లోర్ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రప్రసాద్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనపై శాసనమండలిలో గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి ఎటు వెళ్తుందో బడ్జెట్ నిర్ణయించాలని కానీ అందులో వెనుకబడి ఉన్నామన్నారు.. రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రస్తావన లేదన్నారు. విభజన చట్టంలో ఉన్న అంశాలను కేంద్రప్రభుత్వం అమలు చేసిందని బడ్జెట్‌లో పొందుపరచడం దారుణమన్నారు. వెనుకబడిన 7 జిల్లాలకు బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజ్ కింద ఇస్తామని చెప్పిన రూ.24,500 కోట్లు ఇవ్వకపోయినా ఆర్థిక శాఖమంత్రి చాలా ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. విశాఖపట్నం రైల్వేజోన్, రామయపట్నం పోర్టు, కడప ఉక్కు కర్మాగారం వంటి అంశాల్లో అన్యాయం చేసిందని, విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తామని ప్రకటించిందన్నారు. ఇంత అన్యాయం చేస్తున్నా కేంద్రం సహాయం చేస్తుందని చెప్పడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందో స్పష్టత లేదన్నారు. ఈ ప్రాజెక్టుకు రూ.55వేల కోట్లు ఖర్చు చేస్తుందని అంచనా వేసిందని, ఇందులో రూ.33వేల కోట్లు పోలవరం నిర్వాసితుల కోసం కేటాయించారని తెలిపారు. పునరావాసం పూర్తికాకుండా, నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా ఈ ప్రాజెక్టు పూర్తి కాదని చెప్పారు. పాలన వికేంద్రీకరణ పేరుతో స్థానిక సంస్థలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని చెప్పారు. జిల్లా, మండల, సర్పంచుల నిధులను పూర్తిగా ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. డిబిటి అందిస్తున్నామనే పేరుతో ఎస్సి, ఎస్టి సబ్‌ప్లాన్ అమలు చేయడం లేదన్నారు.

56 బిసి కార్పొరేషన్‌ల ద్వారా ఖర్చు చేయడానికి నిధులు ఎంత కేటాయించారో చెప్పలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రధాన రహదారుల పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందని, రోడ్లు భవనాల శాఖను బలోపేతం చేయాలని కోరారు. 2023 సెప్టెంబర్ 22వ తేదీన 8,366 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శాసనమండలిలో ప్రకటించారని తెలిపారు. కానీ 6,100 టీచర్ పోస్టులను భర్తీకి మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేశారని చెప్పారు. ఈ పోస్టుల సంఖ్య పెంచాలని కోరారు. ఉద్యోగులకు 11వ వేతన సంఘం సిఫార్సులు అమలు చేశామని చెప్పారని, కానీ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని చెప్పారు.

సమానత్వమంటే ఇదేనా..
ఐ. వెంకటేశ్వరరావు ప్రశ్న

పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేయాలని, పోరాటాలు చేసేవారిపై రాష్ట్రప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తోందన్నారు. ఇది ఏ స్వేచ్ఛ, ఎలాంటి సమానత్వమని ప్రశ్నించారు. అంగన్‌వాడీ, ఆశలు, పారిశుద్ధ కార్మికులు ఆందోళన చేస్తుంటే ఎస్మా ప్రయోగించారని తెలిపారు. రాష్ట్ర పిఆర్‌సిల చరిత్రలో అత్యంత అప్రజాస్వామికంగా, ఏకపక్షంగా 11వ పిఆర్‌సి అమలు జరిగిందన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సమస్యలపై గత ఎన్నికల్లో హామీ ఇచ్చారని, ఎప్పటికీ అమలవుతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. 3 నుంచి 12వ తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తే విద్యారంగ పరిస్థితి అర్థమవుతుందన్నారు టిడిపి ఎమ్మెల్సీ చిరంజీవి రావు మాట్లాడుతూ డిబిటి పేర్లతో బటన్ నొక్కుడు కార్యక్రమాలు, అనవసర ప్రచారాలు, నిధులు దుర్వినియోగం, ఉత్పత్తికి దోహదపడని అనవసర వ్యయాలు ఉన్నాయని తెలిపారు.ప్రభుత్వం ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని టిడిపి ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, కంచర్ల శ్రీకాంత్ విమర్శించారు. వి కళ్యాణి, వంకా రవీంద్ర, అరుణ్‌కుమార్, ఏసురత్నం, సునీత, జయమంగళం వెంకట రమణ, ఇక్బాల్, కల్పలత తదితరులు ప్రసంగించారు.



ఢిల్లీ పెద్దలకు లొంగిపోయిన చంద్రబాబు

- మంత్రి చెల్లుబోయిన

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు తెలుగువారి ఆత్మగౌరవాన్ని అర్ధరాత్రుళ్లు ఢిల్లీలో తాకట్టు పెడుతున్నారని సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస గోపాలకృష్ణ విమర్శించారు. బిజెపి రాష్ట్రానికి చేసిన నష్టం గురించి గతంలో చెప్పిన చంద్రబాబు ఎటువంటి విలువలు పాటించకుండా పొత్తుల కోసం ఢిల్లీ పెద్దలను కలవడం సిగ్గుచేటన్నారు. ఎందరు కలిసి వచ్చినా ఎన్నికల్లో పేదలకు సంక్షేమం అందించిన జగన్ విజయం సాధిస్తారన్నారు.

టిడిపి సభ్యుల తీరు హేయం : మల్లాది విష్ణు

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో టిడిపి సభ్యుల తీరు హేయంగా ఉందని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. శాసన సభ్యులు ఎలా ఉండకూడదో అలా వ్యవహరించారన్నారు. స్పీకర్ పోడియం దగ్గరకు వెళ్లి పేపర్లు చింపి స్పీకర్ మీద విసిరి వేయడం, దుర్భాషలాడి సస్పెండ్ అవ్వడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఏ రాజకీయ పార్టీ వచ్చే ఎన్నికల్లో జగన్‌తో తలపడే పరిస్థితి లేదన్నారు.

గిరిజనుల పక్షపాతి జగన్ : మద్దాల గిరి

సిఎం జగన్ గిరిజనుల పక్షపాతి అని అరకు ఎమ్మెల్యే మద్దాల గిరి అన్నారు. ఒక్క అరకు నియోజకవర్గంలో రూ.600 కోట్లతో రోడ్లు అభివృద్ధి చేశారన్నారు. గిరిజన ప్రాంతంలో మెడికల్ కాలేజి మంజూరు చేశారని, గిరిజనులు చదువుకుని అభివృద్ధి చెందడానికి గిరిజన యూనివర్శిటీ ఏర్పాటు చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో గిరిజన ప్రాంతాల్లోని అన్ని నియోజకవర్గాల్లో వైకాపా ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించి జగన్‌కు మద్దతుగా నిలుస్తామన్నారు.

చిరుద్యోగులపై నిర్బంధం ప్రజాస్వామ్యమా?
పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాల్లో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం గురించి గొప్పగా చెప్పిందని అయితే, ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరిన చిరుద్యోగుల మాట్లాడే స్వేచ్ఛను ఉక్కుపాదంతో అణచివేయడం ప్రజాస్వామ్యం ఎలా అవుతుందని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ. వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడుగుతున్న అంగన్‌వాడీలు, ఆశలు, కాంట్రాక్టు ఉద్యోగులపై ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించిందన్నారు. అంగన్‌వాడీలను ఎస్మా, టెర్మినేషన్ పరిధిలోకి తీసుకువచ్చిందన్నారు.

సినిమా కోసం సభను వాయిదా వేస్తారా?

- టిడిపి ఎమ్మెల్యేల నిరసన
- జిఓ ప్రతులు దగ్ధం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సినిమా కోసం శాసనసభను వాయిదా వేయించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే చెల్లిందని టిడిపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సినిమా కోసం వాయిదా వేశారని నిరసిస్తూ సభను బహిష్కరించారు. అనంతరం అసెంబ్లీ ప్రాంగణంలో ప్రభుత్వం ఐదేళ్లలో తీసుకొచ్చిన జిఓలను ప్రజాస్వామ్య వ్యతిరేక జిఓలంటూ ప్రతులను గురువారం దగ్ధం చేశారు. అనంతరం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. అసెంబ్లీ చివరి సమావేశాలను, బడ్జెట్ తతంగాన్ని ప్రభుత్వం అపహాస్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమవుతుందని చెప్పి కోరం లేకపోడంతో 9:15 గంటలకు వాయిదా వేశారని విమర్శించారు. యాత్ర-2 సినిమా విడుదల అవుతోందని చెప్పి జగన్ కోరిక మేరకు స్పీకరు సభను వాయిదా వేశారని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలన్నీ రాష్ట్ర వినాశనానికే దారి తీశాయని విమర్శించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ అంతకుముందు టిడిపి ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ప్లకార్డులతో పాదయాత్రగా అసెంబ్లీ లోపలికి వచ్చారు.

ఉద్యోగుల బకాయిలపై పిడిఎఫ్ వాయిదా తీర్మానం

- జాబ్ కేలండరు, మద్యపాన నిషేధంపై టిడిపి
- తిరస్కరించిన మండలి ఛైర్మన్

రాష్ట్రంలో ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలపై చర్చించాలని కోరుతూ పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు, స్వతంత్ర ఎమ్మెల్సీ పాకలపాటి శాసనమండలిలో ఛైర్మన్‌కు వాయిదా తీర్మానం అందించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేలకోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని కెఎస్ లక్ష్మణరావు చెప్పారు. ఉద్యోగులు దాచుకున్న పిఎఫ్, ఎపిజిఎల్ డబ్బులు కూడా వారికి రావడం లేదని పేర్కొన్నారు. ఈ బకాయిలపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. 11వ పిఆర్‌సి ఇంకా పూర్తికాలేదని, బకాయిలు ఉన్నాయని ఐ వెంకటేశ్వరరావు అన్నారు. దీనిపై చర్చకు అనుమతించాలని కోరారు. బడ్జెట్‌పై ప్రసంగించే సమయంలో ఈ అంశంపై మాట్లాడాలని ఛైర్మన్ వాయిదా తీర్మానాన్ని తిరస్కరించారు. రాష్ట్రంలో జాబ్ కేలండరు, మద్యపాన నిషేధం, దిశ చట్టం గురించి చర్చించాలని టిడిపి ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, కంచర్ల శ్రీకాంత్, బి తిరుమల నాయుడు, భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి వాయిదా తీర్మానం అందించారు. దీనిని కూడా ఛైర్మన్ తిరస్కరించారు. తాము ఇచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చించాలని పట్టుబడుతూ పిడిఎఫ్, టిడిపి సభ్యులు వారి సీట్ల వద్దే నిరసన వ్యక్తం చేశారు. సభ్యుల ఆందోళన కొనసాగుతుండగానే సభను ఛైర్మన్ కొనసాగించారు.

పొత్తుల కోసం టిడిపి వెంపర్లాట

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలుగుదేశం పార్టీ బలహీనంగా ఉంది కాబట్టే చంద్రబాబు పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయం వద్ద గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. పొత్తుల కోసం చంద్రబాబు ఎక్కడికైనా వెళ్తారనేది మరోసారి నిరూపణ అయ్యిందన్నారు. గతంలో బిజెపితో పొత్తుతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ఆ తర్వాత అదే బిజెపిని, ప్రధాని నరేంద్ర మోడీని ఇష్టారాజ్యంగా తిట్టారని గుర్తు చేశారు. ఇప్పుడు మరోసారి బిజెపితో ఏదో రకంగా పొత్తు పెట్టుకోవాలని ఆరాటపడుతున్నారని విమర్శించారు. సిఎం జగన్ ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని చూపి ఓట్లు అడుగుతుంటే.. చంద్రబాబు చేసింది చెప్పుకునేందుకు ఏమీలేక అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని అన్నారు. చంద్రబాబుకు వైఎస్ షర్మిల అద్దె మైకులా పనిచేస్తున్నారని విమర్శించారు. ఇండియా టుడే సర్వే సీ ఓటర్ సంస్థతో కలిసి చేస్తోందని, అందులో విశ్వసనీయత లేదని అన్నారు. కేవలం 18 మంది ఎమ్మెల్యేలు ఉన్న టిడిపి రాజ్యసభకు ఎలా పోటీ చేస్తుందని ప్రశ్నించారు.

పల్నాడులో రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు

- 10 నుంచి ప్రారంభం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఈ నెల 10, 11 తేదీలలో రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు పల్నాడు జిల్లా యడ్లపాడులోని నారాయణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ యం.గేయానంద్, కుర్రా రామారావులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంబరాల్లో ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, ప్రొఫెసర్లు ఎవి.స్వామి, ఎ.రామచంద్రయ్య, మాల కొండయ్య, పి.జగదీష్ చంద్ర రెడ్డి, డాక్టర్ కాలేషా బాషా తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఈ చెకుముకి సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది దేశ వ్యాప్త శాస్త్రీయ దృక్పథం ప్రచార కార్యక్రమంలో భాగంగా యడ్లపాడులో జరగనున్న రాష్ట్ర స్థాయి చెకుముకి సంబరాల్లో రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి సైన్స్ పరీక్షల్లో ప్రభుత్వ, ప్రయివేటు విభాగాలలో మొదటి స్థానం సాధించిన 52 బందాల విద్యార్థులు పాల్గొంటారన్నారు. రెండు రోజుల కార్యక్రమంలో ఇస్రో మొబైల్ వెహికల్స్ ప్రదర్శన, కొండవీడు సందర్శన, వివిధ సైన్స్ ప్రయోగాలు, మీట్ ది సైంటిస్ట్, వండర్స్ ఆఫ్ సైన్స్ షో, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. వివరాలకు 9290504570 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

టిడిపి వాయిదా తీర్మానం తిరస్కరణ

- బహిష్కరించిన సభ్యులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగ నియామకాల కోసం ప్రతి ఏడాదీ జనవరిలో జాబ్ కేలండరు విడుదల చేస్తామని, సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తామని చెప్పి అమ్మకాలను మరింత పెంచారని శాసనసభలో జాబ్ కేలండరు, మద్యపాన నిషేధంపై చర్చ జరగాలని టిడిపి వాయిదా తీర్మానం ఇచ్చింది. టిడిపి ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయులు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకరు తమ్మినేని సీతారామ్ తిరస్కరించడంతో టిడిపి సభ్యులు సభలో నినాదాలు చేస్తూ పోడియం వద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు. రాష్ట్రాన్ని గంజాయి రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. టిడిపి సభ్యుల ఆందోళనల మధ్యనే విద్యుత్ సుంకం, యూనివర్సిటీల బిల్లులను ఎలాంటి చర్చలేకుండా ప్రభుత్వం ఆమోదించుకుంది. టిడిపి సభ్యుల ఆందోళన విరమించకపోవడంతో స్పీకరు తమ్మినేని సీతారామ్ సభను వాయిదా వేశారు. దీంతో టిడిపి సభ్యులు సభను బహిష్కరించారు.

ప్రైవేటు వర్సిటీల్లో ఉచిత సీట్లను పెంచండి : పిడిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రైవేటు యూనివర్సిటీల్లోఉచిత సీట్లను 35 శాతం నుంచి మరింత పెంచాలని శాసన మండలిలో ఎమ్మెల్సీలు కె.ఎస్.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం మండలిలో పలు కళాశాలలను యూనివర్సిటీలుగా మారుస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుపై జరిగిన చర్చలో వారు పాల్గొన్నారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ కొన్ని కళాశాలల వారు అన్ని వసతులతో యూనివర్సిటీలుగా మార్పునకు విజ్ఞాపనలు ఇచ్చారని, వీటిపై బిల్లు ప్రవేశపెట్టామని తెలిపారు. ప్రభుత్వానికి భారం లేకుండా 35 శాతం సీట్లను పేదలకు ఇచ్చేందుకు అంగీకరిస్తూ ప్రతిపాదనలు వచ్చాయన్నారు.

ఈ బిల్లును తాము వ్యతిరేకిస్తున్నామని కె.ఎస్.లక్ష్మణరావు తెలిపారు. 35 శాతం పేదలకు సీట్లు ఇచ్చినా మిగతా 65 శాతంపై నియంత్రణ లేదన్నారు. కొన్ని కళాశాలలను యూనివర్సిటీలుగా మార్చి 65 శాతం సీట్లను ఇష్టానుసారంగా అమ్ముకుంటున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రైవేటు యూనివర్సిటీలపై ప్రభుత్వానికి నియంత్రణ పెరగాలన్నారు. అనంతరం బిల్లును ఆమోదిస్తున్నట్టు ఛైర్మన్ మోషన్ రాజు ప్రకటించారు. వ్యాపారస్తులు, పరిశ్రమలు వినియోగించే విద్యుత్‌పై యూనిట్‌కు రూపాయి విద్యుత్ సుంకం వసూలు చేసే బిల్లును ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రవేశపెట్టగా సభ ఆమోదించింది.

ఒకరి వెంట ఒకరు

- బాబు, పవన్, జగన్ ఢిల్లీ యాత్ర
- బిజెపి అగ్రనేతల ప్రసన్నం కోసం పాట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రానికి చెందిన మూడు పార్టీల అగ్రనేతలు మూడు రోజుల వ్యవధిలో ఒకరి తరువాత మరొకరు ఢిల్లీ యాత్ర చేపట్టారు. తొలుత టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు బుధవారం రాత్రి కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బిజెపి అధ్యక్షులు జెపి నడ్డాను కలిసేందుకు ఢిల్లీ వెళ్లారు. ఢిల్లీ చేరిన వెంటనే వీరిద్దరితో వచ్చే ఎన్నికల్లో టిడిపితో పొత్తుపై చర్చించి హైదరాబాద్‌కు పయనమయ్యారు. గురువారం ఉదయం పవన్‌కల్యాణ్ బిజెపి నేతలను కలిసేందుకు ఢిల్లీ పయనమయ్యారు. ఆయన కూడా వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేనతో కలిసి బిజెపి పొత్తు అంశాన్ని చర్చించేందుకు వెళ్లారు. అయితే బిజెపి 20, జనసేనకు 30 సీట్లు కేటాయించాలని బిజెపి అగ్రనాయకులు చంద్రబాబుకు సూచించినట్టు తెలుస్తోంది. పవన్‌కల్యాణ్‌కు కూడా వారు ఇదే రీతిలో దిశానిర్దేశం చేశారని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తద్వారా ఎన్నికల అనంతరం క్రియాశీలకంగా వ్యవహరించాలని జనసేనకు బిజెపి నాయకత్వం సూచించిందన్న సమాచారంతో టిడిపి నాయకుల్లో కలవరం ప్రారంభమైంది. బిజెపితో పొత్తు వల్ల వైసిపి ప్రభుత్వ వ్యతిరేక ఓటు టిడిపికి వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయని టిడిపిలోని సీనియర్లు మదన పడుతున్నారు. బిజెపితో పొత్తు వల్ల లాభం కన్నా నష్టం ఎక్కువ అన్న భావన టిడిపి నాయకులు అంతర్గత సంభాషణల్లో అంగీకరిస్తున్నారు. అయినా కేంద్రం మద్దతు లేకపోతే గెలవలేమనే భావన చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లో ఎక్కువగా ఉండటం వల్ల పొత్తులు అనివార్యంగా కన్పిస్తోంది. మరోవైపు వీరి పొత్తును విచ్ఛిన్నం చేసేందుకు సిఎం జగన్ కూడా వ్యూహరచన చేస్తున్నట్లు తెలిసింది. చంద్రబాబు కాంగ్రెస్ నేతలకు టచ్‌లో ఉంటున్నారని, కర్ణాటక, తెలంగాణ ఎన్నికల్లో బిజెపికి వ్యతిరేకంగా కాంగ్రెస్‌కు సహకరించారని సిఎం జగన్.. ప్రధాని మోడీ, అమిత్ షా దృష్టికి తీసుకెళ్లనున్నట్టు ప్రచారం జరుగుతోంది. గురువారం సాయంత్రం ఢిల్లీ వెళ్లిన సిఎం జగన్ శుక్రవారం ప్రధాని మోడీ, అమిత్ షాను కలవనున్నట్టు వైసిపి వర్గాలు తెలిపాయి. ప్రధానికి రాష్ట్ర సమస్యలను నివేదిస్తారని పైకి చెబుతున్నా రాజకీయ అంశాలపైనే ఆయన చర్చించనున్నట్టు తెలిసింది.

శ్రీశైలం డ్యామ్‌ను పరిశీలించిన ఎన్‌డిఎస్‌ఎ బృందం

డ్యామ్ భద్రతకు ఢోకా లేదు : ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్

శ్రీశైలం ఆనకట్టను పరిశీలిస్తున్న ఎన్‌డిఎస్‌ఎ అథారిటీ బృందం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం డ్యామ్‌ను జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఎ) నిపుణుల బృందం గురువారం పరిశీలించింది. డ్యామ్ భద్రత, ప్లంజిపూల్, బకెట్ విభాగం, నీటి నిల్వల వినియోగం, గ్యాలరీ, రోప్‌వే వంటి పలు అంశాలపై జలవనరుల శాఖ అధికారులను సేఫ్టీ అథారిటీ నిపుణులు అడిగి తెలుసుకున్నారు. ఆనకట్ట కుడి వైపున ఉన్న కొండచర్యలు విరిగి పడకుండా ఉండే విధంగా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని ఇంజనీర్లతో చర్చించారు. నిపుణుల కమిటీ పరిశీలన అనంతరం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ కబీర్‌బాష మాట్లాడుతూ.. శ్రీశైలం ఆనకట్ట భద్రతకు ఎలాంటి ఢోకా లేదని, నిర్వాహణ సక్రమంగా సాగుతున్నదని, జాతీయ డ్యాం సేఫ్టీ అథారిటీ నిపుణుల బృందం పూర్తిస్థాయిలో అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. డ్యాముపై రూ.1.30 కోట్లతో జరుగుతున్న పనులను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులతో బృందం సమీక్షించిందని, పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామన్నారు. నిపుణల బృందంలో ఢిల్లీ నుంచి వచ్చిన డిజాస్టర్, రెసిడెన్స్ సభ్యులు వివేక్ త్రిపాఠి, సాంకేతిక సభ్యులు రాకేష్ కష్యప్, డిప్యూటీ డైరెక్టర్ అమిత్ మిట్టల్, టెక్నికల్ కన్సల్టెంట్ కమలేష్ జైన్, సిడబ్ల్యుసి డైరెక్టర్ ఆర్.శరవన్నన్, కెఆర్‌ఎంబి ఎస్‌ఇ ఆర్‌వి.ప్రకాష్, యుఎస్ విద్యార్థి సైంటిస్ట్ సిఎస్‌ఎంఆర్‌ఎస్ ఇంజనీర్లు ఉన్నారు.

జగన్‌పై దాడి కేసులో నిందితుడు శ్రీనుకు బెయిల్

- పలు షరతులు విధింపు

ప్రజాశక్తి-అమరావతి

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉండగా, ఆయనపై విశాఖ విమానాశ్రయంలో జరిగిన దాడి ఘటనలో నిందితుడు జె శ్రీనివాసరావుకు హైకోర్టు గురువారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. 'విశాఖ ఎన్‌ఐఎ కోర్టు సంతృప్తి మేరకు రూ.25 వేల వ్యక్తిగత బాండ్లతో రెండు పూచికత్తులు సమర్పించాలి. తదుపరి ఉత్తర్వుల జారీ వరకు ప్రతి ఆదివారం ముమ్మిడివరం ఎస్‌ఐ ఎదుట హాజరుకావాలి. ట్రయల్ కోర్టు విచారణకు సహకరించాలి. మీడియా (ప్రింట్, ఎలక్ట్రానిక్) ఎదుట ఏ విధమైన ప్రకటనలు చేయకూడదు. వీటిని ఉల్లంఘిస్తే బెయిల్ ఉత్తర్వుల రద్దుకు పోలీసులు కోర్టును ఆశ్రయించొచ్చు. ఈ ఉత్తర్వులు కేసును విచారిస్తున్న విశాఖలోని ఎన్‌ఐఎ ప్రత్యేక కేసుల విచారణ కోర్టు దర్యాప్తునకు ఏ విధంగా ప్రభావితం కావు' అని ఉత్తర్వుల్లో పేర్కొంది. గతంలో నిందితుడికి బెయిల్ నిరాకరిస్తూ ఎన్‌ఐఎ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టేస్తూ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ యు దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన ద్విసభ్య ధర్మాసనం తీర్పు చెప్పింది.

విశాఖ ఎయిర్‌పోర్టు లాంజ్‌లో అప్పటి విపక్ష నేత, నేటి సిఎం వైఎస్ జగన్‌పై కత్తితో దాడి కేసులో నిందితుడు జె శ్రీనివాసరావు గత ఐదేళ్లుగా జైల్లోనే ఉన్నాడు. 2023 సెప్టెంబరు 22న బెయిల్‌ను ఎన్‌ఐఎ కోర్టు నిరాకరించింది. దీనిని సవాల్ చేస్తూ శ్రీనివాసరావు హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. పిటిషనరు తరపున న్యాయవాదులు పిచ్చుక శ్రీనివాసరావు, సలీం, ఎన్‌ఐఎ తరపున అడిషనల్ సొలిసిటర్ జనరల్ బి నరసింహశర్మ వాదించారు. గత నెల 24న వాద ప్రతివాదనలు ముగియడంతో హైకోర్టు తీర్పును వాయిదా వేసి గురువారం వెలువరించింది.

ట్రిపుల్ ఐటి విసిగా సిఎం

- పలు బిల్లులకు ఆమోదం తెలిపిన మండలి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజీవ్ గాంధీ యూనివర్సిటీ నాలెడ్జ్ టెక్నాలజీ (ఆర్‌జియుకెటి) వైస్ ఛాన్సలర్‌గా ముఖ్యమంత్రిని నియమించే బిల్లుకు శాసనమండలి ఆమోదం తెలిపింది. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రవేశపెట్టిన ఈ బిల్లును సభ్యులు ఆమోదించారు. వైస్ ఛాన్సలర్‌గా ముఖ్యమంత్రిని ప్రతిపాదించడానికి హేతుబద్ధత ఏమిటని పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ కెఎస్ లక్ష్మణరావు ప్రశ్నించారు. శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ప్రత్యేక దృష్టి సారించి ఈ రెండు క్యాంపస్‌లను అభివృద్ధి చేయాలని కోరారు. యూనివర్సిటీలు రాజకీయాలకు అతీతంగా ఉండాలని టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి సూచించారు. ట్రిపుల్ ఐటిల్లో విద్యార్థుల నుంచి అధిక ఫీజులను తగ్గించాలని కోరారు. దీంతోపాటు ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ ల్యాండ్స్ బిల్లు-2024కు మండలి ఆమోదం తెలిపింది. ఇళ్ల స్థలాలు ఇవ్వకముందే ప్రభుత్వ ఇళ్లల్లో వేలాది మంది పేదలు ఇళ్లు కట్టుకుని ఉంటున్నారని వీరికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కెఎస్ లక్ష్మణరావు కోరారు. వైసిపి సభ్యులు మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ.. చెరువు, వాగు పోరంబోకు స్థలాల్లో ఉంటున్న వారికి పట్టాలు అందించడం లేదని, వీటిని పరిశీలించాలని కోరారు. ఇనామ్ భూములు ఉన్న వారిని రక్షించాలని వైసిపి సభ్యులు ఎం అరుణ్‌కుమార్ కోరారు. ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ (రెగ్యులేషన్ ఆఫ్ అపోయింట్‌మెంట్స్ టు పబ్లిక్ సర్వీస్ అండ్ రేషనలైజేషన్ ఆఫ్ స్టాఫ్ ప్యాట్రాన్ అండ్ పే స్ట్రక్చరర్) బిల్లుకు ఆమోదం తెలిపారు. ఈ బిల్లును తాము వ్యతిరేకిస్తున్నట్లు కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతి ఉద్యోగులు కోరుకోలేదన్నారు. సభ్యుల ఆందోళన మధ్యే లక్ష్మణరావుకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా ఛైర్మన్ బిల్లును ఆమోదించిన వెంటనే సభను వాయిదా వేశారు.

కోరితేనే జనసేనకు గాజు గ్లాసు గుర్తు : ఇసి

ప్రజాశక్తి -అమరావతి

గాజు గ్లాసు గుర్తు కావాలని జనసేన పార్టీయే దరఖాస్తు చేసుకుందని, ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ విధానంలో ఆ గాజు గ్లాసు గుర్తును జనసేనకు కేటాయించామని కేంద్ర ఎన్నికల సంఘం హైకోర్టుకు తెలిపింది. చట్ట నిబంధనలకు అనుగుణంగానే జనసేన పార్టీకి గాజుగ్లాసు గుర్తును కేటాయించినట్లు తెలియజేసింది. జనసేన పార్టీ గుర్తింపు లభించని రిజిస్టర్డ్ పార్టీ నిర్వచనం పరిధిలోకి వస్తుందని చెప్పింది. ఈ మేరకు ఇసి తరఫున సీనియర్ అడ్వకేట్ అవినాష్ దేశాయ్ గురువారం హైకోర్టుకు తెలియజేశారు. వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ ఎన్ జయసూర్య పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని గురువారం ఆదేశించారు. గాజుగ్లాసు గుర్తును జనసేన ప్రచారానికి వినియోగించకుండా ఉత్తర్వులు జారీ చేయాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (సెక్యులర్) పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారణ జరిపింది. ఇసికి నోటీసుల జారీ చేసి విచారణను ఈ నెల 13కు వాయిదా వేసింది.

ఆర్థికమంతా అప్పులే

(మొదటిపేజీ తరువాయి)

తప్పులున్నట్లు తేల్చారు. సొరంగాలు, రిజర్వాయర్, కాలువ, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్కు అమలులో పెద్దఎత్తున లోపాలను గుర్తించినట్లు నివేదిక పేర్కొంది. సొరంగాల కంటే తక్కువ విడుదల సామర్థ్యంతో ఫీడర్ కెనాల్స్‌లో ఏర్పాటు చేశారని, దీనివల్ల ఆశించిన దానికంటే తక్కువ ఆయకట్టు సాగవుతుందని గుర్తించినట్లు పేర్కొన్నారు. డిజైన్లలో ఆమోదం, తరుచూ కాంట్రాక్టు కంపెనీలను మార్చడం వల్ల పురోగతి ఆలస్యమవుతోందనీ పేర్కొంది. టన్నెల్ బోరింగ్ మెషిన్‌కు బదులు మనుషులు, బ్లాస్ట్ మెషిన్లతో డ్రిల్లింగ్ వేయాలనే నిర్ణయం వల్ల పెద్దఎత్తున మిషనరీ వృథాగా పోయిందని తెలిపింది. బడ్జెట్ లోకేటాయింపులు చూపిస్తున్నా చెల్లింపుల్లో తీవ్ర జాప్యం ఉన్నట్లు గుర్తించారు. మొత్తం బడ్జెట్ ఆథరైజేషన్లో రూ.2190 కోట్లకుగాను రూ.1270 కోట్లు మాత్రమే చెల్లించినట్లు గుర్తించామని కాగ్ నివేదిక పేర్కొంది. చెల్లింపుల్లోనూ ఒప్పందాలను ఉల్లంఘించి అదనంగా చేసినట్లు గుర్తించింది. పనులు ప్రారంభించి 17 సంవత్సరాలు పూర్తయినా ప్రాజెక్టు ఇంకా అసంపూర్తిగానే ఉందని, దీనివల్ల కరువు పీడిత ప్రాంతానికి ప్రాజెక్టు నిర్మాణ ఉద్దేశం నెరవేరకుండా పోతోందని తెలిపింది.

స్ట్రాంగ్ రూమ్‌లోనే వదిలేసిన చోరీకి ఉపయోగించిన గ్యాస్ బండలు

ఎస్‌బిఐలో భారీ చోరీ

- రూ.50 లక్షల నగదు, బంగారు నగలు చోరీ

ప్రజాశక్తి-ఏలేశ్వరం(కాకినాడ జిల్లా)

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి ఎస్‌బిఐ బ్రాంచ్‌లో గురువారం తెల్లవారుజామున భారీ చోరీ జరిగింది. రూ.50 లక్షల నగదు, రూ.50లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్టు గుర్తించారు. బ్రాంచ్ మేనేజర్ అశోక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌పి సతీష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. బ్యాంకు భవనం వెనుక వైపున కిటికీ ఊచలను తొలగించి దుండగులు స్ట్రాంగ్‌రూమ్‌లోకి ప్రవేశించారు. గ్యాస్ కట్టర్‌తో బీరువాలను కట్ చేసి నగదు, నగలను అపహరించారు. రూ.50 లక్షల నగదు, మరో రూ. 50 లక్షల విలువచేసే బంగారం అపహరణకు గురైనట్లు ప్రాథమిక విచారణలో తేలిందని, ఘటనా ప్రాంతంలో వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఎస్‌పి తెలిపారు.

ఫెడరల్ వ్యవస్థను ఖూనీ చేస్తోన్న బిజెపి

- ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కేరళ సంఘీభావ ధర్నాలు
- రాష్ట్రాల హక్కులను కాలరాస్తోన్న కేంద్రం : రాఘవులు
- హిందూదేశంగా మార్చేందుకు కుట్రలు : వి. శ్రీనివాసరావు

విజయవాడ లెనిన్ సెంటర్‌లో చేపట్టిన సంఘీభావ ధర్నాలో పాల్గొన్న సిపిఎం, సిపిఐ నేతలు

ప్రజాశక్తి - యంత్రాంగం

కేరళలోని వామపక్ష ప్రభుత్వం పట్ల కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న వివక్షను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సంఘీభావ ధర్నాలు నిర్వహించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఫెడరలిజాన్ని విచ్ఛిన్నం చేస్తోందని, రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. ఇది కేరళతోపాటు అన్ని రాష్ట్రాలకూ తీవ్ర నష్టదాయకమని పలువురు నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.

హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన ధర్నానుద్దేశించి సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు మాట్లాడుతూ.. కేరళ వామపక్ష ప్రభుత్వం పట్ల ఆర్థికంగానే కాకుండా రాజకీయంగా కేంద్రం వివక్షను చూపుతున్నదని విమర్శించారు. కేంద్రం వివక్షపై కర్ణాటక సిఎం సిద్ధరామయ్య ఢిల్లీలో, బెంగాల్ సిఎం మమతా బెనర్జీ కలకత్తాలో ధర్నా చేశారని చెప్పారు. ప్రజలకు మేలు జరగాలన్నా, పథకాలు అమలు కావాలన్నా రాష్ట్రాలకు 60 శాతం నిధులివ్వాలని డిమాండ్ చేశారు. సిఎం పినరయి విజయన్ కేరళ కోసం కాకుండా దేశం కోసం, ప్రజల కోసం పోరాడుతున్నారని వివరించారు.

విజయవాడ లెనిన్ సెంటర్ వద్ద సిపిఎం, సిపిఐ సంయుక్తంగా నిర్వహించిన ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాష్ట్రాలకు రావాల్సిన నిధులపై కేంద్రం పెత్తనం చెలాయిస్తోందని ధ్వజమెత్తారు. అయోధ్యను అడ్డం పెట్టుకొని దేశాన్ని హిందూ దేశంగా మార్చేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. రాజకీయ ప్రాబల్యం కోసం గవర్నర్ల వ్యవస్థను నాశనం చేస్తున్నారని, ఈ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి నిరంకుశత్వం నుంచి ప్రజాస్వామ్యాన్ని, ఫెడరల్ వ్యవస్థను రక్షించుకునేందుకు, రాష్ట్రాల హక్కులను కాపాడుకునేందుకు ఢిల్లీలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తో పాటు ఆ రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు ధర్నా చేస్తున్నారని తెలిపారు. సెస్‌ల పేరుతో ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలపై భారం మోపి పన్నులను దోచుకుంటూ వారిని బానిసలుగా చేస్తున్నారని విమర్శించారు. టిడిపి, వైసిపిలు తమ పదవులు, ప్యాకేజీల కోసం రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టాయన్నారు. బుధవారం అమిత్‌షాతో జరిగిన రహస్య ఒప్పందాన్ని బహిర్గతం చేయాలని చంద్రబాబును డిమాండ్ చేశారు.

రాష్ట్ర భవిష్యత్‌ను నాశనం చేసిన బిజెపితో చంద్రబాబు పొత్తు పెట్టుకుంటే ప్రజలు ఉపేక్షించరన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు అక్కినేని వనజ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు, దోనేపూడి కాశీనాథ్, సిపిఐ విజయవాడ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు పాల్గొన్నారు. అనకాపల్లి నెహ్రూ చౌక్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు మాట్లాడుతూ.. కేరళ పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షతపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. బిజెపియేతర పాలిత రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు, కర్ణాటకను టార్గెట్‌గా చేసుకుని ఈ దాడులను తీవ్రతరం చేస్తోందన్నారు.

మోకాళ్లపై నిరసన తెలుపుతున్న డిఎస్‌సి అభ్యర్థులు, డివైఎఫ్ఐ నాయకులు

డిఎస్‌సి అభ్యర్థుల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి - అనకాపల్లి (అనకాపల్లి జిల్లా)

పూర్తి పోస్టులతో మెగా డిఎస్‌సి ప్రకటించాలని డిమాండ్ చేస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యాన అనకాపల్లిలో గురువారం డిఎస్‌సి అభ్యర్థులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ముందుగా ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి నాలుగు రోడ్ల జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ, భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న మాట్లాడుతూ.. డిఎస్‌సి ద్వారా 25వేలు పోస్టులను ప్రకటించి నోటిఫికేషన్ విడుదల చేయాలని, 117 జిఒ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 117 జిఒ పేరుతో 3, 4, 5 తరగతులను హైస్కూల్‌లో విలీనం చేయడం ద్వారా 1:40 ఉండే ఉపాధ్యాయ, విద్యార్థి రేషియోను 3 నుంచి 8వ తరగతి వరకు 1:53గా, 9, 10 తరగతులకు 1:60 రేషియోగా ప్రభుత్వం మార్చిందన్నారు. ఈ కారణంగా అదనపు ఉపాధ్యాయులు ఉన్నారని చెప్పి పాత లెక్కల ప్రకారం 25 వేలున్న పోస్టులను 6100కు ప్రభుత్వం కుదించిందని మండిపడ్డారు. అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. డివైఎఫ్ఐ అనకాపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతకాయల శివాజీ, ఎస్‌వి.నాయుడు మాట్లాడుతూ.. ఐదేళ్ల కాలంలో ఒక్క డిఎస్‌సి కూడా ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల సమయంలో కంటి తుడుపు చర్యగా 6,100 పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించడం డిఎస్‌సి అభ్యర్థులను మోసగించడ మేనన్నారు. మెగా డిఎస్‌సి ప్రకటించాలని, లేకుంటే డివైఎఫ్ఐ ఆధ్వర్యాన పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు నాని, దేముడు, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆఫీసుల్లో డిజిటల్ చెల్లింపులు

- సర్కారు కసరత్తు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో డిజిటల్ చెల్లింపులను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బ్యాంకులతోపాటు రిజర్వు బ్యాంకు సహకారం కూడా తీసుకోవాలని నిర్ణయించింది. త్వరలోనే దీనిపై సమగ్ర కార్యాచరణ చేపట్టాలని యోచిస్తోంది. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి ద్వారా అన్ని బ్యాంకులతో చర్చించాలని భావిస్తోంది. అనేక ప్రభుత్వ శాఖల్లో నగదు రసీదుల విధానం ఉంది. ప్రధానంగా రిజిస్ట్రేషన్ల శాఖ, మున్సిపల్, పంచాయతీలు, పోలీస్, మార్కెటింగ్, విద్యాశాఖ, ఆర్‌టిసి, విద్యుత్ వంటి కొన్ని శాఖల్లో నగదు లావాదేవీలు ఎక్కువగా ఉంటున్నాయి. అయితే విద్యుత్, ఆర్‌టిసి వంటి శాఖల్లో ఇప్పటికే ఎలక్ట్రానిక్ మిషన్ల ద్వారా లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఇదే తరహాలో ఇతర శాఖల్లోనూ డిజిటల్ చెల్లింపుల విధానాన్ని అమల్లోకి తీసుకురావడం ద్వారా ఆర్థిక లావాదేవీలను సులభతరం చేయొచ్చునని అధికారులు భావిస్తున్నారు. ప్రధానంగా పంచాయతీలు, మున్సిపాల్టీల్లో నగదు లావాదేవీలు అధికంగా ఉండడం తెలిసిందే. పన్నుల నుంచి, చలాన్ల వరకు ఇతర అంశాల్లోనూ ఇప్పటికీ నగదు చెల్లింపులే చోటుచేసుకుంటున్నాయి. దీనివల్ల వినియోగదారులు కూడా ఎక్కువ సమయం ఆయా కార్యాలయాల్లోనే ఉండిపోవాల్సి వస్తోంది. అందుకే ముందుగా ఈ కార్యాలయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని యోచిస్తున్నట్లు తెలిసింది. గతంలో వంద శాతం డిజిటల్ చెల్లింపుల ప్రక్రియ విధానంలో భాగంగా అనేక రకాల ఎలక్ట్రానిక్ డిజిటల్ పేమెంట్ యంత్రాల వినియోగంపై చర్యలు తీసుకున్నారు. ఇదే తరహాలో ఇప్పుడు ప్రభుత్వ శాఖల్లోనూ అమలు చేయాలని యోచిస్తున్నారు. అలాగే ఏ ప్రాంతాల్లో డిజిటల్ లావాదేవీలు ఎక్కువగా ఉన్నాయో అధ్యయనం చేసి, మిగిలిన ప్రాంతాలపై మరింత దృష్టి సారించాలని భావిస్తున్నారు. ఈ అంశాలపై శుక్రవారం కీలక సమావేశాన్ని కూడా నిర్వహించాలని అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది.

రచ్చబండలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

డిఎస్‌సి ఎన్నికల డ్రామా

రచ్చబండ, బస్సుయాత్రలో షర్మిల

ప్రజాశక్తి - ఏలూరు జిల్లా, తెనాలి

మెగా డిఎస్‌సి నిర్వహిస్తామని చెప్పిన జగన్ ఐదేళ్లు నోరుమెదపకుండా ఎన్నికల వేళ ఆరు వేల పోస్టులతో ప్రకటన ఇచ్చి తుస్సు మనిపించారని, ఇదో ఎన్నికల డ్రామా అని, నిరుద్యోగులను జగన్ మోసగించారని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. వైసిపి, టిడిపి రెండూ బిజెపి సర్కారుకు అమ్ముడుపోయినవేనని, ఏనాడు రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై పోరాటం చేసిన దాఖలాలు లేవని ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గం కొలకలూరు గ్రామంలో నిర్వహించిన రచ్చబండ, ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గం దోసపాడు మీదుగా పోతునూరు వరకూ నిర్వహించిన బస్సు యాత్రలో ఆమె పాల్గొన్నారు. అమ్మఒడి చెల్లింపులో అవకతవకలపై, జగనన్న కాలనీల్లో స్థలాల కేటాయింపులు, సామాజిక భద్రత పింఛన్లపై, నిరుద్యోగ సమస్యపై, తుపాను పరిహారం అందలేదని పలువురు రచ్చబండలో ఆమె దృష్టికి తెచ్చారు. షర్మిల మాట్లాడుతూ.. పన్నుల రూపంలో వచ్చే సొమ్ము ప్రభుత్వ పెద్దలు దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇంటిలో చదువుకుంటున్న ప్రతి బిడ్డకు ఏటా రూ.15 వేలు అమ్మబడి చెల్లిస్తానని జగనన్న హామీ ఇచ్చి, ఇప్పుడు మాట తప్పారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో రూ. ఎనిమిది లక్షల కోట్లు అప్పు చేసిందని, అందులో నుంచి కనీసం రూ.50వేల కోట్లు పోలవరం కోసం వెచ్చించలేక పోయారని విమర్శించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలను అమలు చేయలేని దిక్కు మాలిన ప్రభుత్వంగా వైసిపి ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుందని ధ్వజమెత్తారు. రానున్న 70 రోజులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు విశ్రమించవద్దని, ప్రతి ఓటరునూ కలిసి ప్రభుత్వ, ప్రతిపక్షాల వైఫల్యాలను వివరించాలని కోరారు. మాజీ కేంద్ర మంత్రులు, సిడబ్ల్యుసి సభ్యులు జెడి శీలం, గిడుగు రుద్రరాజు, మాజీ ఎంపి కనుమూరి బాపిరాజు, దంపుబోయిన చంద్రశేఖర్ పాల్గొన్నారు.

షర్మిలకు భద్రత పెంపు

పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల అభ్యర్థన మేరకు, రాష్ట్ర డిజిపి ఉత్తర్వుల మేరకు ప్రస్తుతం ఉన్న 1+1 భద్రతను 2+2కు పెంచామని వైఎస్ఆర్ జిల్లా ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ తెలిపారు. భద్రతా ప్రమాణాల నిబంధనల స్కేల్ మేరకు భద్రతా కల్పించామని వివరించారు. ఎవరైనా వ్యక్తుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని, వారికి గన్‌మెన్లను కేటాయించమని ఇంటెలిజెన్స్ విభాగం ఇచ్చే సిఫారసు సెక్యూరిటీ రివ్యూ కమిటీ నివేదిక మేరకు గన్‌మెన్లను కేటాయిస్తామని పేర్కొన్నారు.

0తనకు భద్రత కల్పించాలని రెండు రోజుల క్రితం బహిరంగంగానే షర్మిల డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పిసిసి అధ్యక్షుల హోదాలో షర్మిల పర్యటిస్తున్నారు. స్థానికంగా ప్రోటోకాల్ అంశాలను పరిగణలోకి తీసుకొని భద్రత ఏర్పాటు చేయడంతో పాటు భద్రత పెంచామని ఎస్‌పి తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ వల్ల అందరికీ ఆరోగ్యం

విశాఖలో సాగిన జెవివి సైన్స్ కళాయాత్ర

సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న జెవివి కళాకారులు

ప్రజాశక్తి -గాజువాక (విశాఖపట్నం)

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం కల్పించే నిమిత్తం జన విజ్ఞాన వేదిక (జెవివి) ఆధ్వర్యాన చేపట్టిన రాష్ట్రస్థాయి సైన్స్ కళాయాత్ర గురువారం విశాఖలో కొనసాగింది. ఈనెల నాలుగున శ్రీకాకుళంలో మొదలైన యాత్ర 18న అనంతపురంలో ముగియనుంది. విశాఖలోని మధురవాడ ప్రాంతంలోని చంద్రంపాలెం హైస్కూలు, పెందుర్తి, గాజువాకలోని జిల్లా పరిషత్ హైస్కూళ్లలో కళాయాత్ర సాగింది. గాజువాకలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జెవివి రాష్ట్ర కార్యదర్శి మురళీధర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ వల్ల అందరికీ ఆరోగ్యం కలుగుతుందన్నారు. ప్రజలకు మంచినీరు అందించేందుకు ప్రభుత్వం కృషిచేయాలని కోరారు. ప్రజలు మూఢనమ్మకాల బారిన పడకుండా కాపాడాలన్నారు. గాజువాక హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.విజయప్రశాంతి మాట్లాడుతూ.. అందరూ శాస్త్ర ప్రచారంలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం మూఢనమ్మకాలు, సైన్స్ అభివృద్ధిపై చేస్తున్న కృషి పట్ల నాటికలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు ఎస్‌వికె.పరశురాం, కె.జనార్దనరావు, అప్పారావు, డాక్టర్ ఎం.రమేష్‌కుమార్, శేషగిరిరావు, ఎస్‌వి.రమణ, పాలూరి లక్ష్మణస్వామి, ఎల్.కృష్ణారావు, ఎం.సమాచారం, కెవి.ప్రసాద్, కెవి.సత్యనారాయణ, వెంకటరావు, రంగనాథ్ పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలు ఉండకూడదనే వాటర్ ప్లాంట్ల ఏర్పాటు

ప్రారంభించిన ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

ప్రజాశక్తి-చిలమత్తూరు (హిందూపురం)

వేసవి కాలం సమీపిస్తున్న వేళ ప్రజలకు తాగునీటి కష్టాలు ఉండకూడదనే ఉద్దేశంతోనే వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశామని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. హిందూపురం నియోజకవర్గం పరిధిలోని లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో ఆయన గురువారం పర్యటించారు. హిందూపురం నియోజకవర్గం లేపాక్షి మండలం సిరివరం గ్రామం, చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టు వద్ద బాలకృష్ణ సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఉచిత వాటర్ ప్లాంట్లను ఆయన ప్రారంభించారు. ఒక్కొక్కటి రూ. ఎనిమిది లక్షల వ్యయంతో వీటిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి పాలన సాగిస్తున్న వైసిపి ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు అంబికా లక్ష్మినారాయణతో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లేపాక్షిలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

తొలి ఆరు రోజుల్లో... ఐదు రోజులు ఓడీలోనే

- రూ.2,740 కోట్లకు చేరిక

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ఖజానా వరుసగా ఓవర్‌డ్రాఫ్ట్‌లో కొనసాగుతోంది. ఈ నెల తొలి ఆరు రోజుల్లో ఏకంగా ఐదు రోజులపాటు ఓడీలోనే ఉంది. ప్రస్తుతం ఆరో తేదీ నాటికి రూ.2,740 కోట్ల వరకు ఓడీలో ఉన్నట్లు తేలింది.

జనవరి నుంచి ప్రారంభమైన ఈ చివరి త్రైమాసికంలో మొత్తం 11 రోజులు ఓడీలో ఉన్నట్లు గుర్తించారు. అలాగే ఆరో తేదీన ఉన్న ఓడీ మొత్తం గమనిస్తే, ఇతర వాస్తవ ఓవర్‌డ్రాఫ్ట్ పరిమితి దాటి ఉన్నట్లు రిజర్వు బ్యాంకు పేర్కొంది. అలాగే ఈ పరిమితి దాటి ఓడీలోకి వెళ్లడం ఇది రెండోసారి కావడం గమనార్హం.

బాలల హక్కుల పరిరక్షణలో భాగస్వాములు కావాలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

బాలల హక్కుల పరిరక్షణలో అధికారులంతా భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎస్‌సిపిసిఆర్) సభ్యులు బత్తుల పద్మావతి తెలిపారు. ఒంగోలులోని స్థానిక అంబేద్కర్ భవన్‌లో ప్రకాశం, నెల్లూరు, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల ప్రాంతీయ సదస్సు గురువారం జరిగింది. సదస్సులో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ విభాగాలు, కార్మికశాఖ, విద్యాశాఖ, పోలీసుశాఖ, వైద్య ఆరోగ్యశాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ, బిసి వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులు, బాలలతో కలసి పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులుతో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు. సదస్సుకు ఐసిడిఎస్ పిడి కె.మాధురి అధ్యక్షత వహించారు. ఐదు జిల్లాల్లో ఇటీవల కాలంలో నమోదైన బాలకార్మిక కేసులు, వీరికి ప్రభుత్వం అందిస్తున్న మ్యాచింగ్ గ్రాంట్‌పై ఎటువంటి చర్యలు చేపట్టారు.? లబ్ధి పొందిన వారి పూర్తి వివరాలపై కార్మికశాఖ అధికారుల నుంచి ఆరా తీశారు. ఐదు జిల్లాల్లో గత రెండేళ్లుగా జరిగిన బాల్య వివాహాల కేసులు ఎన్ని నమోదయ్యాయి? పోలీసులు ఎన్ని ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు? ఎంత మంది బాలికలను తిరిగి బడిలో చేర్పించారనే వివరాలు, ఫాలో అప్ నివేదికలు, బాల్య వివాహాల చట్టంపై ఎన్ని అవగాహనా కార్యక్రమాలు చేపట్టారు? వంటి వాటిపై చర్చించారు. ఆయా శాఖల నుంచి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ప్రోగ్రాం డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబి, నెల్లూరు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ సుజన, బాపట్ల ప్రాజెక్టు డైరెక్టర్, సోషల్ వెల్ఫేర్ డిడి లక్ష్మా నాయక్, మెప్మా పిడి టి.రవికుమార్, ప్రకాశం, నెల్లూరు, గుంటూరు బాపట్ల, పల్నాడు జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న బత్తుల పద్మావతి

దిగిరాని వడ్డీ రేట్లు ఆరోసారి యథాతథం



- ఆర్‌బిఐ నిర్ణయం

ముంబయి : గరిష్ట స్థాయికి చేర్చిన కీలక వడ్డీ రేట్లను తగ్గించడానికి ఆర్‌బిఐ మరోమారు నిరాకరించింది. వరుసగా ఆరోసారి మానిటరీ పాలసీ కమిటీ (ఎంపిసి) ద్రవ్య పరపతి సమీక్షలోనూ రెపో రేటును యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించింది. రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షతన మూడు రోజుల పాటు సాగిన ఎంపిసి భేటీ వివరాలను గురువారం ఆయన మీడియాకు వెల్లడించారు. రెపోరేటును 6.5 శాతం వద్దే కొనసాగించాలని నిర్ణయించింది. దాదాపు రెండేళ్ల నుంచి పెరుగుతూ వచ్చిన వడ్డీ రేట్లు గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. దీంతో గత ఏడాది ఫిబ్రవరి నుంచి రెపోరేటులో ఎలాంటి మార్పు చేయడం లేదు. తాజా నిర్ణయంతోనూ ఆరో సారి వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించినట్లయ్యింది.

విశ్లేషకుల అంచనాలను మించి భారత వృద్ధి రేటు నమోదవుతుందని శక్తికాంత దాస్ అన్నారు. దేశీయంగా ఆర్థిక కార్యకలాపాలు బలంగా ఉన్నాయన్నారు. ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి నియంత్రించాలనే లక్ష్యానికి అనుగుణంగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఆహార ధరలపై ఒత్తిళ్లను ద్రవ్య పరపతి విధాన కమిటీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందన్నారు. వచ్చే 2024-25 ఆర్థిక సంవత్సరంలోనూ భారత ఆర్థిక కార్యకలాపాలు మెరుగ్గానే ఉంటాయని అంచనా వేశారు. ప్రభుత్వ మద్దతుతో పెట్టుబడులు పుంజుకుంటున్నాయన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోనూ వినిమయం బాగానే ఉందన్నారు. వచ్చే 2024-25కు భారత జిడిపి 7 శాతం పెరగొచ్చని అంచనా వేశారు. ప్రస్తుత 2023-24లో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 5.4 శాతంగా, వచ్చే 2014-15లో 4.5 శాతంగా ఉండొచ్చన్నారు. గడిచిన ఏడాది కాలంలో రూపాయి విలువ ఒడిదొడుకులను ఎదుర్కొందన్నారు.

పేటియంలో నిరంతరం ఉల్లంఘనలు

డిజిటల్ చెల్లింపుల సంస్థ పేటియం నిరంతరం ఉల్లంఘనలకు పాల్పడిందని ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. అయితే ఆ సంస్థ అంశంలో వ్యవస్థాగతంగా ఎలాంటి లోపాలు లేవన్నారు. తరచుగా నిబంధనలను ఉల్లంఘించటం వల్లనే చర్యలు తీసుకోవాల్సి వచ్చిందన్నారు. సమస్య తీవ్రతను బట్టే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసమే పేటియంపై ఆంక్షలు విధించాల్సి వచ్చిందన్నారు. కాగా.. ఏ విషయంలో పేటియం నిబంధనలను పాటించ లేదనేది దాస్ చెప్పడానికి నిరాకరించారు. బాధ్యతాయుత నియంత్రణ సంస్థగా ఉన్న ఆర్‌బిఐ వివిధ కంపెనీలతో పరస్పర అవగాహనతో పని చేస్తుందన్నారు. నిబంధనలు అమలు చేయడానికి తగినంత సమయం ఇస్తామన్నారు. పేటియంకు నిబంధనలకు కట్టుబడి ఉండడానికి ఆ కంపెనీకి కూడా సరిపడా సమయం ఇచ్చామన్నారు. నిబంధనలు పాటించడంలో ఏ స్థాయిలో విఫలమైతే రిజర్వ్ బ్యాంక్ తీసుకునే చర్య కూడా అదే స్థాయిలో ఉంటుందని దాస్ స్పష్టం చేశారు. ఫిన్‌టెక్, ఇన్నోవేషన్, టెక్నాలజీని ప్రోత్సహించడంలో రిజర్వ్ బ్యాంక్ నిబద్ధతపై ఎటువంటి సందేహాలు అక్కర్లేదన్నారు. గురువారం బిఎస్ఇలో పేటియం షేర్ 9.99 శాతం పతనమై రూ.446.65 వద్ద ముగిసింది.

కేకే లైన్‌లో పట్టాలు తప్పిన గూడ్స్

ప్రజాశక్తి -అనంతగిరి (అల్లూరి జిల్లా)

అల్లూరి సీతారామరాజు జిల్లా కొత్తవలస- కిరండోల్ (కేకే లైన్) మార్గంలో చిమిడిపల్లి, బొర్రా మధ్య బుధవారం అర్ధరాత్రి గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. విశాఖపట్నం నుంచి కిరండోల్‌కు ఐరన్ లోడింగ్ కోసం వెళుతున్న క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మూడు బోగీలు పట్టాలు తప్పి పక్కకు ఒరిగాయి. లోకోపైలెట్ చాకచక్యంగా వ్యవహరించి రైలును నిలుపుదల చేయడంతో మిగిలిన బోగీలకు ప్రమాదం తప్పింది. ఈ ఘటన నేపథ్యంలో అరకు నుంచి కొత్తవలస, కొత్తవలస నుంచి ఎస్.కోట మీదుగా కిరండోల్ వెళ్లాల్సిన గూడ్స్, పాసింజర్ రైళ్లను అధికారులు నిలిపివేశారు. గురువారం ఉదయం తెల్లవారుజామున విశాఖ, కిరండోల్ ప్రాంతాలకు చెందిన రైల్వే అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి పట్టాలు తప్పిన మూడు బోగీలను పట్టాలెక్కించారు. వైజాగ్‌లో పాసింజర్ రైలు నిలిచిపోవడంతో బొర్రా, అరకు, కిరండోల్ వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. కొంతమంది బస్సులను ఆశ్రయించారు.

ఎల్ఐసి ఫలితాలు అదుర్స్

- క్యూ3 లాభాల్లో 49‘% వృద్ధి
- మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించిన సంస్థ
- దుమ్మురేపిన షేర్ విలువ

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని దిగ్గజ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 49 శాతం వృద్ధితో రూ.9,444 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.6,334 కోట్ల లాభాలు ఆర్జించింది. ఇదే సమయంలో రూ.1.11 లక్షల కోట్లుగా ఉన్న నికర ప్రీమియం ఆదాయం.. గడిచిన క్యూ3లో 5 శాతం పెరిగి రూ.1.17 లక్షల కోట్లకు చేరింది. 2023-24కు గాను ప్రతీ రూ.10 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేర్‌పై రూ.4 మధ్యంతర డివిడెండ్‌ను అందించడానికి సంస్థ బోర్డు ఆమోదం తెలిపింది. ఫిబ్రవరి 21వ తేదిని రికార్డ్ తేదిగా పేర్కొంది. ఆ తర్వాత 30 రోజుల్లోగా డివిడెండ్‌ను చెల్లించనుంది. దేశంలో రెండు డజన్ల పైగా బీమా కంపెనీలు ఉన్నప్పటికీ.. ఇప్పటికీ తొలి ఏడాది ప్రీమియం ఆదాయంలో ఎల్ఐసి 58.90 శాతం మార్కెట్ వాటాతో మార్కెట్ లీడర్‌గా కొనసాగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది మాసాల్లో ఎల్ఐసి నికర లాభాలు రూ.26,913 కోట్లుగా నమోదయ్యాయి. 2022-23 అదే తొలి తొమ్మిది మాసాల్లోరూ.22,969 కోట్ల లాభాలు ప్రకటించింది. 2023 డిసెంబర్ నాటికి గడిచిన తొమ్మిది మాసాల్లో సంస్థ మొత్తం వ్యక్తిగత వ్యాపార ప్రీమియం రూ.2 లక్షల కోట్ల నుంచి రూ.2.09 లక్షల కోట్లకు పెరిగింది.

ఐసిఐసిఐ బ్యాంక్‌ను దాటేసిన ఎల్ఐసి

స్టాక్ మార్కెట్‌లో ఎల్ఐసి షేర్ దూసుకుపోతుంది. గురువారం బిఎస్ఇలో 5.86 శాతం పెరిగి రూ.1,106.25 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఏకంగా 9.51 శాతం ఎగిసి రూ.1,144 గరిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. సంస్థ మార్కెట్ విలువ రూ.6.99 లక్షల కోట్లకు ఎగిసింది. దీంతో దేశంలోనే అగ్రశ్రేణి 5 స్టాక్స్ సరసన చేరింది. ఇంతక్రితం ఈ స్థానంలో ఉన్న ఐసిఐసిఐ బ్యాంక్‌ను దాటేసింది. ఎల్ఐసి షేర్ రూ.1,144కు చేరిన సమయంలో మార్కెట్ కాపిటలైజేషన్ ఏకంగా రూ.7.23 లక్షల కోట్లుగా చోటు చేసుకుంది. బిఎస్ఇ లిస్టెడ్ కంపెనీల్లో టాప్-10లో ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.19.64 లక్షల కోట్లుగా ఉంది. రెండో స్థానంలో ఉన్న టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) విలువ రూ.15.13 లక్షల కోట్లుగా, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఎం-క్యాప్ రూ.10.66 లక్షల కోట్లు, ఇన్ఫోసిస్ ఎం-క్యాప్ రూ.7.02 లక్షల కోట్లుగా ఉంది. గత నెలలో ఆరో స్థానంలో ఉన్న ఎస్‌బిఐని ఎల్ఐసి అధిగమించింది.

సంపాదకీయం

రాజ్యాంగ నిర్దేశానికి విరుద్ధం!

దేశంలో ఏకరూప పౌర స్మృతిని తెచ్చిన మొదటి రాష్ట్రంగా బిజెపి ఏలుబడిలోని ఉత్తరాఖండ్ నిలిచింది. మంగళవారం నాడు ఈ అంశాన్ని శాసనసభలో ప్రవేశపెట్టడం, బుధవారం నాడు ఆమోదించేయడం...అంతా ఆగమేఘాల మీద జరిగిపోయింది! ఇందులోని అనేక అంశాలపై చర్చించాలని, సెలక్షన్ కమిటీకి పంపాలని ప్రతిపక్షాలు చేసిన విజ్ఞప్తిని పాలకపక్షం పెడచెవిన పెట్టింది. వాస్తవానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం యుసిసిని తీసుకురావటానికి చాలా ఏళ్లుగా ప్రయత్నం చేస్తోంది. మతపరమైన ఎజెండాతో ముడిపడి ఉన్న మూడు అంశాలు దానికి తొలినుంచీ ఉన్నాయి. అవి : అయోధ్య, జమ్ము కాశ్మీర్ స్వయంప్రతిపత్తికి సంబంధించిన 370 ఆర్టికల్ రద్దు, దేశంలో ఏకరూప పౌరస్మృతిని తేవడం. ఏకాభిప్రాయ సాధన కన్నా బలవంతపు రుద్దుడే తన బాణీగా పెట్టుకున్న బిజెపి, మొదటి రెంటినీ సాధించి, ఇప్పుడు యుసిసిపై దృష్టిని సారించింది.

దేశంలోని ప్రజలందరికీ ఒకే రకమైన చట్టం ఉండాలని, కానీ, ముస్లిములకు వేరేగా ఉందని విద్వేషపూరిత ప్రచారాన్ని కాషాయ పరివారం కుమ్మరిస్తూ ఉంటుంది. వాస్తవానికి దేశంలో ఏ పౌరుడికైనా నేరశిక్షాస్మృతి ఒక్కటే! కులంతో, మతంతో, లింగంతో, ప్రాంతంలో సంబంధం లేకుండా నేరస్తులు ఎవరికైనా ఒకే రకమైన శిక్షను విధించే ఉమ్మడి చట్టాలు ఉన్నాయి. అందులో ఏ మతానికీ, కులానికీ మినహాయింపులు ఉండవు. కానీ, వివాహం, విడాకులు, దత్తత, వారసత్వం వంటి వ్యక్తిగత అంశాల్లో ఆయా తరగతుల నేపథ్యాలను, విశ్వాసాలను అనుసరించి 'పర్సనల్ లా'లు ఉన్నాయి. ఇవి ముస్లిములకు మాత్రమే కాదు; హిందువులకూ వారి సంప్రదాయాలను బట్టి నిర్మితమయ్యాయి. వీటిపై రాజ్యాంగ నిర్మాణ సమయంలోనే విస్తారమైన చర్చ జరిగింది. వ్యక్తుల విశ్వాసాల్లోకి, జీవిత సంబంధాల్లోకి రాజ్యం దూరకూడదని, బలవంతంగా 'ఒక మూస పద్ధతి'ని అమలు చేయకూడదని రాజ్యాంగ నిర్మాణకర్తలు అభిప్రాయపడ్డారు. యుసిసిని తేవటానికి ముందు ఆయా తరగతుల ప్రజల్లో ఆర్థిక, సామాజిక, లింగ సమానత్వాన్ని సాధించాలని, ఏకాభిప్రాయాన్ని నిర్మించాలని సూచించారు. కానీ, అటువంటి ప్రజాతంత్ర ప్రక్రియ ఏదీ చేపట్టకుండానే హడావిడిగా యుసిసిని ముందుకు తేవడం వెనుక ఉద్దేశం- మైనార్టీల పట్ల విద్వేషం రెచ్చగొట్టడం, మెజార్టీల ఓట్లను కొల్లగొట్టటం తప్ప మరొకటి కాదు.

2018లో మోడీ ప్రభుత్వం నియమించిన 21వ లా కమిషన్ రాజ్యాంగ కర్తల నిర్దేశానికి అనుగుణంగానే నివేదిక ఇచ్చింది. "ఐక్యంగా ఉండటానికి యుసిసి మాత్రమే పరిష్కారం కాదు.." అని పేర్కొంటూ- ఇప్పటికిప్పుడు దేశంలో ఏకరూప పౌరస్మృతిని అమలు చేయాల్సిన అవసరం లేదని తెలిపింది. అంతకన్నా ముందు ఏమేమి చేయాలో స్పష్టమైన సిఫార్సులు చేసింది. అయితే, ఆ సిఫార్సులు తమ లక్ష్యానికి భిన్నంగా ఉన్నాయి కాబట్టి, మోడీ ప్రభుత్వం వాటిని కాలం గడిచిపోయేదాకా మురగబెట్టి, తరువాత బుట్టదాఖలు చేసింది. యుసిసి అంశంపైనే 2020లో 22వ లా కమిషన్‌ని నియమించింది. ఆ కమిషన్ అధ్యయనం, అభిప్రాయ సేకరణ పనిలో ఉండగానే ఉత్తరాఖండ్ బిజెపి ప్రభుత్వం యుసిసిపై హడావిడి నిర్ణయం చేసింది!

అందరినీ సమానంగా చూడ్డానికే ఈ చట్టమని వాక్రుచ్చుతున్న ఉత్తరాఖండ్ ప్రభుత్వం- తన పాలనలో దిగజారిన మహిళా హక్కులు, బాలల విద్య వంటి విషయాల గురించి సెలవిస్తే బాగుండేది! మానవ హక్కులు, ఆరోగ్యం, తలసరి ఆదాయం వంటి అనేక కొలమానాల్లో ఆ రాష్ట్రం దారుణంగా వెనకబడటానికి కారణం బిజెపి కాదా? దైనందిన జీవన సమస్యలను పరిష్కరించకుండా వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించటం, భావోద్వేగ అంశాల వైపు ఉసిగొల్పడం ఆ పార్టీ సహజ క్రీడ. ఇంకో రెండు నెలల్లో లోక్‌సభ ఎన్నికలు రానున్న తరుణంలో నిరుద్యోగం, రైతాంగ సమస్యలు, ప్రభుత్వ రంగాన్ని అమ్మివేయడం, ప్రజలపై భారాలు వంటివి చర్చనీయాంశాలు కాకుండా చేయాలని మోడీ ప్రభుత్వం తలపోస్తోంది. ఈ వ్యూహంలో భాగంగా బిజెపి పాలిత రాష్ట్రాలు ఒక్కొక్కటి యుసిసిని తెర పైకి తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నాయి. దేశ సమైక్యతకు, సమగ్రతకూ కీలకమైన బహుళత్వాన్ని నాశనం చేయాలని చూసే ఈ విద్వేష విన్యాసాన్ని ప్రజలు అర్థం చేసుకొని, తగిన గుణపాఠం చెప్పాలి!

మహనీయుల మాట

నిన్న పోయింది.
రేపు ఇంకా రాలేదు.
మనకు ఈ రోజు మాత్రమే ఉంది.
ప్రారంభిద్దాం.
- మదర్ థెరిస్సా

విశ్లేషణ

నిధులు దిగకోస్తున్నా నోరు మెదపని జగన్

డా॥ బి.గంగారావు

> రాష్ట్ర విభజన వల్ల రాష్ట్రానికి ఏడాదికి రూ.13 వేల కోట్లు రెవెన్యూ లోటు ఏర్పడుతుంది. విభజన చట్టంలో పేర్కొన్న ప్రకారం రెవెన్యూ లోటును రాష్ట్రానికి పూర్తి స్థాయిలో కేంద్ర ప్రభుత్వం భర్తీ చేయడంలేదు. జిఎస్‌టి నష్టపరిహారం నిలిపివేశారు. పోలవరం ప్రాజెక్టుకు ఇవ్వాల్సిన నిధులు కూడా పూర్తిగా ఇవ్వకుండా మెలిక పేచీలు పెడుతున్నది. అలాగే విభజన చట్టంలో ఉన్న అనేక సంస్థలు, ప్రాజెక్టులకు నిధులు తగినంతగా కేటాయించటంలేదు. విశాఖ, విజయవాడ మెట్రో రైలు నిర్మాణాలకు నిధులు ఇవ్వటంలేదు. కడప స్టీల్‌ప్లాంట్, దుగ్గరాజుపట్నం పోర్టు ఆదిలోనే ఉన్నాయి. విశాఖ రైల్వేజోన్ ఇంకా కాగితాల మీదే ఉంది. స్పెషల్ స్టేటస్ ఇవ్వనని తెగేసి చెప్తున్నారు. ఇంత దారుణంగా రాష్ట్రానికి నష్టం జరుతున్నా బిజెపిపై ముఖ్యమంత్రి నోరు మెదపలేదు. ఈ వైఖరి రాష్ట్ర ఆర్థిక ప్రయోజనాలకు తీవ్ర నష్టం చేసేలా ఉంది.

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఇటీవల శాసన సభ సమావేశాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రసంగిస్తూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, రెవిన్యూ లోటు, తగ్గిన ఆదాయం, పెరిగిన ఖర్చులు, కేంద్ర నిధుల కోతలపై తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. ఈ సందర్భంగా కొన్ని గణాంకాలను కూడా విడుదల చేశారు. గత టిడిపి పాలనలో రాబడి, అప్పులు, ఖర్చులను తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గడ్డు పరిస్థితులను ఎలా ఎదుర్కొంటున్నారో కూడా వివరించారు. ముఖ్యమంత్రి సుదీర్ఘ ప్రసంగంలో ఆంధ్ర రాష్ట్ర ఆర్థిక వనరులను దెబ్బ తీస్తూ వివక్ష చూపుతున్న కేంద్ర బిజెపి సర్కారుపై ఒక్క మాట కూడా మాట్లాడకపోవటం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. బిజెపి ఎడల ముఖ్యమంత్రి దివాళాకోరు వైఖరి భవిష్యత్‌లో ఆంధ్ర రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టవేస్తుంది. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను, అభివృద్ధిని దెబ్బతీస్తుంది.

ముఖ్యమంత్రి ప్రకటించిన గణాంకాల ప్రకారమే 2018-19లో కేంద్ర పన్నుల నుండి ఆంధ్ర రాష్ట్రానికి రూ.32 వేల కోట్ల నిధులు బదిలీ అయితే 2019-20లో 28 వేల కోట్లకు, 2022-23కి రూ.24 కోట్లకు తగ్గిపోయాయి. ఇదే కాలంలో మొత్తం కేంద్ర పన్నుల్లో ఆంధ్ర రాష్ట్ర వాటా చూస్తే 3.75 శాతం నుండి 2.92 శాతానికి కోతబడింది. కాని 2014-19 కాలంలో దేశ స్థూల జాతీయోత్పత్తికి 4.47 శాతం వాటాగా మన రాష్ట్ర జిడిపి అందిస్తే అది నేడు 4.82 శాతానికి పెరిగింది. గడిచిన పదేళ్ళలో రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి రూ.5.24 లక్షల కోట్ల నుండి రూ.14.39 లక్షల కోట్లకు పెరిగింది. రాష్ట్రం నుండి కేంద్ర పన్ను ఆదాయానికి వెళ్తున్న ఆదాయం కూడా పెరిగింది. కాని కేంద్రం నుండి రాష్ట్రానికి రావాల్సిన పన్నుల వాటా మాత్రం కోతబడుతున్నది. రాష్ట్రానికి జరుగుతున్న ఈ అన్యాయంపై ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వాన్ని ఏ మాత్రం నిలదీయలేదు. పైగా కేంద్ర కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్ 12.76 శాతం ఉండటంతో అనుకున్న మేర రాష్ట్రానికి మోడీ ప్రభుత్వం నిధులివ్వలేకపోయిందని సన్నాయి నొక్కులు నొక్కారు.

రాష్ట్ర విభజన వల్ల రాష్ట్రానికి ఏడాదికి రూ.13 వేల కోట్లు రెవెన్యూ లోటు ఏర్పడుతుంది. విభజన చట్టంలో పేర్కొన్న ప్రకారం రెవెన్యూ లోటును రాష్ట్రానికి పూర్తి స్థాయిలో కేంద్ర ప్రభుత్వం భర్తీ చేయడంలేదు. జిఎస్‌టి నష్టపరిహారం నిలిపివేశారు. పోలవరం ప్రాజెక్టుకు ఇవ్వాల్సిన నిధులు కూడా పూర్తిగా ఇవ్వకుండా మెలిక పేచీలు పెడుతున్నది. అలాగే విభజన చట్టంలో ఉన్న అనేక సంస్థలు, ప్రాజెక్టులకు నిధులు తగినంతగా కేటాయించటంలేదు. విశాఖ, విజయవాడ మెట్రో రైలు నిర్మాణాలకు నిధులు ఇవ్వటంలేదు. కడప స్టీల్‌ప్లాంట్, దుగ్గరాజుపట్నం పోర్టు ఆదిలోనే ఉన్నాయి. విశాఖ రైల్వేజోన్ ఇంకా కాగితాల మీదే ఉంది. స్పెషల్ స్టేటస్ ఇవ్వనని తెగేసి చెప్తున్నారు. ఇంత దారుణంగా రాష్ట్రానికి నష్టం జరుతున్నా బిజెపిపై ముఖ్యమంత్రి నోరు మెదపలేదు. ఈ వైఖరి రాష్ట్ర ఆర్థిక ప్రయోజనాలకు తీవ్ర నష్టం చేసేలా ఉంది.

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి రాజ్యాంగబద్ధంగా ఆర్థిక సంఘం నిర్ణయించిన ప్రకారం స్థూల పన్నుల నుండి రాష్ట్రాలకు బదిలీ చేయాల్సిన నిధుల్లో అనేక రకాల కోతలు విధిస్తూ రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతున్నది. 14వ కేంద్ర ఆర్థిక సంఘం స్థూల పన్ను ఆదాయం నుండి రాష్ట్రాలకు 42 శాతం ఇవ్వాలని నిర్ణయించింది. 15వ ఆర్థిక సంఘం (ప్రస్తుతం అమలులో ఉన్న) కనీసం 41 శాతం (జమ్ము, కాశ్మీర్, లడక్‌ల వాటా మినహాయించగా) రాష్ట్రాలకు ఇవ్వాలని ఆదేశించింది. అయినా కేంద్ర ప్రభుత్వం ఈ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నది. 14వ ఆర్థిక సంఘం కాలంలో 35 శాతం మాత్రమే నిధులు రాష్ట్రాలకు బదిలీ చేసింది. ప్రస్తుతం అమలులో ఉన్న 15వ ఆర్థిక సంఘం కాలంలో మరింత కోత పెడుతున్నది. 2023-24లో 30 శాతానికి దిగకోసింది.

ఇదే కాలంలో కేంద్ర స్థూల పన్ను ఆదాయ రాబడులు 2014-15లో రూ.14.6 లక్షల కోట్ల నుండి 2023-24కి రూ.33.6 లక్షల కోట్లకు పెరిగింది. రాష్ట్రాలకు బదిలీ చేసిన నిధులు రూ.5.1 లక్షల కోట్ల నుండి రూ.10.2 లక్షల కోట్లకు పెరగ్గా, కేంద్రానికి అంతకన్నా ఎక్కువగా నిధులు పెరిగాయి. రాష్ట్రాల వాటాలో కోత పెడుతూ కేంద్రం తన దగ్గర నిధులను భారీగా పెంచుకుంటున్నది.

కేంద్ర ఆర్థిక సంఘం రాష్ట్రాలకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో కేంద్రం ఇవ్వాల్సిన నిధులను కూడా ప్రతిపాదిస్తుంది. పన్ను ఆదాయం పెరిగే కొద్దీ ఈ గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద రాష్ట్రాలకు ఇచ్చే నిధులు కూడా పెరగాలి. కానీ మోడీ ప్రభుత్వం గ్రాంట్ ఇన్ ఎయిడ్ నిధులు పెంచకపోగా ఆర్థిక సంఘం ఆదేశించిన నిధులు కూడా ఇవ్వకుండా కోత పెడుతున్నది. 2015-16 దీని కింద రూ.1.95 లక్షల కోట్లు ఇవ్వగా 2023-24కి రూ.1.65 లక్షల కోట్లకు తగ్గించేసింది. ఆర్థిక సంఘం ప్రతి ఐదేళ్లకొకసారి నియమించబడుతుంది. కేంద్ర, రాష్ట్ర పరిధిలో వసూళ్లు అయి కేంద్రం దగ్గరకు చేరే స్థూల పన్ను ఆదాయంలో కేంద్రానికి-రాష్ట్రాలకు ఎంతెంత వాటా ఉండాలనే ఫార్ములా నిష్పత్తిని ఆర్థిక సంఘం నిర్ణయిస్తుంది. అలాగే గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో రాష్ట్రాలకు ఎంతెంత ఇవ్వాలనేది కూడా ఆర్థిక సంఘం సూచిస్తుంది. ఈ రెండూ స్టాట్యూటరీ నిబంధనలు. కేంద్ర ప్రభుత్వం తప్పనిసరిగా వీటిని అమలు చేయాలి. కానీ కేంద్ర ప్రభుత్వం ఈ స్టాట్యూటరీ నిబంధనలను అమలు చేయడం లేదు. స్థూల పన్ను ఆదాయం నుండి రాష్ట్రాలకు నిధులు బదిలీ చేయకుండా నికర పన్ను ఆదాయం నుండి ఏకపక్షంగా రాష్ట్రాలకు నిధులు బదిలీ చేస్తున్నది. స్థూల పన్ను ఆదాయం నుండి...అనగా సెస్, సర్ చార్జీల నుండి వచ్చే ఆదాయాన్ని, కేంద్రపాలిత ప్రాంతాల నుండి పన్నుల రూపంలో వచ్చే ఆదాయాన్ని, పన్నుల వసూళ్లకు పాలనా పరంగా అయ్యే వ్యయాన్ని మినహాయిస్తే వచ్చే ఆదాయాన్ని నికర పన్ను ఆదాయం అంటారు. ఈ మూడింటిలో సెస్, సర్ ఛార్జీల ద్వారా ఆదాయం భారీగా పెరుగుతున్నది. ఉదాహరణకు 2015-16లో స్థూల పన్ను ఆదాయంలో ఈ పద్దు కింద 5.9 శాతం (రూ.85638 కోట్లు) ఆదాయం రాగా, 2023-24కి 10.8 శాతానికి (రూ.3.63 లక్షల కోట్లకు) పెరిగింది. ఈ ఆదాయంలో రాష్ట్రాలకు వాటా ఇవ్వకుండా కేంద్రం ఎగ్గొడుతున్నది. ఫలితంగా రాజ్యాంగబద్ధంగా రాష్ట్రాలకు ఇవ్వవలసిన స్థూల పన్నుల్లో వాటా, గ్రాంట్ ఇన్ ఎయిడ్ రెండు కలిపి చూస్తే 49.2 శాతం నుండి 35.32 శాతానికి కుదించబడింది.

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాల ద్వారా కూడా రాష్ట్రాలకు వాటిని అమలు చేయడానికి నిధులు బదిలీ అవుతాయి. వీటిలో కేంద్ర ప్రభుత్వ స్పాన్సర్డ్ పథకాలు (సిఎస్ఎస్), మరొకటి కేంద్ర ప్రభుత్వ సెక్టార్ పథకాలు ముఖ్యమైనవి. కేంద్ర స్పాన్సర్డ్ పథకాల ద్వారా వచ్చే నిధులన్నీ ఆ పథకాలకే ఖర్చు చేయాలి. వేరే అవసరాలకు ఈ నిధులను వినియోగించుకోవడానికి రాష్ట్రాలకు వీలు లేదు. ఈ పథకాల ద్వారా కేంద్ర ప్రభుత్వం అనేక షరతులు రాష్ట్రాలకు విధిస్తున్నది. ముఖ్యంగా ప్రైవేటీకరణ విధానాలు, రాష్ట్ర ప్రభుత్వాల ఆయా రంగాల నిర్వహణ బాధ్యతల నుండి వైదొలగి ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు వాటిని అప్పగించాలనే నిబంధనలు పెడుతున్నది. ఈ పథకాల అమలుకు 50 శాతం మాత్రమే కేంద్రం నిధులిస్తుంది. మిగిలిన 50 శాతం వాటా రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలి. అందువల్ల కొన్ని బలహీనమైన రాష్ట్రాలు ఈ పథకాల నిధులను ఉపయోగించుకోలేక పోతున్నాయి. గత రెండేళ్లలో సుమారు రూ.86 వేల కోట్ల నిధులను రాష్ట్రాలు వినియోగించుకోక పోవడంతో కేంద్రానికి మిగిలిపోయాయి.

కేంద్ర ప్రభుత్వ సెక్టార్ పథకాల ద్వారా కేంద్ర ప్రభుత్వం బిజెపి యేతర రాష్ట్రాలకు తీవ్ర హాని చేస్తున్నది. దీని కింద సుమారు 740 పథకాలు కేంద్రం అమలు చేస్తున్నది. ఈ పథకాల కింద అయ్యే వ్యయం పూర్తిగా కేంద్ర ప్రభుత్వం భరిస్తుంది. వీటి ద్వారా బిజెపి పాలిత రాష్ట్రాలకు పెద్ద ఎత్తున నిధులు బదిలీ చేస్తూ మిగిలిన రాష్ట్రాల ఎడల వివక్షత చూపుతున్నది.

రాష్ట్రాలు తీసుకునే రుణాలపై కూడా బిజెపి ప్రభుత్వం అనేక ఆంక్షలు పెడుతూ రాష్ట్రాల ఆర్థిక వనరులను దెబ్బతీస్తున్నది. రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (ఎస్‌జిడిపి)లో మూడు శాతానికి మించి అప్పులు తీసుకోరాదని ఆంక్షలు విధిస్తున్నది. ద్రవ్య బాధ్యత-బడ్జెట్ నిర్వహణ (ఎఫ్‌ఆర్‌బిఎం) నిబంధన చట్టాన్ని తీసుకొచ్చి ఈ పరిమితిని రాష్ట్రాలపై కేంద్రం విధిస్తున్నది. ప్రతి ఏడాది రాష్ట్రాలు ఎంతెంత రుణాలు తీసుకోవాలో ముందుగా కేంద్రం నిర్ణయిస్తుంది. దీని ప్రకారం ఈ రుణాలను రాష్ట్రాలు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, చిన్న పొదుపు మొత్తాల నుండి మార్కెట్‌లో బాండ్లను అమ్మడం తదితరాల ద్వారా నిధులు సేకరిస్తాయి. ఈ అప్పులు బడ్జెట్ పత్రాల్లో చూపించబడతాయి.

ఈ అప్పుల ద్వారా సేకరించిన నిధులు కూడా నిర్దేశించుకున్న ఖర్చుల నిర్వహణకు సరిపోనప్పుడు రాష్ట్రాలు తమ పరిధిలో తమ సంస్థలకు, శాఖలకు రుణాలు సేకరించుకోవాలని ఆదేశిస్తాయి. ఇవి తమ ఆస్తులను తనఖా పెట్టడం ద్వారా లేదా ఆదాయాన్ని చూపి బ్యాంకుల ద్వారా, బాండ్ల ద్వారా రుణాలు సేకరించుకుంటాయి. ఈ రుణాలను రాష్ట్ర బడ్జెట్ పత్రాల్లో చూపించవు. ఈ రుణ వ్యయంపై చెల్లించాల్సిన అసలు, వడ్డీని కూడా బడ్జెట్‌లో చూపరు.

ఇప్పుడు ఈ బడ్జెట్ యేతర రుణాలను కూడా బడ్జెట్‌లో చూపించాలని మొత్తం ఎస్‌జిడిపిలో 3 శాతానికి మించరాదని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేస్తున్నది. రాష్ట్రాలు వివిధ మార్గాల ద్వారా సేకరించుకునే రుణాలపై పరిమితులు విధించడం ద్వారా రాష్ట్రాలను లొంగ దీసుకోవాలనే కుట్ర పన్నింది. ఇంత దారుణానికి కేంద్ర ప్రభుత్వం వొడిగడుతున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి కేంద్రాన్ని ఒక్క మాట కూడా అనటంలేదు.

రాష్ట్రాల పట్ల కేంద్ర ప్రభుత్వం చూపుతున్న వివక్షత ముఖ్యంగా రాష్ట్రాలకు రావాల్సిన పన్నుల్లో వాటా కుదించివేయడం, జిఎస్‌టి నష్ట పరిహారం నిలిపివేయడం, రెవిన్యూ లోటు భర్తీకి ఇవ్వాల్సిన గ్రాంట్లను తొక్కిపెట్టడం, రాష్ట్రాలు చేసే రుణాల పరిమితిని కుదించి వేయడంపై చాలా రాష్ట్రాలు నిరసనలు, ఆందోళనకు దిగుతున్నాయి. గత ఏడాది కేంద్ర వివక్షత వల్ల కేరళ రూ.57 వేల కోట్లు, కర్ణాటక రూ.62 వేల కోట్లు నిధులు కోల్పోయాయని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రులే వెల్లడించారు. తమిళనాడు ఆర్థికమంత్రి అయితే ఆ రాష్ట్రం నుండి వివిధ పన్నుల రూపంలో కేంద్రానికి ఉదాహరణకు రూ.100 చేరుతుంటే కేంద్రం తిరిగి తమిళనాడుకి కేవలం రూ.29 మాత్రేమే ఇస్తుందని, అదే ఉత్తరప్రదేశ్‌కి రూ.173 ఇస్తుందని విమర్శించారు.

కేంద్ర వివక్షతను కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సైతం చాలెంజ్ చేస్తున్నది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ దేశ రాజధాని ఢిల్లీలో మహా ధర్నా చేశారు. తమిళనాడు, కర్ణాటక ముఖ్యమంత్రులు కూడా ఢిల్లీలో నిరసనకు దిగుతున్నారు. ఈ పరిస్థితుల్లోనైనా ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి మోడీ ప్రభుత్వాన్ని కనీస విమర్శకు సిద్ధపడటంలేదు. అడుగడుగున అంటకాగుతున్నారు. రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారు. కేంద్ర వివక్షతకు వ్యతిరేకంగా దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక మంత్రులు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నా ఆ వేదికల్లో సైతం భాగస్వామ్యం కావడం లేదు.

ఇక రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు కూడా బిజెపికి గులాంగిరి చేస్తున్నారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై మోడీని ఏ మాత్రం నిలదీయకుండా వచ్చే ఎన్నికల్లో పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారు. ఇక పవన్ కళ్యాణ్ ఏకంగా మోడీ పంచన చేరిన విషయం తెలిసిందే. ఈ ముగ్గురు ఒకరినొకరు విమర్శించుకుంటూ బిజెపి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నిస్సిగ్గుగా బిజెపి విధానాలను బలపరుస్తున్నారు. గతంలో కేంద్ర ఆధిపత్యానికి వ్యతిరేకంగా రాష్ట్రాల హక్కుల రక్షణ కోసం జ్యోతిబసు, ఫరూక్ అబ్దుల్లా, రామక్రిష్ణ హెగ్డే వంటి వారితో కలిసి ఆ నాడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా వున్న ఎన్.టి.రామారావు పోరాడారు. ఈ వారసత్వాన్ని వైఎస్‌ఆర్‌సిపి, టిడిపి, జనసేన పార్టీలు తుంగలో తొక్కాయి. ఈ మూడు పార్టీలూ అవకాశవాద, స్వార్థ రాజకీయ వైఖరితో ఆంధ్ర రాష్ట్రానికి, ప్రజలకు తీవ్ర హాని చేస్తున్నాయి. రాష్ట్రాని తీవ్ర ప్రమాదంలోకి నెడుతున్నాయి.

స్వాతంత్య్రం వచ్చిన తరువాత ఇంతలా ఆర్థిక కేంద్రీకృత పద్ధతిలో రాష్ట్రాల ఆర్థిక వనరులపై దాడి చేసిన ప్రభుత్వం దేశంలో మరొకటి లేదు. రాష్ట్రాలను భయపెడుతూ, బలవంతంగా లొంగదీసుకుంటూ, రాష్ట్రాల ఆర్థిక ఫెడరల్ స్ఫూర్తిని బిజెపి దెబ్బ తీస్తున్నది. ఫెడరలిజం అంటే కేవలం ఒక పరిపాలనా విధానం మాత్రమే కాదు. ఇందులో జాతీయ స్ఫూర్తి, సమైక్యత, చైతన్యం సమ్మిళతమై ఉంటుంది. భారతీయులమనే భావనతోపాటు ప్రతి రాష్ట్ర పౌరుడు పలానా రాష్ట్రానికి చెందిన వాడినని గర్వంగా చెప్పుకుంటారు. ఈ రెండు భావాల మధ్య ఎప్పుడూ ఘర్షణ రాకూడదు. రెండింటి మధ్య సమ భావన ఉండాలి. కాని కేంద్ర బిజెపి రాష్ట్రాల ఆర్థిక జీవనాడులపై, ఫెడరల్ వ్యవస్థపై సాగిస్తున్న దాడి...జాతి చైతన్యానికి, రాష్ట్రాల సమైక్యత, సమగ్రతలకు ప్రమాదం తెచ్చిపెడుతున్నది.

/ వ్యాసకర్త సెల్ : 9490098792 /

నివాళి

ఎవరీ ఉత్తర భారత పెరియార్ - లలై సింగ్ ?

డా॥ దేవరాజు మహారాజు

ద్రవిడోద్యమ నాయకుడు, సంఘసంస్కర్త ఇ.వి.రామస్వామి పెరియార్ 'కీమాయణాన్ని' తొలిసారి 'సచ్చీ రామాయణ్' శీర్షికతో హిందీలోకి అనువదించిన రచయిత లలై సింగ్ యాదవ్. ఆ స్క్రిప్టు చూసి యు.పి నుండి ఢిల్లీ దాకా ఏ ప్రచురణకర్తా ముందుకు రాలేదు. మనువాదులు సృష్టించిన భయం అందుకు కారణం. అప్పుడాయన తన 15 ఎకరాల భూమి అమ్మి ఒక ప్రింటింగ్ ప్రెస్సే ప్రారంభించాడు. అందులో సచ్చీ రామాయణ్ ప్రచురించాడు. అయితే అది గొప్ప సంచలనమయ్యింది. హిందూ ధర్మ పరిరక్షకులమని భావించే వారంతా తమ ధార్మిక భావనలు దెబ్బ తిన్నాయని పెద్ద ఎత్తున రోడ్డెక్కి ప్రదర్శనలిచ్చారు. వారి ఒత్తిడికి తలొగ్గిన ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, గజెట్ 20 డిసెంబర్ 1961న విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం ఆ పుస్తకం హిందీ, ఇంగ్లీషు ప్రతుల్ని జప్తు చేసుకుంది. న్యాయం కోసం లలై సింగ్ అలహాబాదు హైకోర్టు తలుపు తట్టాడు.

ఈ పుస్తకం అధిక సంఖ్యాకులైన హిందువుల మనోభావాల్ని దెబ్బతీస్తోందనీ, పుస్తకాన్ని నిషేధించడం అవసరమని ప్రభుత్వ లాయరు తన వాదన వినిపించాడు. లలై సింగ్ పక్షాన వాదించిన అడ్వొకేట్ 'సచ్చీ రామాయణ్' ఔన్నత్యాన్ని బలంగా వినిపించి, కేసును నెగ్గించారు. 1971 జనవరి 19న జస్టిస్ ఎ. కీర్తి వెలువరించిన తీర్పు-రెండు మూడు విషయాలు స్పష్టం చేసింది. దేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛ ఉంది కాబట్టి, మూల రచయిత పెరియార్ రామసామి తన అభిప్రాయాలు తెలియజేశారనీ, ఈ లలై సింగ్ కేవలం పెరియార్ పుస్తకాన్ని అనువదించాడని, ఇది అంత తీవ్రంగా వ్యతిరేకించాల్సిన అవసరం లేదని చెప్పింది. బహుజన క్రాంతి నాయకుడైన లలై సింగ్ గెలిచి, మనువాదుల నోళ్ళు వారి చేతిలో కీలుబొమ్మగా మారిన ఆనాటి ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం వారి నోరూ మూయించాడు. పెరియార్ ఇ.వి. రామసామి ఆలోచనల్ని జనంలోకి బాగా తీసుకు పోయినందుకు జనం లలై సింగ్‌ను 'ఉత్తర భారత పెరియార్' అని పిలుచుకున్నారు.

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అంతటితో ఆగి-తన గౌరవం కాపాడుకుంటే బాగుండేది. కానీ తను తీసుకున్న చర్యలకు విరుద్ధంగా తీర్పు వచ్చినందుకు కేసును మళ్ళీ సుప్రీంకోర్టుకు తీసుకెళ్ళింది. సుప్రీంకోర్టు 1976 సెప్టెంబర్ 16న పుస్తక రచయిత, ప్రచురణకర్త అయిన లలై సింగ్‌కు అనుకూలంగా తీర్పు వెలువరించిది. అంటే-అలహాబాదు హైకోర్టు ఇచ్చిన తీర్పు సబబుగా ఉందని సుప్రీంకోర్టు ఆమోద ముద్ర వేసింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ వాదనను తిప్పికొట్టింది. పెరియార్ ఇ.వి. రామసామి భావజాలానికి బాగా ఆకర్షితుడైన లలైసింగ్, ఆయన నాయకర్‌ను వదిలేసిన విధంగా-ఈయన కులం గుర్తుగా ఉన్న యాదవ్‌ను వదిలేశాడు. కాన్పూర్ దగ్గర ఏదో చిన్న ఊళ్ళో ఉండేవాడు. పెద్ద పెద్ద కోర్టులలో ఏళ్ళకేళ్ళు పోరాడి కేసులు గెలుస్తూ, న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా తన చర్యను సమర్థించుకున్నందుకు సమాజం ఉలిక్కిపడింది. అందరి దృష్టి లలైసింగ్‌పై పడింది. ఎవరీ లలై సింగ్ యాదవ్? ఏమిటీ సచ్చీ రామాయణ్-అని తెలుసుకోవడం ప్రారంభించారు. క్రమంగా లలై సింగ్ దళిత, బహుజన నాయకుడిగా స్వాతంత్ర్య సమరయోధుడిగా ఎదుగుతూ పెరియార్ రామసామి ధోరణిలో రచనలు చేయడం ప్రారంభించాడు.

చౌధరీ లలై సింగ్ యాదవ్ (1 సెప్టెంబర్ 1911-7 ఫిబ్రవరి1993) ఉత్తర ప్రదేశ్ కాన్పూర్ దేహత్ జిల్లాలో జిజక్ రైల్వే స్టేషన్ సమీపంలో కఠారా గ్రామంలో చౌధరీ గజ్జుసింగ్ యాదవ్, మూలాదేవి దంపతులకు జన్మించాడు. 1911లో దేశం ఒకవైపు బ్రిటీషు పాలనలో ఉంది. మరోవైపు మనువాదుల ఆధిపత్యంలో ఉంది. వీరిది ఆస్థిపాస్తులున్న సంపన్న కుటుంబమే, కానీ బ్రాహ్మణవాద ప్రభావం వల్ల సమాజంలో అణగిమణగి ఉండాల్సి వచ్చేది. శూద్రులయినందువల్ల ఆ గ్రామంలో చదువుకునే అవకాశం ఉండేది కాదు. ఇష్టమైన బట్టలు వేసుకోవడానికి లేదు. అత్యంత సాధారణ జీవితం గడపాల్సి వచ్చేది. ఆ రోజుల్లో శూద్రుల స్థాయి ఎలా ఉండేదో ఒక సంఘటన చూద్దాం! ఊళ్ళో ఎవరి ఇంట్లో పెళ్ళయినా, మహిళలంతా పెళ్ళి ఇంటికి వెళ్ళి పనుల్లో సహాయపడేవారు. ఒకసారి ఒక అగ్రవర్ణం వారి పెళ్లి పనులు చేయడానికి లలై సింగ్ తల్లి వెళ్ళింది. బయట ఉండి బయటి పనులు చేయకుండా తనకు వంట బాగా వచ్చు గనక, నేరుగా వంటశాలకు వెళ్ళింది. అక్కడ ఉన్న అగ్రశ్రేణి మహిళలంతా ఆమెను అవహేళన చేశారు. నానామాటలు అన్నారు. వివక్షకు వ్యతిరేకంగా పోరాడే ఆత్మస్థైర్యాన్ని తమ పుత్రుడికివ్వాలని ఆ రోజే ఆ దంపతులు నిర్ణయించుకున్నారు.

గజ్జూసింగ్ అభ్యుదయ భావాలు గలవాడు గనుక తన కొడుకు విద్యావంతుడు కావాలనీ, సంఘసంస్కర్తగా మారాలనీ కలలుగనేవాడు. తన పరిధిలో తాను కొన్ని దురాచారాలకు ఎదురు తిరిగేవాడు. సమాజంలో సవరించాల్సిన సమస్యలు చాలా ఉన్నాయని గ్రహిస్తూ వచ్చాడు లలై సింగ్. తండ్రి ప్రోత్సాహానికి తోడు, తనకు కూడా ఆసక్తి ఉండడం వల్ల శ్రద్ధ చదువు మీద పెట్టాడు. దేశంలో బాల్యవివాహాలు ఉధృతంగా జరుగుతున్న రోజులవి. 18వ యేట ఫారెస్ట్ గార్డ్‌గా ఉద్యోగంలో చేరాడు. ఆ తర్వాత 20వ యేట దులారి దేవిని పెళ్లి చేసుకున్నాడు. తర్వాత కొన్ని నెలలకే, గ్వాలియర్‌లో పారా మిలట్రీ ఫోర్స్‌లో కానిస్టేబుల్‌గా కొత్త ఉద్యోగంలో చేరాడు. అక్కడ కూడా అసమానతలు, వివక్షా ఉన్న సంగతి గ్రహించి తిరుగుబాటు చేశాడు. ఒకే ఉద్యోగంలో ఉన్నప్పుడు అందరూ సమానులే కదా? కానీ, స్నానం చేసే చోట, భోజనం చేసే చోట ప్రతి విషయంలోనూ మనువాద ఆధిపత్యం కనిపించేది. అగ్రవర్ణాలనికి చెందిన కానిస్టేబుళ్ళు పైన స్నానం చేస్తే-వారు స్నానం చేసిన నీరు కిందకి పారినపుడు, ఆ నీళ్ళలో శూద్ర-నిమ్న కులాల కానిస్టేబుళ్ల స్నానాలు చేయాల్సి వచ్చేది. లలై సింగ్ ఆ పద్ధతిని ఎదిరించాడు. పై అధికారులకు అది క్రమశిక్షణా రాహిత్యంగా అనిపించి సస్పెండ్ చేశారు. పైనున్న ఒక బ్రిటీషు అధికారి అసలు విషయం తెలుసుకుందామని లలై సింగ్‌ను పిలిపించుకుని విచారించాడు. బయట సమాజంలో ఉన్న అమానవీయ విధానాలు పోలీసు - మిలట్రీ శాఖలలో కూడా ఉన్నాయని లలై సింగ్ వివరణ ఇచ్చుకున్నాడు. వివక్ష వికృతత్వాన్ని అర్థం చేసుకున్న ఆ బ్రిటీష్ అధికారి అందరూ సమానులే అని ప్రకటించాడు. పైగా లలై సింగ్ యాదవ్‌కు ప్రమోషన్ ఇచ్చి ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఇలాంటి అవకతవకల మీదే లలైసింగ్ తర్వాత కాలంలో 'సిపాయి క తబాహీ' అనే చిన్న పుస్తకం రాశాడు. ఉధృతంగా సాగుతున్న భారతదేశ స్వాతంత్ర్యోద్యమానికి మద్దతు ప్రకటించాడు. బ్రిటీషు ఉద్యోగిగా ఉంటూ అలా చేయడం వల్ల ఐదేళ్ళు జైలు శిక్ష పడింది. ఆ రకంగా స్వాతంత్ర్య సమర యోధుడిగా చరిత్రలో నిలిచాడు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి లలైసింగ్ శిక్ష ఇంకా సంవత్సరం కూడా పూర్తికాలేదు. మిగతా శిక్ష పూర్తి కాకుండానే స్వతంత్ర భారతంలో విడుదలై బయటికొచ్చాడు. లలై సింగ్ జీవితంలో ఒకే సమయంలో రెండు పోరాటాలు చేశాడు. ఒకటి-బ్రిటీష్ వారితో పోరాటం! మరొకటి పెరియర్ రామసామి, డా.బి.ఆర్.అంబేద్కర్‌ల అనుయాయిగా బ్రాహ్మణవాదులతో పోరాటం!!

భార్య, కుమార్తె చనిపోవడంతో వ్యక్తిగతంగా లలై సింగ్ జీవితాంతం దుఃఖమయమైన జీవితం గడపాల్సి వచ్చింది. మళ్ళీ పెళ్ళి చేసుకుని జీవితం పునరుద్ధరించుకోమని బంధుమిత్రులంతా చెప్పారు. కానీ, ఆయన అందుకు సమ్మతించలేదు. దృష్టి సమాజ ఉద్ధరణ మీద, మూఢనమ్మకాల నిర్మూలన మీద, కొనసాగుతున్న వివక్ష మీద చెయ్యాల్సిన పోరాటాల మీద పెట్టి-జీవితం కొసాగించాడు. వీటికి అదనంగా "సచ్చీ రామాయణ్ కేసు" హైకోర్టు సుప్రీం కోర్టులలో ఏళ్ళకేళ్ల ఎదుర్కోవడం మామూలు విషయం కాదు. చివరికి బౌద్ధం తీసుకుని లలైసింగ్ బౌద్ధగా మారిపోయాడు.

(వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, రిటైర్డ్ బయాలజీ ప్రొఫెసర్ - మెల్బోర్న్ నుంచి)

తాంబరం-సంత్రగచ్చి మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ

ప్రయాణీకుల అదనపు రద్దీని క్లియర్ చేసే క్రమంలో భాగంగా తాంబరం-సంత్రగచ్చి-తాంబరం మధ్య ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగించినట్లు రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె త్రిపాఠి తెలిపారు.

'చండీగఢ్'పై పెదవి విప్పని మోడీ

- సుప్రీం తీవ్ర వ్యాఖ్యల తర్వాత కూడా మౌనం

చండీగఢ్ : ఇటీవల జరిగిన చండీగఢ్ మేయర్ ఎన్నికపై సుప్రీంకోర్టు తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. దేశంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని మండిపడింది. కానీ మన ప్రధాని నరేంద్ర మోడీ మాత్రం ఈ వ్యవహారంతో తనకేమీ సంబంధం లేదన్న విధంగా మౌనం వహించారు. ఇప్పుడు ఆయన స్పందన కోసం దేశమంతా ఎదురు చూస్తోంది. దేశంలో ఎన్నికలు జరుగుతాయి కానీ పాలకులే విజేతలవుతారని చండీఘర్ మేయర్ ఎన్నిక నిరూపించింది.

చండీగఢ్ మేయర్ ఎన్నిక కోసం రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన అనిల్ మసిహ్ ఎవరో తెలుసా? ఆయన అక్కడ బిజెపి మైనారిటీ విభాగం ఇన్‌ఛార్జిగా కూడా పనిచేస్తున్నారు. ఇక ఆ ఎన్నిక ఎంత పారదర్శకంగా, నిస్పాక్షికంగా జరుగుతుందో ఊహించడం కష్టమేమీ కాదు కదా. మసిహ్ నిర్వాకాన్ని ఎబీసీ ఛానల్ బట్టబయలు చేసింది. సిసిటివి కెమేరాలను ఆపేశారని భావించిన మసిహ్ ఓట్ల లెక్కింపులో అక్రమానికి పాల్పడుతూ అడ్డంగా దొరికిపోయాడు. ఆయన చేసిన పనేమిటంటే... ఎనిమిది బ్యాలెట్ పత్రాలపై రిమార్క్ రాసి, వాటిని పక్కనే ఉన్న ఓ ట్రేలో పడేశాడు. విశేషమేమంటే ఈ ఓట్లన్నీ ఆప్, కాంగ్రెస్ కూటమి అభ్యర్థికి పడినవే. వీటిని చెల్లనివిగా మసిహ్ ప్రకటించడంతో బిజెపి అభ్యర్థి మేయర్‌గా ఎన్నికయ్యారు.

ఈ వ్యవహారం చివరికి సుప్రీంకోర్టుకు చేరింది. ఓట్ల లెక్కింపునకు సంబంధించిన వీడియోను తిలకించిన ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ తీవ్రంగా స్పందించారు. ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైందని, ఖూనీ అయిందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రిసైడింగ్ అధికారిపై విచారణ జరుపుతామని స్పష్టం చేశారు. మసిహ్ తనకు తానుగా ఇలా వ్యవహరించాడా లేక ఎవరన్నా అలా చేయమని ఆదేశించారా అన్నది తెలియడం లేదు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగాలని కోరుకుంటున్న దేశ పౌరులందరూ చండీగఢ్ ఉదంతంపై ప్రధాని పెదవి విప్పాలని ఆశిస్తున్నారు. ముఖ్యంగా సుప్రీంకోర్టు చేసిన తీవ్రమైన వ్యాఖ్యల తర్వాత అయినా ఆయన దీనిపై మాట్లాడాల్సిన అవసరం ఉన్నదని వారు అభిప్రాయపడుతున్నారు. మరో మూడు నెలల్లో దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరగబోతున్నాయి. తాను మరోసారి అధికారంలోకి వస్తానని, హ్యాట్రిక్ సాధించడం ఖాయమని మోడీ పదేపదే చెబుతున్నారు. కానీ చండీఘర్ ఉదంతాన్ని చూసిన వారికి ప్రధాని ప్రకటనపై అనేక అనుమానాలు కలగడం సహజం.

బీహార్‌లో ఇండియా కూటమి నుండి నితీష్ కుమార్ వైదొలగడం వల్ల బిజెపి కూటమికి నష్టమే తప్ప ప్రయోజనమేమీ ఉండబోదని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. జార్ఖండ్‌లో కూడా కాంగ్రెస్, జేఎంఎం కూటమి మెజారిటీ పార్లమెంటరీ స్థానాలు గెలుచుకోవడం తథ్యమని వార్తలు వస్తున్నాయి. జార్ఖండ్‌లో రాహుల్ యాత్రకు ఘన స్వాగతం లభించింది. అక్కడి ఆదివాసీలు బిజెపిపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. అనేక ఇతర రాష్ట్రాల్లో సైతం బిజెపికి ఎదురు గాలి వీస్తోంది. ఇలాంటి ప్రతికూల వాతావరణం మధ్య హ్యాట్రిక్ విజయంపై మోడీ ధీమా వ్యక్తం చేయడంపై అనుమానాలు కలగడం సహజమే.

AMARAVATI DEVELOPMENT CORPORATION LIMITED
Plot No.15, Road No.4, Sector 4, Lotus Landmark, Kedareswarapet, VIJAYAWADA-520003

E-procurement Short Tender Notice no.05/CE/ADC/Engg/2023-24 dated 05 /02/2024 C#2301857

Name of Work: Hiring of 6 Nos of Vehicles for a period of 1 (One) year for official use in the O/o Amaravati Development Corporation Limited, Vijayawada (2nd call) - ECV of **Rs.30.60 lakhs.** The bids can be downloaded on **"ap-e procurement"** portal from **09.02.2024** and closing date for submission is **17.02.2024** up to **3.30 PM.** Please refer to **www.apeprocurement.gov.in** for details. Any further clarifications, contact Executive Engineer, ADCL, Vijayawada - Contact no.**9849906836**

Chairman & Managing Director,
ADCL, Vijayawada

మహారాజశ్రీ పిడుగురాళ్ళ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
I.A. No. 160/2023 in I.A. No. 161/2023 in I.A. No. 162/2023 in O.S. No. 149/2019

బిట్వీన్
అన్నారపు రామాకోటమ్మ ,....వాది
మరియు
దగ్గు తిరుపతయ్య అండ్ అదర్స్ ...ప్రతివాదులు

1) కోపూరి దయమ్మ భర్త : లేటు రామస్వామి, హిందూ, వయస్సు 50 సం॥లు, అడ్రస్ : స్వర్ణభారతి నగర్, గుంటూరు టౌన్, జిల్లా ... 7వ ప్రతివాది
2) గాలి కుమారి భర్త : మరియదాసు, హిందూ, వయస్సు 33 సం॥లు, అడ్రస్ : స్వర్ణభారతి నగర్, గుంటూరు టౌన్, జిల్లా ... 8వ ప్రతివాది
3) కొండా క్రీస్తురాణి, భర్త : కొండా రాజేష్, వయస్సు 25 సం॥లు, అడ్రస్ : కొండపల్లి అడ్డరోడ్డు, విజయవాడ, కృష్ణాజిల్లా. ....9వ ప్రతివాది

పై నెంబరు దావాలో 4వ ప్రతివాది అయిన కోపూరి రామస్వామి అను ప్రతివాది చనిపోయిన యెడల వారి యొక్క వారసులుగా మిమ్ములను ఈ దావాలో చేర్చడం కొరకు పిటీషన్ దాఖలు చేసి, కోర్టువారి అనుమతి కొరకు మిమ్ములను ప్రతివాది 7 నుంచి 9 లుగా పై కోర్టు ద్వారా మీకు పంపించిన నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు సబ్స్టిట్యూట్ ఉత్తర్వుల ప్రకారం 29-2-2024వ తేదీన ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి యెదుట మీరు స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఏమైనా వున్నచో తెలుపుకొనగలరు. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానం చేయబడును.

ఇట్లు
కావూరి జాలారావు,
పిటీషనరు తరపు న్యాయవాది.
పిడుగురాళ్ళ టౌన్, పల్నాడుజిల్లా

Utkarsh Small Finance Bank
Aapki Ummeed Ka Khaata
(A Scheduled Commercial Bank)

జోనల్ కార్యాలయం : 07-01-58, కన్‌కొర్స్ హౌస్, లాలబంగ్లో, అమీర్‌పేట, హైదరాబాద్, తెలంగాణ-500 012.
నమోదిత కార్యాలయం : ఉత్కర్ష్ టవర్, ఎన్‌హెచ్-31, (ఎయిర్‌పోర్ట్ రోడ్డు),సెహ్మల్‌పుర్, ఖాజీ సరై, హర్హువా, వారణాసి, యుపి-221 105.

పబ్లిక్ నోటీసు

కింది రుణగ్రహీతలు బ్యాంక్ నుండి పొందిన రుణాల సదుపాయం యొక్క ప్రిన్సిపల్ మరియు వడ్డీని తిరిగి చెల్లించడంలో డీఫాల్ట్ అయ్యారు మరియు రుణాలు పని చేయని ఆస్తులు (ఎన్‌పిఎ) గా వర్గీకరించబడ్డాయి. సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్-2002 సెక్షన్ 13(2) క్రింద పేర్కొన్న రుణగ్రహీతలకు నోటీసు జారీ చేయబడింది, వారి చివరిగా తెలిసిన చిరునామాలపై అది అందించబడలేదు అందువల్ల ఈ పబ్లిక్ నోటీసు ద్వారా రుణగ్రహీతలకు తెలియజేయడమైంది.

క్ర. సం	శాఖ పేరు	ఎకౌంట్ పేరు	రుణగ్రహీతల ఆస్తి పేరు	ఎన్.పి.ఎ.తేది	డిమాండ్ నోటీసు తేది ప్రకారం బకాయి మొత్తం
1	హైదరాబాద్	1542140000 006783	బక్క శ్రీనివాసరెడ్డి, తండ్రి. రామిరెడ్డి మరియు బక్క అరుణ కుమారి, భర్త. బక్క శ్రీనివాసరెడ్డి	03 అక్టోబరు 2024	₹ 11,37,821/-
ఛార్జ్‌చేయబడిన/తనఖా చేయబడిన ఆస్తి వివరణ : ఎ.పి.523167, కొత్త జిల్లా-బాపట్ల, పాత జిల్లా-ప్రకాశం, చీరాల ఉపజిల్లా, కొత్తపాలెం పంచాయతీ, చీరాల మండలం మరియు గ్రామం వద్ద ఆస్తి మొత్తం ఆ భాగం మరియు పార్శిల్ బ్లాక్ 30, డో.నం.30-10, సర్వే డో.నం.402/2, కొలిచే ఏరియా 689.7 చ.గ.లు. బయట 919.6 చ.గ.లు. ఆస్తి హద్దులు : తూర్పు : బక్క శివ ప్రసాద్ రెడ్డి, పడమర : నక్క సాంబయ్య సైట్, ఉత్తరం : బక్క శ్రీనివాసరెడ్డి, దక్షిణం : రోడ్డు.					
2	హైదరాబాద్	1542140000 006435	మట్ట సుమ, భర్త. మట్ట జాన్ మరియు మట్ట హేమంత, తండ్రి. మట్ట మోన్	3 అక్టోబరు 2024	₹ 2,14,487/-
ఛార్జ్‌చేయబడిన/తనఖాపెట్టబడిన ఆస్తి వివరణ : ఆంధ్రప్రదేశ్-521165, కృష్ణాజిల్లా, ఉయ్యూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, నగర్ పంచాయతీలో ఆర్.ఎస్.నం.707/2 వద్ద ఆస్తి మొత్తం ఆ భాగం మరియు పార్శిల్ డో.నం.14-118 సైట్ కలిగి ఉన్న 78 చ.గ.లు.					

పై రుణగ్రహీతలు/మరియు/లేదా వారి హామీదారులు (వర్తించే విధంగా) ఈ నోటీసును ప్రచురించిన తేదీ నుండి 60 రోజుల వ్యవధిలోపు బకాయి ఉన్న చెల్లించాలని సూచించారు. లేకపోతే సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ (సెక్యూరిటీ) ఇంట్రస్ట్ యాక్ట్-2002 నిబంధన ప్రకారం తదుపరి చర్యలు తీసుకోబడతాయి.

సం/-
తేది: 09.02.2024 (అధీకృత అధికారి)
ప్రదేశం: ఎ.పి. ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

కేన్సర్ చికిత్సకు 'కార్-టి సెల్' థెరపీ

ప్రజాశక్తి - ఆరిలోవ

లుకోమియా, లింపోమా వంటి కొన్ని రకాల రక్త కేన్సర్లను పారదోలడానికి అధునాతన చిమెరిక్ యాంటిజెన్ రిసెప్టర్ (సిఎఆర్)-టి సెల్ అందుబాటులోకి వచ్చిందని ఆరిలోవ అపోలో ఆసుపత్రి ఆంకాలజీ విభాగం వైద్యనిపుణులు వెల్లడించారు రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఈ వైద్యవిధానంలో ఒక లుకోమియా రోగికి వైద్యం చేశామని వెల్లడించారు. గురవారం అపోలో ఆసుపత్రిలో మీడియాతో అంకాలజిస్టులు డాక్టర్ బోయ రాకేష్‌రెడ్డి, సిఇఒ రామచంద్ర, డాక్టర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ, ఇప్పటివరకు కేన్సర్ వ్యాధి నివారణకు ఆపరేషన్, కిమోథెరపీ, రేడియేషన్ వంటి వైద్యవిధానాలను అవలంభించే వాళ్లమన్నారు. ఇపుడు కేన్సర్ రోగులకు వరంలా కార్-టి సెల్ థెరపీ అందుబాటులోకి వచ్చిందన్నారు.

यूनियन बैंक ऑफ इंडिया / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
భారత ప్రభుత్వ రంగ సంస్థ

ఎడ్లపాడు (బ్రాంచి (19221)
డి.నెం.4-53/1, ఆంధ్రాబ్యాంక్ కాంప్లెక్స్, మెయిన్‌రోడ్, ఎడ్లపాడు-522233. ☎ 08647-276108

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

{సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 6(2)/8(6)}

టు: ఋణగ్రహీత(లు): శ్రీ ముద్దన సీతారామయ్య (అప్లికెంట్), డి.నెం.1-46/2, జగ్గాపురం గ్రామము, ఎడ్లపాడు మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522233. **శ్రీమతి ముద్దన జయలక్ష్మి, భర్త: సీతారామయ్య (కో-అప్లికెంట్),** డి.నెం.1-46/2, జగ్గాపురం గ్రామము, ఎడ్లపాడు మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522233. **హామీదారు(లు): శ్రీ ముత్తవరపు సుబ్బారావు, తండ్రి: రామారావు,** సర్వే నెం.345, NH-5, మెస్సర్స్ సాయి వెంకట రామ ఆయిల్ అండ్ ఆగ్రో ప్రొడక్ట్స్, ఎడ్లపాడు గ్రామము & మండలం, గుంటూరు జిల్లా.

సర్/మేడమ్,

విషయం : సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం బ్యాంకు బకాయి వసూలు కొరకు శ్రీ ముద్దన సీతారామయ్యకు చెందిన ఆస్తి అమ్మకం.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎడ్లపాడు బ్రాంచి** వారిచే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద **డిమాండ్ ప్రకటన తేది.17.10.2022** ద్వారా నాచే / బ్యాంక్‌చే డిమాండ్ చేసినప్పటికీ మీరు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనారు. కావున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 6/8 తో చదివే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ అధీకృత అధికారిచే దిగువ తెలిపిన ఆస్తిని **తేది.04-03-2023** న **స్వాధీనం చేసుకోవడం** జరిగింది.

ఆస్తిని స్వాధీనం చేసుకొన్నప్పటికీ మీరు బ్యాంక్‌కు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించలేదు, అందువలన ఈ ప్రకటన తేది నుండి 30 రోజుల తర్వాత ఆన్‌లైన్ పద్ధతిలో బహిరంగ ఇ-వేలం ద్వారా దిగువ తెలిపిన ఆస్తులను విక్రయించుట తప్పనిసరి అయినది.

ఇ-వేలం తేది మరియు సమయం, ఆస్తి యొక్క రిజర్వ్‌ధర మరియు సర్వీస్ ప్రొవైడర్ వివరాలు అమ్మకం ప్రకటన ద్వారా తెలియజేయబడతాయి, అది విడిగా జారీ చేయబడుతుంది.

కావున మీరు బ్యాంక్‌కు చెల్లించవలసిన మొత్తాన్ని తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు సేల్ నోటీసును ప్రచురించే తేదీకి ముందు బ్యాంక్ చేసిన ఖర్చులతో సహా కలిపి మీరు చెల్లిస్తే షెడ్యూల్‌లో పేర్కొన్న ఆస్తి అమ్మకానికి గాను ఎటువంటి తదుపరి చర్య తీసుకోబడదు. సదరు చట్టం యొక్క సెక్షన్ 13(8) పరిధిలో విడిపించుకునే హక్కు లభిస్తుంది.

షెడ్యూల్ ఆస్తులు

పల్నాడు జిల్లా, ఎడ్లపాడు మండలం, జగ్గాపురం గ్రామము, సర్వే నెం.310, డి.నెం. 1-46/2 నందు శ్రీ ముద్దన సీతారామయ్యకు చెందిన 242 చ॥గ॥ విస్తీర్ణముగల స్థలము మరియు అందులో నిర్మించిన భవనమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు: తూర్పు:** బజారు; **పడమర:** ముద్దన శ్రీనివాసరావు స్థలము; **ఉత్తరం:** సర్కారు డొంక; **దక్షిణం:** పెల్లూరి హనుమంతరావు స్థలము.

ప్రదేశము : ఎడ్లపాడు సం/- అధీకృత అధికారి
తేది : 08.02.2024 యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా



'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' యూనిట్ సందడి

శ్రీకాకుళం అర్బన్ :నగరంలోని ఎస్‌విసి థియేటర్‌లో ప్రదర్శిస్తున్న అంబాజీపేట మేరేజీ బ్యాండు చిత్రం యూనిట్ గురువారం సాయంత్రం సందర్శించారు. సినీ అభిమానుల కేరింతల నడుమ యూనిట్ సభ్యులు సందడి చేశారు. చిత్ర దర్శకులు దుశ్యంత్ కటికనేని, నిర్మాత దీరజ్ మొగిలినేని, చిత్ర హీరో సుహాస్, శివానీ, జగదీష్ ప్రతాప్ బండారి, గోపరాజు రమణ తదితరులు మ్యాట్నీ షో సమయంలో సందడి చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు దుశ్యంత్, హీరో సుహాస్‌లు మాట్లాడుతూ కుటుంబ సభ్యులంతా హాయిగా నవ్వుకుంటూ సినిమాను చూసేందుకు వీలున్న కుటుంబ కథా చిత్రమని, ఈచిత్రాన్ని ఆదరించేందుకు ప్రతిఒక్కరూ కుటుంబ సభ్యులతో కలిసి థియేటర్‌కు వచ్చి సినిమా చూడాలన్నారు. ఇప్పటి వరకు పలు చిత్రాల్లో నటించి ప్రేక్షక హృదయాల్లో చోటు దక్కించుకున్న తనను ఈ చిత్రం ద్వారా ఆదరించాలని సుహాస్ కోరారు.

कॉयर बोर्ड / COIR BOARD
आज़ादी का अमृत महोत्सव
सूक्ष्म,लघु और मध्यम उद्यम मंत्रालय, भारत सरकार
MINISTRY OF MICRO, SMALL & MEDIUM ENTERPRISES
GOVERNMENT OF INDIA

కొబ్బరి బోర్డు
MSME మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం

కోయిర్ టాయ్‌కాథాన్ 2024
ఆత్మ నిర్భర్ టాయ్స్

కొబ్బరి బోర్డు వారు కొబ్బరి ఆధారిత బొమ్మల తయారీ పోటీని నిర్వహిస్తున్నారు, సృజనాత్మకత మరియు స్థిరత్వాన్ని పెంపొందిస్తుంది. పాల్గొనేవారికి ఉత్తేజకరమైన బహుమతులు అందించబడతాయి.

బ్రోచర్
రిజిస్ట్రేషన్

రిజిస్ట్రేషన్ చివరి తేది
15 ఫిబ్రవరి, 2024

/IndianCoir /IndianCoir /TheCoirboard
CBC 25131/12/0032/2324

చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
Chola — Enter a better life

కార్పొరేట్ ఆఫీస్ చిరునామా: చోళాక్రెస్ట్, సూపర్ బి, సి54 & సి55, 4, తిరువికా ఇండస్ట్రీయల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032

స్వాధీనతా ప్రకటన (అనుబంధం-4) (రూల్ 8(1) క్రింద)

ఏదైతే, క్రింది సంతకందారు **మెసర్స్ చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలు మరియు దానిపై వడ్డీని చెల్లించమని రుణగ్రహీతలు (**దిగువ పేర్కొన్న పేర్లు మరియు చిరునామాలకు**) మిమ్మల్ని కోరుతూ సదరు చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద దిగువ పేర్కొన్న తేదినాటి డిమాండ్ నోటీసులు జారీచేయబడినవి. రుణగ్రహీతలు మొత్తాలను తిరిగిచెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ఇందుమూలంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సెక్యూరిటి ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో చదువగల సదరు చట్టంలోని సెక్షన్13 యొక్క ఉప-సెక్షన్(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని స్వాధీనంలోకి తీసుకున్నారు. ప్రధానంగా పై పేర్కొన్న రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తులతో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని మరియు సదరు ఆస్తులతో ఎవరైనా ఏవేని లావాదేవీలు జరుపదలచిన వారు **మెసర్స్ చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** వారికి పేర్కొన్న మొత్తాలు మరియు దానిపై వడ్డీని చెల్లించుటకు లోబడి ఉంటుంది. సెక్యూర్డు అసెట్స్ విమోచనానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉప-సెక్షన్ (4) నియమాలను రుణగ్రహీతల శ్రద్ధను కోరుతున్నారు.

క్ర. సం.	రుణగ్రహీతల పేరు మరియు చిరునామా & రుణ ఖాతా నెంబరు	డిమాండ్ నోటీసు తేది	బాకీపడిన మొత్తం	స్వాధీనంలోని ఆస్తి వివరాలు	స్వాధీనతా తేది
1.	**రుణ ఖాతా నెం.లు: HLO5RAS000017641** **వినోద్ కట్టా** **కట్టా స్వాతి** **ఇరువురి నివాసం:** డోర్ నెం.3-157ఏ, కల్యాణమండపం దగ్గర, పెదకూరపాడు, ఆంధ్ర ప్రదేశ్ 522402 **మరియు ఇక్కడ కూడా:** డోర్ నెం.1-113, సర్వే నెం.160, కట్టమూరు గ్రామం, నత్తెనపల్లి మండలం, గుంటూరు జిల్లా, పున్నయ్య అచ్చయ్య కళ్యాణ మండపం దగ్గర, పెదకూరపాడు-522402	20-11-2023	**18-11-2023** నాటికి **రూ.20,60,722/-**(రూపాయలు ఇరవైలక్షల అరవైవేల ఏడువందల ఇరవైరెండు మాత్రమే) మరియు దానిపై వడ్డీ.	గుంటూరు జిల్లా, నరసరావుపేట్ ఆర్.డి., పెదకూరపాడు సబ్-రిజిస్ట్రార్, సత్తెనపల్లి మండలం, కట్టంగూరు గ్రామపంచాయతీ కట్టంగూరు గ్రామ లిమిట్స్, డోర్ నెం.160, సమీప డోర్ నెం.1-113 వద్దగల 180చ.గ.లు మరియు దీని నిర్మాణంలో ఉన్న అన్ని ఫిక్సర్లు మరియు ఫిట్టింగులతో ఆర్‌సిసిడాబా గ్రౌండ్ ఫ్లోర్ 1200చ.అ.లు మరియు 1వఅంతస్తు 1200చ.అ.లు మొత్తం 2400చ.అ.లు (అసంపూర్తి)తో ఆస్తి మొత్తంభాగం. సరిహద్దులు: తూర్పు:కంచేటి వెంకటేశ్వర్లు ఇల్లు 61అ.లు, దక్షిణం: రంజిశెట్టి వెంకటేశ్వర్లు మరియు ఇతరులకు చెందిన దొడ్డి 26.6అ.లు, పడమర: కల్లూరు నరసింహాకు చెందిన సైటు-59అ.లు, ఉత్తరం: సిర్కార్ బజార్ 27.6అ.లు అన్ని ఈస్‌మెంట్ హక్కులతో.	స్వాధీనతా తేది : 03 ఫిబ్రవరి, 2024
2.	**రుణ ఖాతా నెం.లు: HLO3GUT000010136** **మనోజ్ కుమార్ దేవరపు** **దేవరపు గురవమ్మ** **ఇరువురి నివాసం:** డోర్ నెం.3-3-21/ఏ, హంద్రమౌళి స్వరాగ్రహారం, ఎస్‌బి జ్యూట్‌మిల్ దగ్గర, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ 522006 **మరియు ఇక్కడ కూడా:** కన్న టవర్స్, అంకిరెడ్డిపాలెం గ్రామ రోడ్డు,చల్లావారిపాలెం (గ్రామ పంచాయతీ,అంకిరెడ్డిపాలెం గుంటూరు యొక్క హామ్లెట్, మసీద్‌దగ్గర, అంకిరెడ్డిపాలెం గ్రామ రోడ్డు, చల్లావారిపాలెంల్ల గ్రామంగూంటూరు, గుంటూరు-522005.	27-11-2023	**24-11-2023** నాటికి **రూ.34,01,743/-**(రూపాయలు ముప్పైనాలుగు లక్షల ఒకవేయ్యి ఏడువందల నలభైమూడు మాత్రమే) మరియు దానిపై వడ్డీ.	**ఏ-షెడ్యూలు:** గుంటూరు జిల్లా, నల్లపాడు ఉప-జిల్లా, చల్లావారిపాలెం గ్రామపంచాయతీ ఏరియా, అంకిరెడ్డిపాలెం గ్రామం, డోర్ నెం.823 వద్దగల 2553.14చ.గ.లకుగాను కన్నా టవర్స్ బిల్డింగ్ యొక్క అసెస్‌మెంట్ నెం.326తో 2148.55చ.గ.ల విస్తీర్ణం మొత్తం. సరిహద్దులు: తూర్పు:రోడ్డు, 151'-06", దక్షిణం: ఎస్.వెంకటేశ్వర్లు ఆస్తి, 122'-00, వడమర: పొన్నగంటి లక్ష్మి మరియు ఇతరుల సైటు-169'-06", ఉత్తరం: వై.రాధ క్రిష్ణమూర్తి ఆస్తి-117'-0". పై పేర్కొన్న సరిహద్దులలోవు 2148.55చ.గ.లలోనవ 42చ.గ.లు లేదా 35.11చ.మీ.ల విడదీయలేని & పేర్కొనబడని భాగం. **బి-షెడ్యూలు:** కన్నా టవర్‌తో 2418చ.గ.ల ఏ-షెడ్యూల్‌లో 2418.55చ.గ.లలో పై సదరు 42చ.గ.లు లేదా 35.11చ.మీ.లులోవు 1150చ.అ.ల (ఉమ్మడి ఏరియాతోకలిపి)తో కన్నా టవర్ యొక్క మొదటి అంతస్తు వద్ద డబుల్ బెడ్రూమ్ ఫ్లాట్ నెం.206తో. సరిహద్దులు: తూర్పు: ఉమ్మడి కారిడార్, దక్షిణం: ఒపెన్ టు స్కై, పడమర: ఒపెన్ టు స్కై, వడమర: ఒపెన్ టు స్కై. ఈ సరిహద్దులలోవు ఈస్‌మెంటరీ హకుకులు, ఉమ్మడి పార్కింగ్, ఉమ్మడి కారిడార్, లిఫ్ట్, డ్రైనేజీ కనెక్షన్ మొ॥న వాటితో కన్న టవర్స్ యొక్క మొదటి అంతస్తు వద్ద సదరు ఫ్లాట్ నెం.206 యొక్క అన్ని ఫిక్సర్లు & ఫిట్టింగులతో.	స్వాధీనతా తేది : 03 ఫిబ్రవరి, 2024
3.	**రుణ ఖాతా నెం.లు: HLO1GUT000028821** **రవీంద్ర బాబు మేకతోటి** **జయశ్రీ మేకతోటి** **ఇరువురి నివాసం:** డోర్ నెం 22-1-41, జిఎంసి నెం.2490 లైన్, టెంపుల్ దగ్గర, గుంటూరు, ఆంధ్ర ప్రదేశ్-522002 **మరియు ఇక్కడ కూడా:** సాయి విల్లాపార్ట్‌మెంట్స్, బ్లాక్ నెం.2, 11వ లైన్ శారద కాలనీ ఎదురు రోడ్డు, మల్లిఖార్జునపేట్ వసంతరాయపురం, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్, గుంటూరు జిల్లా వాటర్ ట్యాంక్ దగ్గర, 1వ లైన్ శారదకాలనీ, గుంటూరు-522002	21-04-2023	**20-04-2023** నాటికి **రూ.20,63,407/-**(రూపాయలు ఇరవైలక్షల అరవైమూడు వేల నాలుగువందల ఏడు మాత్రమే) మరియు దానిపై వడ్డీ.	గుంటూరు జిల్లా, గుంటూరు ఉప-జిల్లా, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్, వసంతరాయపురం, గుంటూరు గ్రామం, డోర్ నెం.189/బి, ఎక 9.13సెంట్లకుగాను డోర్‌నెం.7-17-449/ఏ కలిగిన సాయి విల్లాపార్ట్‌మెంట్స్-2. సరిహద్దులు: తూర్పు: 40అ.ల వెడల్పు మున్సిపల్ రోడ్, దక్షిణం: 15అ.ల వెడల్పు మున్సిపల్ రోడ్, పడమర: యు.మేరీ ఫాతిమా సైటు, ఉత్తరం: ఇతరులకు తాడిగిరి ప్రకాశరావు విక్రయించిన ఆస్తి. పై సరిహద్దులలోవు సాయి విల్లాపార్ట్‌మెంట్స్-2, బ్లాక్ నెం.2లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఫ్లాట్ నెం.105లో మరియు 3872చ.గ.ల పూర్తి సైట్ యొక్క 44.68చ.గ.ల విడదీయలేని మరియు పేర్కొనబడని భాగం. సరిహద్దులు: తూర్పు: ఒపెన్ టు స్కై, దక్షిణం: ఈ ఫ్లాట్ & ఫ్లాట్ నెం.106 మధ్య ఒపెన్‌టు స్కై, పడమర:ఉమ్మడి కారిడార్, ఉత్తరం:ఒపెన్ టు స్కై. ఈ సరిహద్దుల లోవు పార్కింగ్ ఏరియాలో ఒక కార్ పార్కింగ్‌తోసహా సదరు ఫ్లాట్ కొరకు అన్ని సాధారణ, ఉమ్మడి, ఈస్‌మెంటరీ హక్కులు & వసతులతోసహా అందులోని అన్ని ఫిక్సర్లు& ఫిట్టింగులతో విల్లాపార్ట్‌మెంట్స్-2, బ్లాక్ నెం.2లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఫ్లాట్ నెం.105తో 1050చ.అ.ల విస్తీర్ణం.	స్వాధీనతా తేది : 06 ఫిబ్రవరి, 2024

తేది: 03 ఫిబ్రవరి, 2024/ 06 ఫిబ్రవరి, 2024
ప్రదేశం: గుంటూరు, ఆం.ప్ర
చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
అధీకృత అధికారి,

అవును...సీఎం పర్యటనల ఖర్చు ప్రభుత్వమే భరించింది

- ఖజానాపై రూ.58 కోట్ల భారం
- శాసనసభ సాక్షిగా అంగీకరించిన అసోం సర్కారు

దిస్‌పూర్ : ప్రభుత్వేతర కార్యక్రమాల కోసం అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ హెలికాప్టర్లు, ఛార్టర్డ్ విమానాలు అద్దెకు తీసుకొని ప్రయాణించి ఆ వ్యయాన్ని ప్రభుత్వ ఖజానాపై రుద్దారని, దీనివల్ల కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అయిందని మూడు రోజుల క్రితం క్రాస్‌కరంట్ అనే మీడియా సంస్థ బయటపెట్టిన విషయం తెలిసిందే. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ సాక్షిగా ఈ ఆరోపణను అంగీకరించింది. 2021 మే 10 నుండి ఈ ఏడాది జనవరి 30వ తేదీ వరకూ ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖుల హెలికాప్టర్, విమాన ప్రయాణాల కోసం ప్రభుత్వ ఖజానా నుండి అక్షరాలా రూ.58,23.07,104 ఖర్చు చేశామని తెలిపింది. శివసాగర్ ఎమ్మెల్యే, రాయ్‌జోర్ దళ్ నేత అఖిల్ గొగోయ్ అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. అయితే శర్మ విమాన ప్రయాణాల కోసం ఎప్పుడు, ఎంత మొత్తం చెల్లించిందీ ఆ సమాధానంలో వివరించలేదు. 2021 మే 10 నుండి 2022 డిసెంబర్ 31 వరకూ రూ.10,19,81,946, 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.34,01,05,848 ఖర్చు చేశామని చెప్పింది. అలాగే 2023 జనవరి నుండి 2024 జనవరి వరకూ రూ.14,02,19,313 ఖర్చయిందని తెలిపింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో శర్మ ప్రైవేటు పర్యటనల కోసం ప్రభుత్వం పెట్టిన ఖర్చు, గత సెప్టెంబరులో ప్రభుత్వం శాసనసభలో చేసిన ప్రకటనలో తెలిపిన వ్యయం ఒకేలా ఉన్నప్పటికీ సమాచార హక్కు చట్టం కింద క్రాస్‌కరంట్ అడిగిన ప్రశ్నకు వచ్చిన సమాధానంతో మాత్రం సరిపోవడం లేదు. క్రాస్‌కరంట్ అనే స్వతంత్ర వార్తా సంస్థ 2022 ఆగస్ట్ 26న ముఖ్యమంత్రి ప్రైవేటు పర్యటనల ఖర్చులపై ఆర్‌టీఐ ద్వారా సమాధానం కోరింది. పన్ను చెల్లింపుదారుల సొమ్ముతో శర్మ హెలికాప్టర్లు, ఛార్టర్డ్ విమానాలు అద్దెకు తీసుకొని పార్టీ సమావేశాలతో పాటు అనేక వివాహాలకు హాజరయ్యారని ప్రభుత్వం ఇచ్చిన సమాధానంలో బయటపడింది. అయితే సర్కారు కార్యక్రమాల కోసమే సొమ్ము చెల్లించి ఛార్టర్డ్ విమానాలను అద్దెకు తీసుకున్నామని గత సెప్టెంబరులో శర్మ ప్రభుత్వం శాసనసభ సాక్షిగా అబద్ధం చెప్పింది. అయితే దీనిపై తాజాగా దుమారం రేగడంతో శాసనసభలో ప్రభుత్వం వాస్తవాన్ని అంగీకరించక తప్పలేదు.

बैंक ऑफ महाराष्ट्र / Bank of Maharashtra / బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర
भारत सरकार का उद्यम — एक परिवार एक बैंक

జోనల్ ఆఫీసు, ఇ.నం.4-3-448 నుండి 460 & 465 నుండి 468, 1వ అంతస్తు, వినూత్న పిట్టీస్ మజెస్టీ, గోపాల్ బాగ్, బ్యాంక్ స్ట్రీట్ దగ్గర, కోఠి, హైదరాబాద్.

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన

సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్ రూల్స్) 2002 యొక్క రూల్ 8(6)కు నియమాలతో చదువబడే, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ యాక్ట్, 2002 (సార్ఫసీ యాక్ట్) క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.

ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీత& హామీదారులుకు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ వివరించిన స్థిరాస్తులు సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తాకట్టు/చార్జ్‌డ్ పెట్టబడినవి, ఏదైతే **బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర** (సెక్యూర్డ్ క్రెడిటర్) యొక్క అధీకృత అధికారిచేత నిర్మాణాత్మక స్వాధీనంచేసుకోబడినది, దానిని మొత్తాలు + దాని పై లెక్కించని వడ్డీ మరియు తదుపరి వడ్డీ ప్లస్ వ్యయాలు& ఇతర చార్జీలను రికవరీ చేయుట కొరకు, **"ఏది ఎక్కడ ఎలా ఉన్నది, అది అక్కడ అలాగే ఉంటుంది"** ప్రాతిపదికన **27.02.2024న** విక్రయించబడుతుంది.

క్ర.సం.	రుణగ్రహీత& హామీదారు పేరు	బకాయి మొత్తాలు
1	**మెసర్స్ విజయ శారద డిలైంట్ సీడ్ మిల్స్,** ప్రొప్రైటర్ **శ్రీ కేతినేని సుభాష్ చంద్ర బోస్,** డోర్ నం.145/1సి, ఎన్‌హెచ్-5, గణపవరం, చిలకలూరిపేట్, గుంటూరు జిల్లా, ఆం.ప్ర.-522619. **మెసర్స్ విజయ శారద డిలైంట్ సీడ్ మిల్స్,** ప్రొప్రైటర్ **శ్రీ కేతినేని సుభాష్ చంద్ర బోస్,** ఫ్లాట్ నం.201, అనంత లక్ష్మి నిలయం, 2వ లైన్, సి.ఆర్.పురం, చిలకలూరిపేట, గుంటూరు జిల్లా, ఆం.ప్ర.-522616. **శ్రీమతి కేతినేని లక్ష్మి అనిల, భర్త శ్రీ కేతినేని సుభాష్ చంద్ర బోస్,** ఫ్లాట్ నం.201, అనంత లక్ష్మి నిలయం, 2వ లైన్, సి.ఆర్.పురం, చిలకలూరిపేట, గుంటూరు జిల్లా, ఆం.ప్ర.-522616. **శ్రీ పి. సుబ్బారావు, తండ్రి నరసయ్య,** ఫ్లాట్ నం.201, అనంత లక్ష్మి నిలయం, 2వ లైన్, సి.ఆర్.పురం, చిలకలూరిపేట, గుంటూరు జిల్లా, ఆం.ప్ర.-522616.	**రూ.7,42,99,515/- (రూపాయలు ఏడు కోట్ల నలభై రెండు లక్షల తొంభై తొమ్మిది వేల ఐదు వందల పదిహేను మాత్రమే)** ప్లస్ లెక్కించని వడ్డీ& తదుపరి వడ్డీ ప్లస్ వ్యయాలు& ఇతర చార్జీలు.
	స్థిరాస్తి వివరణ: 1) గణపవరం గ్రామం, రిజిస్ట్రేషన్ జిల్లా నర్సారావుపేట్, సబ్-డిస్ట్రిక్ట్ చిలకలూరిపేట్ వద్ద ఉన్న ఎక.1.12సెంట్లు విస్తీర్ణం చ.అ.లు/చ.మీ. మరియు సర్వే నం.డోర్ నం.145-1సి గల ఆస్తి యొక్క మొత్తం భాగం మరియు సరిహద్దులు: **ఉత్తరం:** కిదాంబి ప్రసన్న లక్ష్మి పేరున ల్యాండ్, **తూర్పు:** వెలేటి వెంకటేశ్వర రావు ల్యాండ్, **దక్షిణం:** చెరుకూరి సుబ్బారావు పేరున ల్యాండ్, **పడమర:** పరుచూరి సుబ్బారావు చే ఉమ్మడి దారిగా వదిలిన ల్యాండ్, అన్ని ఫిక్షర్స్, ఫిటింగ్స్, దానిపై అనెక్షర్డ్‌తో నిర్మించిన లేదా నిర్మించబడుచున్న భవనాలతోసహా. **రిజర్వ్‌ధర: రూ.1,06,00,800/- ధరావత్తు డిపాజిట్ (ఇఎండి): రూ.10,60,080/-**	
	స్థిరాస్తి వివరణ: 2) నాదేండ్ల గ్రామం, రిజిస్ట్రేషన్ జిల్లా నర్సారావుపేట్, సబ్-డిస్ట్రిక్ట్ చిలకలూరిపేట్ వద్ద ఉన్న ఎక.4.00సెంట్లు విస్తీర్ణం మరియు డోర్ నం.1253 వద్ద గల ఆస్తి యొక్క మొత్తం భాగం మరియు సరిహద్దులు: **ఉత్తరం:** పోతురాజు కుంట, **తూర్పు:** గొల్లపాటి రామయ్య ల్యాండ్, **దక్షిణం:** మాకినేని ప్రభావతి ల్యాండ్, **పడమర:** సర్కార్ డొంక. **రిజర్వ్‌ధర: రూ.1,92,00,000/- ధరావత్తు డిపాజిట్ (ఇఎండి): రూ.19,20,000/-**	
	స్థిరాస్తి వివరణ: 3) పురుషోత్తంపట్నం గ్రామం, రిజిస్ట్రేషన్ జిల్లా నర్సారావుపేట్, సబ్-డిస్ట్రిక్ట్ చిలకలూరిపేట్, చిలకలూరిపేట్ మున్సిపల్ ఏరియా నం.1 బ్లాక్ వద్ద ఉన్న ఎక.0.49సెంట్లు విస్తీర్ణం మరియు డోర్ నం.473-బి2 0.20 మరియు డోర్ నం.473-బి1 0.29 వద్ద గల ఆస్తి యొక్క మొత్తం భాగం మరియు సరిహద్దులు: **ఉత్తరం:** తియ్యగుర కృష్ణా రెడ్డి ల్యాండ్-162.5 లింకులు, **తూర్పు:** ఆవుల హనుమయ్య ల్యాండ్-300 లింకులు, **దక్షిణం:** తాటి రాములు ల్యాండ్-163.5 లింకులు, **పడమర:** ఆవుల సుబ్బమ్మ ల్యాండ్-298 లింకులు. **రిజర్వ్‌ధర: రూ.1,17,60,000/- ధరావత్తు డిపాజిట్ (ఇఎండి): రూ.11,76,000/-**	
	స్థిరాస్తి వివరణ: 4) పురుషోత్తంపట్నం గ్రామం, జిల్లా నర్సారావుపేట: సబ్ డిస్ట్రిక్ట్ చిలకలూరిపేట్ వద్ద విస్తీర్ణం ఎక.1.20సెంట్లు/చ.అ.లు/చ.మీ.లు మరియు సర్వే నం.డోర్ నం.382/3 వద్ద గల ఆస్తి యొక్క మొత్తం భాగం మరియు సరిహద్దులు: **ఉత్తరం:** వి. రాములు పేరున ల్యాండ్, **తూర్పు:** వి. రాధ కృష్ణ మూర్తి పేరున ల్యాండ్, **దక్షిణం:** తోట సుబ్బారావు పేరున ల్యాండ్, **పడమర:** పొలిమేర డొంక; దానిపై అన్ని ఫిక్షర్స్, ఫిటింగ్స్, అనెక్షర్డ్ మరియు దానిపై నిర్మించిన లేదా నిర్మించబడుచున్న భవనాలు& నిర్మాణాలతోసహా. **రిజర్వ్‌ధర: రూ.57,60,000/- ధరావత్తు డిపాజిట్ (ఇఎండి): రూ.5,76,000/-**	
2	**1) మెసర్స్ నర్రా కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్,** ఫ్లాట్ నం.డి1-202, కాంతి సిఖర అపార్టుమెంట్స్, పంజాగుట్ట, హైదరాబాద్-500082. **2) శ్రీ నర్రా శ్రీనివాస్,** డైరెక్టర్ **మెసర్స్ నర్రా కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్,** ఫ్లాట్ నం.డి1-202, కాంతి సిఖర అపార్టుమెంట్స్, పంజాగుట్ట, హైదరాబాద్-500082. **మరియు: శ్రీ నర్రా శ్రీనివాస్,** 301, 3వ అంతస్తు, శ్రీనిధి టవర్స్, ఎస్‌బిహెచ్ కొ-ఆప. హౌసింగ్ సొసైటీ లిమిటెడ్, ఎస్‌బిహెచ్ కాలనీ, శ్రీనగర్ కాలనీ, యెల్లారెడ్డి గూడ, హైదరాబాద్-500073. **3) శ్రీమతి నర్రా అనిత, డైరెక్టర్ మెసర్స్ నర్రా కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్,** ఫ్లాట్ నం.డి1-202, కాంతి సిఖర అపార్టుమెంట్స్, పంజాగుట్ట, హైదరాబాద్-500082. **మరియు: శ్రీ నర్రా అనిత, భర్త శ్రీ నర్రా శ్రీనివాస్,** 301, 3వ అంతస్తు, శ్రీనిధి టవర్స్, ఎస్‌బిహెచ్ కొ-ఆప. హౌసింగ్ సొసైటీ లిమిటెడ్, ఎస్‌బిహెచ్ కాలనీ, శ్రీనగర్ కాలనీ, యెల్లారెడ్డి గూడ, హైదరాబాద్-500073. **4) శ్రీ నర్రా శ్రీనివాస్,** హామీదారు, 301, 3వ అంతస్తు, శ్రీనిధి టవర్స్, ఎస్‌బిహెచ్ కొ-ఆప. హౌసింగ్ సొసైటీ లిమిటెడ్, ఎస్‌బిహెచ్ కాలనీ, శ్రీనగర్ కాలనీ, యెల్లారెడ్డి గూడ, హైదరాబాద్-500073. **5) శ్రీమతి నర్రా అనిత, భర్త శ్రీ నర్రా శ్రీనివాస్,** హామీదారు, 301, 3వ అంతస్తు, శ్రీనిధి టవర్స్, ఎస్‌బిహెచ్ కొ-ఆప. హౌసింగ్ సొసైటీ లిమిటెడ్, ఎస్‌బిహెచ్ కాలనీ, శ్రీనగర్ కాలనీ, యెల్లారెడ్డి గూడ, హైదరాబాద్-500073. **6) శ్రీ ఎం. శ్రీహరి,** హామీదారు, ఫ్లాట్ నం.204, పూజా రెసిడెన్సీ, బొల్లారం రోడ్, చైతన్య కాలేజి దగ్గర, శేరిలింగంపల్లి, మియాపూర్, హైదరాబాద్-500029. **7) శ్రీమతి పెద్ది విజయలక్ష్మి,** హామీదారు, **భర్త కీ॥శే॥ శ్రీ పెద్ది సత్య ప్రసాద్,** ఇ.నం.1-14, వీరంక లాకులు, గుర్రాల లంక, పామిడిముక్కల, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-521250.	**రూ. 6,45,93,181/- (రూపాయలు ఆరు కోట్ల నలభై ఐదు లక్షల తొంభై మూడు వేల నూటా ఎనభై ఒకటి మాత్రమే)** ప్లస్ లెక్కించని వడ్డీ& తదుపరి వడ్డీ ప్లస్ వ్యయాలు& ఇతర చార్జీలు.
	స్థిరాస్తి వివరణ: 1) శ్రీ ఎన్. శ్రీనివాస్ చేత స్వంతమైన కృష్ణా జిల్లా, వుయ్యూరు మండలం, గండిగుంట గ్రామం, ఎస్.జి.ఎస్.నగర్, గణపతి సచ్చిదానంద దాతా టెంపుల్ వెనుక, డోర్ నం.6-62 దగ్గర, ఫ్లాట్ నం.1, ఆర్.ఎస్.నం.946/4 వద్ద 402.2చ.గ.ల విస్తీర్ణపు ఖాళీ ఫ్లాట్ యొక్క మొత్తం భాగం మరియు **సరిహద్దులు: ఉత్తరం:** 33అ.ల రోడ్డు, **దక్షిణం:** ఫ్లాట్ నం.2, **తూర్పు:** 33అ.ల రోడ్డు మరియు **పడమర:** శ్రీ ఎం. విశేశ్వర రావు ఆస్తి. **రిజర్వ్ ధర: రూ.70,00,000/- ధరావత్తు (ఇఎండి): రూ.7,00,000/-**	
	స్థిరాస్తి వివరణ: 2) శ్రీ ఎన్. శ్రీనివాస్ చేత స్వంతమైన కృష్ణా జిల్లా, వుయ్యూరు మండలం, గండిగుంట గ్రామం, ఆర్.ఎస్.నం.146/6 వద్ద 277.60చ.గ.ల విస్తీర్ణంతో (రిజిస్టర్డు సేల్ డీడ్ నం.3403/2011) ఖాళీ ఇంటి సైటు యొక్క మొత్తం భాగం మరియు **సరిహద్దులు: ఉత్తరం:** ఎం. సంధ్యారాణికి చెందిన ల్యాండ్, **దక్షిణం:** మహ్మద్ గాలిద్‌కు చెందిన ల్యాండ్, **తూర్పు:** నడుచుట కొరకు 5అ.ల ఉమ్మడి రోడ్డు, **పడమర:** డి. శ్రీహరికు చెందిన ల్యాండ్. **రిజర్వ్ ధర: రూ.55,00,000/- ధరావత్తు (ఇఎండి): రూ.5,50,000/-**	

అమ్మకం యొక్క వివరణాత్మక నియమాలు& నిబంధనల కొరకు, దయచేసి సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క వెబ్‌సైట్: **http://www.bankofMaharashtra.in** లో ఇవ్వబడిన లింకును పరిశీలించండి,& **మొబైల్ నం.: 7001580134, 9644974398** పై సంప్రదించండి.

తేది: 08.02.2024, ప్రదేశం: హైదరాబాద్ **సం/- అధీకృత అధికారి & చీఫ్ మేనేజర్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర**

ఏజెన్సీలో యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ ప్రతినిధుల పర్యటన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జాతాపు భాషలో పాఠ్యపుస్తకాలు తయారీ కోసం యూనివర్సిటీ మైసూర్ నుంచి సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ వారు మండలంలోని గొరడ, రేగిడి గిరిజన ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. వీరు అంగన్వాడీలను, ప్రాథమిక పాఠశాలలను పరిశీలించి ఆయా గ్రామస్తులతో మమేకమ య్యారు. జాతాపు భాష వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 72 భారత భాషల అభివృద్ధి కోసం ప్రోగ్రాం నిర్వహిస్తున్నామన్నారు. త్వరలో ఈ పుస్తకాలను ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ బృందంలో యూనివర్సిటీ మైసూర్ నుంచి ప్రొఫెసర్లు ఎల్ఎన్ ప్రేమ్ కుమార్, డి.రమేష్, భూషణ్, పార్వతీపురం ఐటిడిఎ ఎంఎల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాల బస్సు బోల్తా ఆరుగురు విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి మండలం పెడపల్లి సమీపంలో విద్యార్థులతో వెళ్తున్న పాఠశాల బస్సు గురువారం సాయంత్రం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆరుగురు విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... పెడపల్లి ప్రయివేటు పాఠశాలకు చెందిన టాటా మ్యాజిక్ వాహనం గురువారం సాయంత్రం పాఠశాల నుంచి 30 మంది విద్యార్థులను సొంత గ్రామం బత్తలపల్లికి తీసుకెళ్తోంది. ఈ క్రమంలో వేగంగా వెళ్తూ పెడపల్లి క్రాస్ వద్ద అదుపు తప్పి వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆరుగురు విద్యార్థులు గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి బస్సులో ఉన్న విద్యార్థులను బయటకు తీసి రక్షించారు. స్వల్ప గాయాలతో విద్యార్థులు బయటపడడంతో ప్రమాదం తప్పింది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం పుట్టపర్తి సత్యసాయి ఆసుపత్రికి తరలించారు. పరిమితికి మించి వాహనంలో విద్యార్థులను ఎక్కించుకుని వేగంగా వెళ్లడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ప్రమాద విషయం తెలిసి విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురయ్యారు. పెద్ద సంఖ్యలో ప్రమాద స్థలం వద్దకు చేరుకున్నారు. పిల్లలందరూ క్షేమంగా ఉండడంతో ఊపిరి పీల్చుకున్నారు.

గ్రీక్‌లో ఉద్యమాల హోరు

టెలికాం, కాల్‌సెంటర్ల కార్మికుల దేశవ్యాప్త సమ్మె • సిఐటియు అభినందనలు

గ్రీక్ రాజధాని ఏథెన్స్‌లో ఆందోళన చేస్తున్న కార్మికులు

ఏథెన్స్/న్యూఢిల్లీ : గ్రీక్‌లో పెద్ద ఎత్తున ఉద్యమాలు సాగుతున్నాయి. విశ్వవిద్యాలయాల ప్రయివేటీకరణకు విద్యార్థులు, సిబ్బంది, వ్యవసాయ రంగ సమస్యలపై అన్నదాతలు ఇలా ప్రతిఒక్కరూ పోరుబాట పట్టారు. తాజాగా గ్రీక్‌లోని నాలుగు అతిపెద్ద టెలికాం కంపెనీలు, కాల్ సెంటర్లకు చెందిన కార్మికులు గురువారం దేశవ్యాప్త సమ్మె చేపట్టారు. ప్రజాస్వామ్యయుతంగా, శాంతియుత పద్ధతుల్లో సమ్మెను దిగ్విజయంగా నిర్వహించిన గ్రీక్ టెలికాం, కాల్ సెంటర్ వర్కర్లకు సిఐటియు అభినందనలు తెలిపింది. ప్రపంచ కార్మిక సంఘాల వేదిక (డబ్ల్యుఎఫ్‌టియు)లో భాగంగా ఉన్న సిఐటియులో 70 లక్షల మంది కార్మికులు సభ్యులుగా ఉన్నారు. దేశవ్యాప్తంగా కార్మికోద్యమాల నిర్మాణంతో పాటు ప్రపంచ కార్మికోద్యమాలకు కూడా అవసరమైనప్పుడల్లా సంఘీభావం తెలియజేయడంలో సిఐటియు ముందుంటోంది.

పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి అనుకూలంగా వేతనాలు పెంచాలనే ప్రధాన డిమాండ్‌తో గ్రీక్‌లోని నాలుగు బడా కంపెనీల కార్మికులు చేపట్టిన సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పైరవీస్ ప్రాంతీయ ట్రేడ్ యూనియన్ సెంటర్‌లో జరిగిన బహిరంగ సభలో కార్మికోద్యమ నాయకులు ప్రసంగించారు. అనంతరం టెలి ఫెర్ఫార్మెన్స్ యాజమాన్యానికి వినతిపత్రం అందజేశారు. అయితే కార్మికుల న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం అంగీకరించలేదు. టెలిఫార్ఫార్మెన్స్ సంస్థ తన కార్మికులకు 2010 నుంచి వేతనాలను పెంచడం లేదు. మిగిలిన మూడు టెలికాం సంస్థలు వెబ్‌హెల్ప్, టిటిఇసి, ఫౌండెవర్ సంస్థల తీరు కూడా ఇదే విధంగా ఉంది. గ్రీక్ వర్కర్ల సమ్మెపై జోక్యం చేసుకోవాలని, వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సంస్థల యాజమాన్యంతో చర్చలు జరపాలని గ్రీక్ ప్రభుత్వాన్ని సిఐటియు డిమాండ్ చేసింది. అలాగే గ్రీక్ కార్మికులకు సంఘీభావంగా కార్యక్రమాలు నిర్వహించాలని అనుబంధ సంఘాలకు సిఐటియు పిలునిచ్చింది.

సమైక్యతకు చిహ్నాలు జాతీయ నాటక ప్రదర్శనలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

అంతర్జాతీయ నాటకోత్సవాన్ని పురస్కరించుకొని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, ఏపి రాష్ట్ర ప్రభుత్వ సృజనాత్మకత సంస్కృతి సమితి సహకారంతో నిర్వహిస్తున్న నాటక ప్రదర్శనలు గురువారం మూడో రోజూ కొనసాగాయి. విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో మానోలిత్ థియేటర్ గ్రూప్ (మహారాష్ట్ర) వారి సమర్పణలో సోహా పిలానియా దర్శకత్వం వహించిన ఎండ్ గేమ్ నాటకం సమకాలీన సమస్యలను చాటుతూ రసవత్తరంగా ప్రదర్శించబడింది. మానవ మనుగడకు భూమి వాతావరణానికి పొంచి ఉండే భారీ ముప్పుతో ప్రారంభమై వ్యక్తుల అసమర్థతను ఎత్తిచూపే పరిస్థితి, మానవ ఉనికి, పునరావృత్తి స్వభావం జీవితంలోని అర్థరాహిత్యాన్ని కూడా సృష్టిస్తుందని, అర్థరాహిత్యం శూన్యత భావన వ్యక్తీకరిస్తుందని, నిజానికి జీవితం మానవ పరిస్థితుల నిగూఢ అర్థాన్ని కలిగి ఉంటూ సమాజంగా మానవులుగా కలిసి రావడానికి తద్వారా వ్యక్తి తన మార్గాన్ని కనుగొనే సహజ ప్రవత్తిని తెలిపే ఇతివత్తంతో ఈ నాటకం ప్రదర్శితమైంది. రాజేష్ సింగ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ వివేక్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సంచాలకులు ఆర్ మల్లికార్జునరావు తదితరుల నేతత్వంలో కార్యాలయ సిబ్బంది సుమన్, చిముడూరి శ్రీనివాస్ తదితరులు నిర్వహించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు నోటీసు
నిట్ నెం.455 నుండి 460/టిఓ/2023-24, **తేది : 06.02.2024**
కృష్ణాజిల్లాలో వివిధ గ్రాంట్ల క్రింద రూ.57.30 లక్షల అంచనా విలువతో రహదారులు మరియు కాంపౌండ్ గోడ 6 పనుల కొరకు ఆన్‌లైన్ టెండర్లను ఆహ్వానించడమైనది. బిడ్ డౌన్లోడ్ కొరకు ప్రారంభ తేది : 13.02.2024 నుండి. తదుపరి వివరాలను www.tender.apeprocurement.gov.in సందర్శించండి. ఫోన్ నం.9866062101
సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, పిఆర్ఐ డివిజన్, మచిలీపట్నం
DIPRNo.12875/CL/ADVT/1/1/2021-22

ముగిసిన తెలుగు చలన చిత్రోత్సవం

ప్రజాశక్తి- సీతమ్మధార

వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సామాజిక బాధ్యతగామూడురోజులుగా నిర్వహించిన తెలుగు చలన చిత్రోత్సవం గురువారంతో ముగిసింది. 1932 ఫిబ్రవరి 6న తొలి తెలుగు టాకీ సినిమా భక్త ప్రహ్లాద హెచ్‌ఎమ్ రెడ్డి దర్శకత్వంలో విడుదలై సంచలనం సష్టించిన రోజున ఏటా తెలుగు సినిమా దినోత్సవం జరుపుకుంటున్నారు. ఇందులో భాగంగా ద్వారకా నగర్ పౌరగ్రంథాలయంలో మూడు రోజులు చిత్రోత్సవాన్ని నిర్వ హించారు. అలనాటి చిత్రాలను ప్రదర్శించారు. 6న బంగారుపాప (1955), 7న జయభేరి, 8న బలగం (2023) సినిమాలను ప్రదర్శించారు. ముగింపు సమావేశంలో సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, ఇతర రాష్ట్రాలలో ఇటువంటి ఫెస్టివల్స్‌ను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుంటే, మన రాష్ట్రంలో అందుకు విరుద్ధంగా సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం రిక్తహస్తాన్ని అందించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఫెస్టివల్‌లో బలగం.చిత్రాన్ని ప్రదర్శించి, దానిపై సమీక్ష నిర్వహిం చారు. సమావేశంలో సొసైటీ అధ్యక్షులు ఎన్ఎడి పాల్, ఉపాధ్యక్షులు కాశీవిశ్వేశ్వ రరావు, బి.చిన్నారావు, హుస్సేన్, చాట్ల బాబూరావు, రెడ్డి ఉషారాణి, డాక్టర్ బాబ్జి పాల్గొన్నారు.

స్వదేశీ పరిజ్ఞానంతో ఆటోమాటిక్ రిగ్గులు

ఎంఇఐఎల్‌కు కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ ప్రశంస

హైదరాబాద్ : అత్యంత అధునాతనమైన హైడ్రాలిక్ వర్క్ ఓవర్ రిగ్‌లను పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేయటం పట్ల కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి హర్షం వ్యక్తం చేసారు. ఈ రిగ్గులను నిర్మిస్తున్న మెఘా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) దాని అనుబంధ సంస్థ డ్రిల్‌మెక్‌లను అయన ప్రశంసించారు. గోవాలో జరుగుతున్న ఇండియా ఎనర్జీ వీక్ 2024లో ఎంఇఐఎల్ దాని అనుబంధ సంస్థ డ్రిల్ మెక్ ఎస్‌పిఎ స్వదేశీ పరిజ్ఞానంతో ఆటోమేటిక్ పద్ధతిలో పనిచేసే హెచ్‌హెచ్ 150 హైడ్రాలిక్ వర్క్ ఓవర్ రిగ్‌ను ప్రదర్శించినట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ రిగ్‌ను కేంద్ర మంత్రి పూరితో కలిసి ఎంఇఐఎల్ మేనేజింగ్ డైరెక్టర్ పివి కృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ రిగ్ పని తీరును కేంద్ర మంత్రి అడిగి తెలుసుకున్నారని ఆ సంస్థ తెలిపింది. ఇటలీ సంస్థ సహకారంతో అత్యుత్తమమైన భద్రతా ప్రమాణాలతో 55 శాతం స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో అత్యంత అధునాతనమైన, భద్రతా పరమైన రిగ్‌ను ఈ ప్రదర్శనలో చూడటం సంతోషంగా ఉందని మంత్రి ట్వీట్ చేశారు. తాము 20 అత్యాధునిక రిగ్గులను ఒఎన్‌జిసికి సరఫరా చేస్తున్నామని ఎంఇఐఎల్ ఎండి పివి కృష్ణారెడ్డి తెలిపారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
భారత ప్రభుత్వ రంగ సంస్థ
लोటस్ ల్యాండ్ మార్క్ బ్రాంచి : లోటస్ ల్యాండ్ మార్క్, రాఘవేంద్ర థియేటర్ దగ్గర, రామలింగేశ్వరరావుపేట, విజయవాడ - 520003.

NOTICE UNDER SECTION 13 (2) OF ACT 54 OF 2002 FOR ENFORCEMENT OF SECURITY INTEREST

డిమాండ్ నోటీసు

టు : ఋణగ్రహీత : 1) అప్లికెంట్ : శ్రీమతి పంటగిరి సుగణ, భర్త : శ్రీ పంటగిరి రాంబాబు, డి.నెం. 18-4-44, ఫ్లాట్ నెం. 2 (ఎఫ్.ఎఫ్-2), ఫస్ట్ ఫ్లోర్, శ్రీ పాండురంగ ఎన్‌క్లేవ్, 2వ లైన్, విజయవాడ, కృష్ణ (ఇప్పుడు ఎన్‌టిఆర్) - 520003. **కో-అప్లికెంట్ : శ్రీ పంటగిరి పవన్ కళ్యాణ్,** తండ్రి : పంటగిరి రాంబాబు, డి.నెం. 18-4-44, ఫ్లాట్ నెం. 2 (ఎఫ్.ఎఫ్-2), ఫస్ట్ ఫ్లోర్, శ్రీ పాండురంగ ఎన్‌క్లేవ్, 2వ లైన్, విజయవాడ, కృష్ణ (ఇప్పుడు ఎన్‌టిఆర్) - 520003.

నేచర్ ఆఫ్ లిమిట్	ఋణ మంజూరు (లక్షల్లో)	ది. 29-01-2024 నాటికి బకాయి మొత్తము (రూ.)
Housing Loan 222030100027721	Rs. 26,50,000/-	Rs. 28,03,204.00

ప్రాథమిక హామీ : 1) విజయవాడ, కేదారేశ్వరపేట, శ్రీ పాండురంగ ఎన్‌క్లేవ్, 1వ అంతస్తు, నివాసఫ్లాట్ నెం. 2 (ఎఫ్.ఎఫ్-2). ప్లింత్ ఏరియా : 710 చ॥అ॥ మరియు 100 చ॥అ॥ కామన్ ఏరియా మరియు 50 చ॥అ॥ల పార్కింగ్ ఏరియా. కృష్ణా జిల్లా, విజయవాడ ఎస్.ఆర్.ఓ. కేదారేశ్వరపేట, 2వ లైన్, డోర్ నెం. 18-4-44 (రెవిన్యూ వార్డు 82, మున్సిపల్ వార్డు 20బి) కొత్త అసెస్ట్ నెం. 122183, పాత అసెస్ట్ నెం. 17168, మున్సిపల్ వార్డు నెం. 20బీ, రెవిన్యూ వార్డు 8, ఎన్‌టిఎస్ నెం. 19 వద్ద మొత్తం 386.02 చ॥గ॥లు లేదా 322.76 చ॥మీ॥ల విస్తీర్ణంలోని స్థలము అందలి అవిభక్త మరియు పేర్కొనబడని జాయింట్ హక్కుల వాటా 31.456 చ॥గ॥లు లేదా 26.30 చ॥మీ॥ల విస్తీర్ణంలో "శ్రీ పాండురంగ ఎన్‌క్లేవ్" అపార్ట్‌మెంట్ నందు ఫస్ట్ ఫ్లోర్ నందు ఫ్లాట్ నెం. 2 దానికి చెందిన ప్లింత్ ఏరియా : 710, 100 చ॥అ॥లు కామన్ ఏరియా, 50 చ॥అ॥లు బాల్కనీ, 30 చ॥అ॥ల పార్కింగ్.

అమ్మా / అయ్యా,
విషయం : ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము ప్రకారము నోటీసు - మీరు మా నుండి పొందిన ఋణ సౌకర్యములకు సంబంధించి - నిరర్థక ఆస్తులుగా వర్గీకరణ.
ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా మీరు **హౌసింగ్ లోన్ ఖాతా క్రింద మా లోటస్ ల్యాండ్ మార్క్ బ్రాంచి** వద్దనున్న మీ ఋణ బకాయిలను / వడ్డీని చెల్లించుటలో విఫలమై నందున మీ **ఖాతాను ది. 29-01-2024 న నిరర్థక ఆస్తిగా (NPA)** వర్గీకరించబడింది. ఎగువ తెలిపిన తేదిన మీ ఋణ ఖాతాల బకాయిలు మొత్తము పైన తెలుపబడినవి. అనేక మార్లు విన్నపములు చేసినప్పటికీ, మీరు మీ ఖాతాలోని బకాయి మొత్తములను చెల్లించలేదు / మీ ఋణములను చెల్లించలేదు. అందువలన సెక్యూరిటైజేషన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఆర్డినెన్స్, 2002 యొక్క సెక్షన్ 13 (2) ప్రకారము మీ యొక్క బకాయి మరియు ఋణ పత్రములో అంగీకరించబడిన నియమ నిబంధనలలో ఉన్న ఒప్పందపు రేటు ప్రకారము పైన తెలుపబడిన బకాయి తేది 29-01-2024 నుండి తదుపరి నెలవారి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా ఈ నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసి ఉంటుందని, అట్లు చేయుటలో విఫలమైనచో మీరు మా బ్యాంకుకు హామీ ఇచ్చిన ఆస్తులపై సదరు చట్టం ప్రకారం లభించు ఏవేని లేదా అన్ని హక్కులను ప్రయోగించ వలసి ఉంటుందని తెలియజేయడమైనది.
1) మీరు సదరు బకాయిలను 60 రోజులలోగా తిరిగి చెల్లించుటలో విఫలమైనచో, బ్యాంకు వారు సదరు చట్టం ప్రకారం వారికి సంక్రమించిన అన్ని హక్కులను వినియోగించి హామీ ఇవ్వబడిన ఆస్తుల విక్రయ ధనముతో బకాయిలను పూర్తిగా చెల్లించబడనప్పుడు, మిగిలిన బకాయి సొమ్ము మీ నుండి రాబట్టుకొనుటకు, న్యాయస్థానము / డెట్ రికవరీ ట్రిబ్యునల్ నందు తగు న్యాయపరమైన చర్యలు తీసుకోబడునని తెలియజేయడమైనది.
2) సదరు చట్టం యొక్క సెక్షన్ 13 (13) ప్రకారము ఈ నోటీసు పొందిన అనంతరం మీరు పైన చెప్పబడిన ఆస్తులను సాధారణ వ్యాపార కార్యకలాపాలు తప్ప బ్యాంకు వారి అనుమతి లేకుండా విక్రయించరాదు. మరియు లావాదేవీలు జరుపరాదు సదరు సెక్షన్‌లో నిబంధనలలో ఏ విధమైన అతిక్రమణ జరిగిన తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని గమనించగలరు.
3) SARFAESI చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) ప్రకారము ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువు లోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసి ఉన్నది.
తేది : 02-02-2024 **సం/- ఆథరైజ్డ్ ఆఫీసర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

ఫేస్‌బుక్ లైవ్‌లో శివసేన(యుబిటి)నేత

దారుణ హత్య

ముంబయి: ఫేస్‌బుక్ లైవ్‌లో మాట్లాడుతుండగానే శివసేన (ఉద్ధవ్ థాక్రే గ్రూపు)కు చెందిన ఒక నాయకుడు దారుణ హత్యకు గురయ్యారు. అనంతరం నిందితుడు తనను తాను కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ముంబయి లో చోటుచేసుకుంది. స్థానిక సామాజిక ఉద్యమకారుడు మౌరిస్ నొరాన్హా ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాల్పులకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివసేన (యూబీటీ) గ్రూపునకు చెందిన అభిషేక్ ఘోసాల్కర్ గతంలో కార్పొరేటర్‌గా పనిచేశారు. అతడి తండ్రి వినోద్ పార్టీలో సీనియర్ నేతగా ఉన్నారు. స్థానిక ఉద్యమకారుడైన నొరాన్హా, అభిషేక్‌ల మధ్య గత కొంతకాలంగా వ్యక్తిగత వైరం ఉంది. ఈ క్రమంలో ముంబయిలోని బొరివ్లీ ప్రాంతంలోని ఐసీ కాలనీ అభివద్ధి పనుల కోసం మాట్లాడుకోవడానికి నొరాన్హా తన కార్యాలయానికి అభిషేక్‌ను ఆహ్వానించాడు. అక్కడికి వెళ్లిన అభిషేక్ ఫేస్‌బుక్ లైవ్ స్ట్రీమింగ్‌లో మాట్లాడుతుండగా నిందితుడు తుపాకీతో కాల్పులు జరిపాడు. పొట్టలో, భుజంలోకి తూటాలు దూసుకెళ్లడంతో బాధితుడు కుప్పకూలాడు. గమనించిన స్థానికులు అభిషేక్‌ను ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. అనంతరం నొరాన్హా తనని తాను కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాల్పుల ఘటన అంతా ఫేస్‌బుక్ లైవ్‌లో రికార్డు అయింది.

ఈ ఘటనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే విచారణకు ఆదేశించగా, ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందించాయి. డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడణవీస్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఎంపీ సంజయ్ రౌత్ డిమాండ్ చేశారు. మహారాష్ట్రలో శాంతి భద్రతలు కరవయ్యాయని మాజీ మంత్రి ఆదిత్య థాక్రే విమర్శించారు.

ఎపి టెట్ నోటిఫికేషన్ విడుదల

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఎపి టెట్) నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేశారు. ఫిబ్రవరి 27 నుంచి మార్చి 9 వరకు ఏపీ టెట్ పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్ష ఫీజు: రూ.750గా నిర్ణయించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.దరఖాస్తుకు ఈ నెల 18 వరకూ అవకాశం ఉంది. అలాగే ఏపీ టెట్ మార్కులకు ఉపాధ్యాయ నియామక పరీక్షలో 20 శాతం వెయిటేజీ కూడా ఉంది. అభ్యర్థులు ఏపీ టెట్‌కు సంబంధించిన పూర్తి వివరాలను https://aptet.apcfss.in వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవచ్చు.ఈ టెట్ పరీక్షను ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహిస్తారు. రోజుకు రెండు సెషన్లలో ఉంటుంది. మొదటి సెషన్ ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు.. రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు ఉంటుంది. పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 185 కేంద్రాలను ఎంపిక చేశారు. రాష్ట్రం బయట ఉన్నవారి కోసం మరో 22 సెంటర్లను హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, బరంపురంల్లో ఏర్పాటు చేయనున్నారు.

AP - TET 2024

విజయ్ రాజకీయాల్లో రాణిస్తాడు

కోలీవుడ్ హీరో విజయ్ రాజకీయ రంగ ప్రవేశంపై హీరో రామ్‌చరణ్ సతీమణి ఉపాసన స్పందించారు. నిరంతరం దేశంలోనూ, రాష్ట్రంలోనూ జరిగే పరిణామాలపై సోషల్ మీడియాలో స్పందించే ఆమె తాజాగా విజయ్ పొలిటికల్ ఎంట్రీని స్వాగతించారు. 'సినీ పరిశ్రమకు చెందిన చాలామంది రాజకీయాల్లో రాణించారు. ముఖ్యమంత్రులుగా కూడా సేవలు చేశారు. విజయ్ నటుడిగా ఎంతోమంది హృదయాలను గెలుచుకున్నారు. ఇప్పుడు ప్రజాసేవ చేసేందుకు రాజకీయాల్లో వచ్చారంటే అది చాలా గొప్ప విషయం. సమాజంలో మార్పు రావాలని కోరుకునే లీడర్ ఎవరైనా సపోర్టు చేయాలనేది నా అభిప్రాయం. ఒక వేళ సపోర్టు చేయకపోయినా వెనక్కి మాత్రం లాగకూడదు. విజయ్ గొప్ప రాజకీయ నాయకుడు అవుతాడని భావిస్తున్నా' అని పేర్కొన్నారు.

డ్రిల్ మూవీ టీజర్ విడుదల

డ్రీమ్ టీమ్ బ్యానర్‌పై దర్శక నిర్మాత, కథానాయకుడు హరనాథ్ పొలిచెర్ల రూపొందించిన చిత్రం డ్రిల్. కారుణ్య చౌదరి, భవ్య, నిషిగంధ ప్రధాన పాత్రల్లోనూ; తనికెళ్ల భరణి, రఘుబాబు, జెమినీ సురేష్, కోటేశ్వరరావు, సత్తన్న, విశ్వ, జబర్దస్త్ ఫణి ఇతర పాత్రల్లో కనిపిస్తారు. ఈనెల 16న సినిమా విడుదల కానుంది. సంగీత దర్శకుడు ఆర్‌పి పట్నాయక్ దీని టీజర్‌ను విడుదల చేశారు. అమెరికాలో డాక్టర్‌గా స్థిరపడిన హరనాథ్ పొలిచెర్ల దేశానికి వచ్చి ఎంతోమంది ఆర్టిస్టులకు అవకాశం కల్పిస్తూ తెలుగు సినిమాలు చేయటం అభినందనీయమని అన్నారు.

మార్చి 1న 'చారి 111'

'వెన్నెల' కిశోర్ హీరోగా నటిస్తున్న సినిమా 'చారి 111'. టీజీ కీర్తి కుమార్ తెరకెక్కించారు. ఈ చిత్రాన్ని మార్చి 1న థియేటర్లలో విడుదల చేస్తున్నట్లు నిర్మాత తెలిపారు. కన్‌ఫ్యూజ్ అయ్యే గూఢ చారిగా 'చారి' పాత్రలో వెన్నెల కిశోర్ కనిపిస్తారని, ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చెప్పారు. దర్శకుడు టీజీ కీర్తి కుమార్ మాట్లాడుతూ 'ఇదొక స్పై యాక్షన్ కామెడీ సిని మా. సిల్లీ మిస్టేక్స్ చేసే ఒక స్పై పెద్ద కేసును ఎలా సాల్వ్ చేశాడ నేది సినిమా. వెన్నెల కిశోర్, సంయుక్తా విశ్వనాథన్ స్పై రోల్స్ చేశారు. వాళ్లకు బాస్ పాత్రలో మురళీ శర్మ కనిపిస్తారు.' అని చెప్పారు.

14న టిల్లు స్క్వేర్ ట్రైలర్ విడుదల

సిద్ధు జొన్నలగడ్డ, అనుపమ పరమేశ్వరన్ జంటగా నటిస్తున్న చిత్రం 'టిల్లు స్క్వేర్'. డీజే టిల్లు ప్రాజెక్టుకు సీక్వెల్‌గా టిల్లు 2 (టిల్లు స్క్వేర్). మల్లిక్‌రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ తెరకెక్కించారు. రామ్ మిర్యాల, అచ్చు రాజమణి సంగీతాన్ని అందించారు. సిద్ధు జొన్నలగడ్డ పుట్టినరోజైన బుధవారం నాడు చిత్రబృందం స్పెషల్ బర్త్‌డే గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈనెల 14న ట్రైలర్ విడుదల కానుంది.

'గొర్రె పురాణం'తో సుహాస్

సుహాస్ హీరోగా 'గొర్రె పురాణం' అనే సినిమా తెరకెక్కుతోంది. ఈ సినిమాకు బాబీ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి చిత్రబృందం ఫస్ట్ గ్లింప్స్‌ని విడుదల చేసింది. 'చంచల్ గూడలో ఉన్న ఏ1 ఏసుకు కోర్టు బెయిల్ నిరాకరించింది' అంటూ గ్లింప్స్ మొదలవుతుంది. ఆ తర్వాత గొర్రెను సెంట్రల్ జైలు నుంచి బయటకు తీసుకొస్తూ చూపించారు. 'ఈ చిత్రం నిబ్బ, నిబ్బిల కోసం కాదు' అంటూ చివరిలో క్యాప్షన్ పెట్టారు.

'ట్రూ లవర్' ఫ్యామిలీ సినిమా

మణికందన్, శ్రీ గౌరి ప్రియ, కన్న రవి లీడ్ రోల్స్‌లో నటిస్తున్న సినిమా 'ట్రూ లవర్'. మిలియన్ డాలర్ స్టూడియోస్, ఎంఆర్ పీ ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్‌పై నజేరత్ పసీలియన్, మగేష్ రాజ్ పసీలియన్, యువరాజ్ గణేషన్ ఈ సినిమాని నిర్మించారు. ఓ విభిన్న ప్రేమ కథగా దర్శకుడు ప్రభురామ్ వ్యాస్ రూపొందించారు. ఈ సినిమాను డైరెక్టర్ మారుతి, సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ నెల 10వ తేదీన ఈ సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం ఈ చిత్ర ప్రీ రిలీజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మారుతి చిత్ర విశేషాలపై మాట్లాడారు. 'ఈ సినిమా కథను దర్శకుడు చాలా జెన్యూన్‌గా తెరకెక్కించారు. అబ్బాయిలు, అమ్మాయిలే కాదు ఫ్యామిలీ అంతా కలిసి చూసే సినిమా ఇది. ఈ సినిమాతో ఈ వాలెంటైన్స్ డే మర్చిపోలేకుండా ఉంటుందని చెప్పగలను. మణికందన్, శ్రీ గౌరి ప్రియ నటన ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణ అవుతుంది'.

IREP
ఐఆర్‌ఇపి క్రెడిట్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్
నమోదిత కార్యాలయం : యూనిట్ 22వ అంతస్తు, సన్‌షైన్ టవర్, ఎస్‌బి రోడ్డు, దాదర్ వెస్ట్, ముంబై.
సిఐఎన్ నం.: U51909MH1996PTC140269.
www.irepglobal.com ఫోన్: +91 22 4445 1086, ఇమెయిల్: contact@irepglobal.com
స్థిరాస్తుల అమ్మకం కొరకు వేలం నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (సర్ఫేసీ) యాక్ట్, 2002(నం.54 ఆఫ్ 2002) క్రింద మాకు తాకట్టుపెట్టబడిన స్థిరాస్తుల అమ్మకం. ఏదైతే, ఐఆర్‌ఇపి క్రెడిట్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (సర్ఫేసీ) యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద జారీచేసిన ప్రకటన అనుసరించి దిగువ ఆస్తులను స్వాధీనంచేసుకున్నారు. ఇచ్చట దిగువ వివరించినట్లుగా బ్యాంకు యొక్క బకాయిలు + వడ్డీ మరియు చార్జీల రియలైజేషన్ కొరకు **"ఎక్కడ ఉన్నది", "ఏది ఉంది అలాగే"** మరియు **"అక్కడ ఏమైనా"** పద్ధతిన విక్రయించుటకు హక్కులతో దిగువ ఋణ ఖాతాలో ఏదైతే, బాకాయిలను తిరిగి జమచేయబడుతుంది. క్రింది సంతకందారు రూల్ 8(5) మరియు (6) క్రింద సదరు ఆస్తుల అమ్మకం ద్వారా బ్యాంకు బకాయిల రియలైజేషన్‌కు ప్రతిపాదిస్తూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తారు. అమ్మకం 23.02.2024న బహిరంగ వేలం దిగువసంతకందారు ద్వారా చేపట్టబడును.
శాఖ: గుంటూరు

క్ర. సం.	ఋణగ్రహీతలు/ హామీదారుల పేరు	సెక్యూర్డ్ అసెట్స్ యొక్క వివరణ	డిమాండ్ నోటీసు తేది మరియు బకాయిలు
1	**శ్రీ.నాగచైతన్య చిమ్మిలి (దరఖాస్తుదారులు-నివాసం చిరునామా), తండ్రి. సిహెచ్.సాంబయ్య, నివాసం :** ఫ్లాట్ నం.407, చిల్లీస్ మెన్షన్, అంకిరెడ్డిపాలెం, నల్లపాడు (రూరల్), గుంటూరు, గుంటూరు (జిల్లా), ఆంధ్రప్రదేశ్-522005. ఇక్కడ కూడా : **శ్రీ.నాగచైతన్య చిమ్మిలి హర్షిత ఎంటర్‌ప్రైజెస్,** హౌ.నం.231-237/బి, లక్ష్మీ నగర్, గుంటూరు (జిల్లా), ఆంధ్రప్రదేశ్-522005. ఇక్కడ కూడా : **శ్రీ.నాగచైతన్య చిమ్మిలి** (దరఖాస్తుదారు-శాశ్వత చిరునామా), తండ్రి. సిహెచ్.సాంబయ్య, హౌ.నం.25-16-786, లక్ష్మీ నగర్, గుంటూరు (జిల్లా), ఆంధ్రప్రదేశ్-522005. ఇక్కడ కూడా : శ్రీ.నాగచైతన్య చిమ్మిలి (ఆస్తి చిరునామా), ఫ్లాట్ నం.లు.596 మరియు 4911, డో.నం.965 మరియు 964, డో.నం.10-26 వద్ద, ఎస్‌వై.నం.965, పెద్దకాకాని, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్. 2. **శ్రీమతి. హర్షిత చిమ్మిలి (సహ దరఖాస్తుదారు-నివాసం-చిరునామా),** హౌ.నం.407, చిల్లీస్ మెన్షన్, అంకిరెడ్డిపాలెం, నల్లపాడు (రూరల్), గుంటూరు, గుంటూరు (జిల్లా), ఆంధ్రప్రదేశ్-522005. **3. శ్రీ.లవునూరి మధుసూధనరెడ్డి (హామీదారులు), తండ్రి. కోటి రెడ్డి, నివాసం** : 2-6-10, స్థంబాలగరువు, పట్టాభిపురం, బృందవ గార్డెన్స్, గుంటూరు, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522006. **4. శ్రీ.బత్తుల శివవెంకట ఆంజనేయ ప్రసాద్ (హామీదారులు), తండ్రి. తిరుపాలు, నివాసం** : 26-45-49, సీతమ్మ కాలనీ పట్టాభిపురం, బృందావన్ గార్డెన్స్, గుంటూరు, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522006.	సెక్యూర్డ్ అసెట్స్ వివరాలు: అంశం నం.1 : గుంటూరు జిల్లా, పెద్దకాకాని ఉపజిల్లా, ఉమ్మడి పెద్దకాకాని గ్రామ పంచాయతీ ఏరియాపెద్దకాకాని గ్రామంలో మొత్తం ఆ రెసిడెన్షియల్ ఓపెన్ ప్లాట్‌కు సంబంధించిన కొలత 217.44 చ.గ.లు., డో.నం.965లో ఎ.లు.12-92 సెంట్లు., డో.నం.964 ఎకరాలు.10-22 సెంట్లు., పై మొత్తం రెండు డో.నం.లు. ఎ.లు.23-14 సెంట్లు. ఆ విక్రేత ఉన్న హక్కు ఎ.లు. 3-59 సెంట్లు. మరియు అందులో ప్లాట్లుగా విభజించబడిన ప్లాట్ నం.596 217-4/9 చ.గ.లు. ఉన్న హద్దులు : ఉత్తరం : ప్లాట్ నం.597 57-9 అ.లు., దక్షిణం : ప్లాట్ నం.595 61 అ.లు., తూర్పు: ఇతరుల ఆస్తి 33 అ.లు., పడమర : 33 అ.లు. రోడ్డు 33 అ.లు. **అంశం నం.2 :** గుంటూరు జిల్లా, పెద్దకాకాని ఉపజిల్లా, ఉమ్మడి పెద్దకాకాని పంచాయతీ ఏరియా గ్రామంలో పెద్దకాకాని గ్రామం వద్ద ఉన్న రెసిడెన్షియల్ ఆస్తికి సంబంధించిన మొత్తం ఓపెన్ ప్లాట్ కొలత 200.22 చ.గ.లు., డో.నం.964 ఎ.లు. 10-22 సెంట్లు., డో.నం.965 లో ఎ.లు. 12-92 సెంట్లు. పై రెండు డో.నం.లు. మొత్తం ఎకరాలు 23-14 సెంట్లు. ఆ విక్రేత ఉన్న హక్కు ఎకరాలు 3-59 సెంట్లు. మరియు ప్లాట్లుగా విభజించబడిన ఆ ప్లాట్లు ప్లాట్ నం.491 200.22 చ.గ.లు. ఉన్న హద్దులు : ఉత్తరం : ప్లాట్ నం.492-53 అ.లు., దక్షిణం : ప్లాట్ నం.490-53 అ.లు., తూర్పు : 33 అ.లు. రోడ్డు 34 అ.లు., పడమర : ప్లాట్ నం.484-34 అ.లు.	**31-08-2021 రూ. 33,38,304.24/- (ముప్పై మూడు లక్షల ముప్పై ఎనిమిది వేల మూడు వందల నాలుగు రూపా యల ఇరవై నాలుగు పైసలు మాత్రమే)** స్వాధీనతా తేది: **25-11-2021**

రిజర్వు ధర: రూ. 16,70,680/-, ధరావత్తు: రూ. 1,67,100/-
వేలం తేది: 23-02-2024, సమయం: ఉ॥ 11:00గం.ల నుండి సా॥ 4:00గం.లు వరకు.

నియమాలు మరియు నిబంధనలు:
1) వేలం అనునది **'ఎక్కడ ఉన్నది", "ఏది ఉంది అలాగే" మరియు "అక్కడ ఏమైనా"** పద్ధతిన నిర్వహించబడుతుంది. 2) ఆధీకృత అధికారికి తెలిసినంత మరియు సమాచారం ఉన్నంత వరకు ఏదేని ఆస్తిపై రుణభారాలు లేవు. అయితే ఆసక్తిగల బిడ్డరుదారులు వేలం పై పెట్టే ఆస్తి యొక్క రుణభారాలు, టైటిల్ మరియు ఆస్తిపై ఏవేని క్లెయింలు/హక్కులు/బకాయిలను వారు బిడ్ దాఖలుచేయుటకు ముందే స్వతంత్రంగా స్వంతంగానే విచారణ జరుపుకోవలసి ఉంటుంది.3) ఈ బహిరంగ వేలం ప్రకటన సంస్థ ఏదేని బాధ్యత మరియు భరోసా ఇవ్వదు, బాధ్యులు కారు. 4) ఏవేని తెలిసిన లేదా తెలియని అన్ని ప్రస్తుత మరియు తదుపరి రుణభారాలతో ఆస్తి విక్రయించబడుతుంది. 5) ఆధీకృత అధికారి/ సెక్యూర్డ్ క్రెడిటర్ ఎవరైనా థర్డ్ పార్టీ క్లెయింలు/హక్కులు/బకాయిల కొరకు ఏదేని విధానంలో బాధ్యత వహించరు. 6) నిర్ణీత టెండరు ఫారం మరియు అమ్మకం యొక్క నియమ నిబంధనలు ఐఆర్‌ఇపి ధన్ ప్రైవేట్ లిమిటెడ్ అసోసియేట్‌గా **(ఐఆర్‌ఇపి క్రెడిట్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్) గుంటూరు శాఖ, డో.నం.24-16-35, ఎస్.వి.కాంప్లెక్స్, 6వ లైన్, నల్ల చెరువు, గుంటూరు-522003 వద్ద 10 ఫిబ్రవరి, 2024 నుండి 22 ఫిబ్రవరి 2024, ఉ.10.00 గం. నుండి సా.5.00 గం. మధ్య ఏదైనా పని దినతమున అందుబాటులో ఉంటాయి.** 7) సీల్డ్ టెండర్లు స్వీకరించడానికి చివరి తేది ఐఆర్‌ఇపి ధన్ ప్రైవేట్ లిమిటెడ్ అసోసియేట్‌గా **(ఐఆర్‌ఇపి క్రెడిట్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్) గుంటూరు శాఖ, డో.నం.24-16-35, ఎస్.వి.కాంప్లెక్స్, 6వ లైన్, నల్ల చెరువు, గుంటూరు-522003 వద్ద 10 ఫిబ్రవరి, 2024 నుండి 22 ఫిబ్రవరి 2024, ఉ.10.00 గం. నుండి సా.5.00 గం. వరకు.** 8) ఉద్దేశించిన టెండరర్(లు) తమ టెండర్ పేపర్‌లను సీల్డ్ కవర్‌లో సమర్పించాలి, "పేర్కొన్న ఆస్తిని కొనుగోలు చేయడానికి టెండర్లు" తో పాటు వాణిజ్య బ్యాంకు ఫేవర్, **"ఐఆర్‌ఇపి క్రెడిట్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్"** అర్జెంట్ మనీ డిపాజిట్ (ఇఎమ్‌డి)తో పాటు, షెడ్యూల్ చేసిన వారిచే జారీ చేయబడిన డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా రిజర్వ్ ధరలో 10 శాతం ఉంటుంది. 9) చెల్లింపుల సమయం మరియు విధానం: ఎ) ఎన్‌ఇఎఫ్‌టి/ఆర్‌టిజిఎస్/ఐఎంపిఎస్ ద్వారా సంస్థచే ఆఫర్ ఆమోదించబడిన వెంటనే ఆఫర్ మొత్తాలలో 25%ను చెల్లించాల్సి ఉంటుంది. బి) మిగతా మొత్తాలను సంస్థచే ఆఫర్ ఆమోదించబడిన 15 రోజుల్లో చెల్లించాలి. సి) చెల్లించుటలో డిఫాల్టిచెందినట్లైతే, అప్పటి వరకు చెల్లించిన మొత్తాలు జప్తుచేయబడుతాయి. 10) పై అమ్మకం అనునది ఐఆర్‌ఇపి ధన్ ప్రైవేట్ లిమిటెడ్ అసోసియేట్‌గా (ఐఆర్‌ఇపి క్రెడిట్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్) వారి తుది ఆమోదంకు అనుగుణంగా ఉంటుంది.11) ఆసక్తిగల పార్టీలు వారి సదరు డిపార్టుమెంట్స్/ఆఫీసుల నుండి అమ్మకాలు/ఆస్తి పన్ను, విధ్యుత్ బకాయిలు, మరియు సొసైటీ బకాయిలు వంటి చట్టబద్ద మరియు ఇతర బకాయిలను సరిగా చూసుకోవలెను. బ్యాంకు పై బకాయిల చెల్లింపుల యొక్క ఏవేని బాధ్యత చేపట్టదు. 12) పై పేర్కొన్న ఆస్తులకు సంబంధించిన వివరాలు దిగువసంతకందారు సమాచారానికి తెలియజేయబడ్డాయి. అయితే, సదరు వివరాలలో ఏవేని తప్పులు, లోపాలు ఉన్నట్లైతే దానికి దిగువసంతకందారు బాధ్యత తీసుకోరు. ఆసక్తిగల కొనుగోలుదారులు, టెండర్లు దాఖలుచేయుటకు ముందే ఆస్తికి సంబంధించిన అట్టి ఈ వివరాలు మరియు ఇతర వివరాల పట్ల వారి స్వతం ఆసక్తితో తనిఖీ చేసి ధృవీకరించవలసిందిగా అభ్యర్థించబడ్డారు. 13) ఈ ప్రకటనలో పొందుపరచబడిన నిబంధనలు మరియు షరతులకు మరియు సూచించిన టెండర్ ఫారమ్‌లో విక్రయం ఖచ్చితంగా కట్టుబడి ఉంటుంది. 14) రుణగ్రహీత, సదరు టెండరుదారులు, హామీదారులు, ఒకవేళ అమ్మకానికి అందించిన ఆస్తికి అతని/వారి ఉత్తమమైన ఆఫర్‌లను అందిస్తే, వారు పైన పేర్కొన్న అన్ని అవసరాలను పాటిస్తారు. 15) టెండర్లు తెరిచిన తరువాత వారి బిడ్/ ఆఫర్లను పెంచుకొనుటకు బిడ్డరుదారులు/టెండరుదారులకు/ఆఫరర్స్‌కు అధీకృత అధికారి ఒక అవకాశం ఇస్తారు. ఆ సమయంలో బిడ్డరుదారులు/టెండరుదారులు/ఆఫర్‌దారులు స్వయంగా లేదా వారిచే ధృవీకరించబడిన ప్రతినిధులు హాజరవవలసిందిగా కోరబడుతున్నారు. బిడ్డరుదారులు/టెండరుదారులు/ఆఫర్‌దారులు వారి తదుపరి ఆఫర్‌ను రూ.50,000/- (యాభై వేల రూపాయలు మాత్రమే) ల గుణాంకాలతో పెంచుకోవచ్చును. 16) రుణగ్రహీత, సదరు టెండరుదారులు, హామీదారులు, ఆస్తి యజమానులు లేదా వారి ప్రతినిధులు టెండర్లు తెరుచు సమయంలో హాజరవవలసిందిగా కోరడమైనది. 17) సంస్థ ఏ కారణం చూపకుండానే ఏదేని/అన్ని ఆఫర్లను ఆమోదించు/ తిరస్కరించు అధికారాలు కలిగియుంటారు. ఏదేని బ్రోకరేజిని అనుమతించరు. 18) గెలుపొందిన బిడ్డరుదారు/ఆఫరుదారు అమ్మకం సర్టిఫికేట్‌ను పొందుట కొరకు స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు, మరియు యాధృచ్ఛిక ఖర్చులను భరించవలసి ఉంటుంది.19) తదుపరి వివరాలు మరియు సందేహాల కొరకు, ఆధీకృత అధికారి: శ్రీ.పి.చంద్ర పాల్, ఫోన్ నం.: 7396806091 ను సంప్రదించవచ్చును.

సవరించబడిన సర్ఫేసీ యాక్ట్ 2002 ప్రకారం రూల్ 8(6) క్రింద తదుపరి అమ్మకం కొరకు చట్టబద్ధమైన 15 రోజుల విక్రయ నోటీసు
వేలం తేదీకి ముందు నోటీసులోని సెక్షన్-13(2) లో పేర్కొన్నట్లుగా మొత్తంతో పాటు తాజా వడ్డీ మరియు వ్యయాలను చెల్లించవలసిందిగా పై పేర్కొన్న రుణగ్రహీత/తనఖాదారు/హామీదారులకు నోటీసు ఇవ్వడమైనది. విఫలమైతే, ఆస్తి వేలం వేయబడుతుంది మరియు మిగతా బకాయిలు ఏవేని ఉన్నట్లయితే మీ నుండి వడ్డీ మరియు ఖర్చులతో వసూలు చేయబడతాయి.
ప్రదేశం: గుంటూరు, తేది: 09.02.2024 **అధీకృత అధికారి, ఐఆర్‌ఇపి క్రెడిట్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్., తరఫున**

న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టిన నిరసనోద్యమంలో ప్రసంగిస్తున్న కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్

జమ్ముకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్

పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్

తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తరపున సంఘీభావం తెలియచేస్తున్న ఆ రాష్ట్ర మంత్రి త్యాగరాజన్

కేంద్ర వివక్షపై సమిష్టి పోరు

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టంగా కనిపిస్తున్నాయనీ, ముఖ్యంగా ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో స్పష్టమైందని అన్నారు. ' రాష్ట్రాలకు సమాన హోదా కోసం, సమాఖ్య నిర్మాణాన్ని పరిరక్షించడమే ఈ ఆందోళన లక్ష్యం. అలా ఫిబ్రవరి ఎనిమిది చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది. దీన్ని ఉత్తర-దక్షిణ సమస్యగా చిత్రీకరించే యత్నం చేస్తున్నారని ప్రధాని అనడం బాధ్యతారాహిత్యమని ఆయన అన్నారు. సమాఖ్య నిర్మాణాన్ని కాపాడుకోవడానికి జరుగుతున్న ప్రజాస్వామిక పోరాటం. రాష్ట్రాల పట్ల వివక్షకు నిరసన. రాష్ట్రం, ప్రజల హక్కులు ప్రమాదంలో ఉన్నప్పుడు మనం మౌనంగా ఉండలేం. రాష్ట్రాల సమాఖ్యగా దేశం పురోగమించాలి. అంతే కాకుండా రాష్ట్రాలపై సమాఖ్య నియంతృత్వం తోడవాల్సిన అవసరం లేదు. రాష్ట్రాలను, తద్వారా దేశాన్ని బలోపేతం చేయడంలో కేరళ పోరాటం కీలక మైలురాయిగా నిలిచింది. ఈ ప్రజాస్వామిక పోరాటానికి మరిన్ని రాష్ట్రాలు, పార్టీలు చేరుతాయని ఆశిస్తున్నా.

రాష్ట్ర జాబితాలో శాంతిభద్రతలు సహా పలు అంశాలపై రాష్ట్రాల అధికారాలను హరించివేసే చట్టాలను మోడీ తెస్తున్నాడు. వ్యవసాయం, ఇంధనం, ఆరోగ్యం, విద్య, సహకారం వంటి అంశాలపై కూడా చట్టాలు చేశారు. సహకార మంత్రిత్వ శాఖను కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. రాష్ట్రాలను ప్రభావితం చేసే అంశాలపై సంబంధితరాష్ట్రాలను సంప్రదించకుండా బహుళజాతి ఒప్పందాలు కుదుర్చుకుంటున్నది.. రాష్ట్రాలపై కేంద్రం అప్రజాస్వామిక స్వభావానికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. రాష్ట్రాల ఆర్థిక వనరులను దోచుకుంటూ కేంద్ర ప్రభుత్వం ఫెడరలిజాన్ని నాశనం చేస్తున్నారు. కేంద్రం వివక్షను, రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎత్తిచూపుతూ కేంద్రానికి లేఖలు రాసినా, వ్యక్తిగతంగా కలిసి విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయింది. కేరళ విపత్తును ఎదుర్కొంటున్న తరుణంలోనూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యతిరేక చర్యలు కొనసాగించింది" అని ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు. " రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సంక్లిష్టంగా మారడానికి రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత అన్నట్లుగా మోడీ ప్రభుత్వం మాట్లాడడం దారుణమని అన్నారు. ఇబ్బందులు ఉన్నప్పటికీ, కేరళలో సొంత ఆదాయం అనూహ్యంగా పెరిగింది. రాష్ట్ర మొత్తం వ్యయం 2020-21లో రూ. 1.32 లక్షల కోట్ల నుంచి 2022-23 నాటికి రూ. 1.59 లక్షల కోట్లకు పెరిగింది. ఏడాది చివరి నాటికి 1.69 లక్షల కోట్లు. ఇది రాష్ట్ర ఆర్థిక కార్యకలాపాలను చూపుతోంది. సొంత ఆదాయాన్ని గణనీయంగా పెంచుకోవడంతో అదనపు మొత్తాన్ని వెచ్చించాం. రాష్ట్రం 2020-21లో రూ.47,661 కోట్ల నుంచి సొంత పన్నుల రాబడిని 2021-22లో రూ.58,341 కోట్లకు, 2022-23లో రూ.71,968 కోట్లకు పెంచుకుంది. సంవత్సరం చివరి నాటికి రూ.78,000 కోట్లకు చేరింది.

కేంద్రం దెబ్బ తిన్నప్పుడు కూడా కేరళలో ఆర్థిక స్తబ్ధత లేదు. సొంత ఆదాయాన్ని పెంచుకోవడం ఆర్థిక దుర్వినియోగమా? కేరళ ప్రస్తుత జిఎస్‌డిపి దాదాపు రూ.11 లక్షల కోట్లు. రుణ పరిమితుల కారణంగా కేరళ ఇందులో 10 శాతం నష్టపోతోంది. మూలధన వ్యయంపై బహుళస్థాయి ప్రభావాన్ని లెక్కిస్తే, వచ్చే ఐదేళ్లలో కేరళ రూ. 3 లక్షల కోట్ల వరకు నష్టాన్ని చవిచూడవచ్చు. దీనివల్ల కేరళ ఆర్థిక వ్యవస్థ 20 నుంచి 30 శాతం కుంచించుకుపోతుంది. కేరళ 100 రూపాయల పన్ను ఆదాయంలో 79 రూపాయలు వసూలు చేస్తుంది. కేంద్రం 21 రూపాయలు మాత్రమే ఇస్తుంది. 35 చెల్లించాలి. ఉత్తరప్రదేశ్‌కు 100కి 46, బీహార్‌కు 100కి 70 ఇస్తే, కేరళకు 100కి 21 మాత్రమే ఇచ్చారు. దీనిని వివక్ష తప్ప ఏమి చెప్పాలి. పన్ను వాటాను 3.87 శాతం నుంచి 1.9 శాతానికి తగ్గించడం వల్ల రూ.18 వేల కోట్ల నష్టం వాటిల్లింది" అని ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు.

పథకం ప్రకారమే రాష్ట్రాలపై దాడి: సీతారాం ఏచూరి

సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ, రాష్ట్రాలను నిర్వీర్యం చేసేందుకు మోడీ ప్రభుత్వం ఒక పథకం ప్రకారమే దాడి చేస్తోందని విమర్శించారు. లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్రాన్ని ఫాసిస్టు స్వభావంతో కూడిన హిందూ దేశంగా మార్చడమే బిజెపి లక్ష్యమన్నారు. "దేశ సమాఖ్య వ్యవస్థకు ఇది విరుద్ధం కాబట్టి ఫెడరలిజాన్ని నాశనం చేయడానికి బిజెపి పూనుకుందని" అన్నారు. రాజ్యాంగం ప్రకారం, "భారతదేశం రాష్ట్రాల యూనియన్. కానీ బిజెపి మోడీల దృష్టిలో రాష్ట్రాలు లేవు. యూనియన్ మాత్రమే ఉంది. 'రాష్ట్రాలు చిప్ప ఎత్తుకుని కేంద్రాన్ని దేబిరించాలని వారు కోరుకుంటున్నారు. అలా ఎన్నటికీ జరగనివ్వం' అని ఏచూరి అన్నారు. ప్రతిపక్షాల నిరసనలు ఉత్తర, దక్షిణ విభజనను సృష్టిస్తున్నాయని ఆరోపించిన మోడీ, దేశ భౌగోళిక స్థితిని అర్థం చేసుకోవాలని హితవు పలికారు. పంజాబ్, ఢిల్లీ దక్షిణాది నుంచి కేంద్ర స్థానాన్ని నిరసిస్తున్నాయా? అని ప్రశ్నించారు. కేరళ సాగిస్తున్న ఈ న్యాయమైన పోరాటానికి అన్ని విధాలా అండగా ఉంటాం" అని సీతారాం ఏచూరి స్పష్టం చేశారు.

ప్రధాని మోడీకి స్పష్టమైన వార్నింగ్: డి.రాజా

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ, కేరళ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ఈ ఆందోళనతో ప్రధాని నరేంద్ర మోడీకి ముఖ్యమంత్రి పినరయి విజయన్ స్పష్టమైన హెచ్చరిక చేశారని అన్నారు. "బిజెపిని అధికారం నుంచి దింపాలంటే ప్రతిపక్ష పార్టీల ఐక్యత అవసరం. ఈ ఆందోళన ప్రతిపక్ష పార్టీల ఐక్యత, సామరస్యాన్ని బలోపేతం చేస్తుంది. దేశాన్ని రక్షించాలంటే బీజేపీని తరిమి కొట్టాలి" అని రాజా అన్నారు.

హక్కుల కోసం పోరాడాల్సిన పరిస్థితి: భగవంత్ మాన్

పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ మాట్లాడుతూ "ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు ఢిల్లీకి వచ్చి తమ హక్కుల కోసం పోరాడాల్సిన పరిస్థితి దేశంలో నెలకొంది. దేశానికి అవసరమైన ఆహారధాన్యాలను ఎక్కువగా ఉత్పత్తి చేస్తున్న పంజాబ్ పట్ల కూడా కేంద్రం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. పంజాబ్‌కు చెల్లించాల్సిన రూరల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఆర్డీఎఫ్), మండి డెవలప్‌మెంట్ ఫండ్ (ఎండిఎఫ్) నిలిపివేయబడ్డాయి. దీన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాం. ఈ విధంగా, రాష్ట్రం దావా వేసిన ప్రతి అంశానికి ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్‌ను సంప్రదించాలి. పంజాబ్‌లో గవర్నర్ అసలైన ప్రతిపక్షం. గవర్నర్‌ను మోడీ ప్రభుత్వం ఎంపిక చేసింది. కానీ మమ్మల్ని ప్రజలు ఎన్నుకున్నారు. అది మర్చిపోకూడదు" అన్నారు.

ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలపై కేంద్రం యుద్ధం

- అరవింద్ కేజ్రీవాల్

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడుతూ 'కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయం కారణంగా కేరళ ముఖ్యమంత్రి, మంత్రులు నిరసనకు దిగాల్సి వచ్చింది. జంతర్ మంతర్ అంటే సాధారణంగా అధికారులపై నిరసనలు వ్యక్తం చేసే ప్రదేశం. ఇక్కడ ఓ రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు నిరసనకు దిగాల్సి వచ్చింది. ఈ పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం కల్పించింది. దేశం ఇదంతా గమనిస్తున్నది. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం యుద్ధం ప్రకటించింది. ఆ రాష్ట్రాలకు రావాల్సిన నిధులు నిరాకరించారు. మంత్రులను, నాయకులను దర్యాప్తు ఏజెన్సీలు వేటాడుతున్నాయి. కేరళ, పంజాబ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఢిల్లీ ప్రజలు భారతీయ పౌరులు కాదా? ప్రతి రాష్ట్రానికి రావాల్సిన వాటా, సాయం అందించడం కేంద్ర ప్రభుత్వ విధి. మనలో ఎవరూ అడుక్కోవడం లేదు. హక్కు వాటా ఇమ్మంటున్నాం. విజయన్ ఇక్కడ నిరసనలు చేస్తున్నది తన భార్య, పిల్లల కోసం కాదు. ఆయన పోరాటం ప్రజల కోసమే.

ఏ హక్కయితే మాకుందో అది ఇవ్వండి. అన్ని విషయాల్లోనూ సుప్రీంకోర్టును ఆశ్రయించలేం. నిధులు లేకుండా కేరళ ఎలా ముందుకు సాగుతుంది? ఇతర రాష్ట్రాలు ఎలా ముందుకు వెళ్తాయి? గతంలో ఎవరైనా నేరారోపణలు వచ్చినప్పుడు దాన్ని కూలంకషంగా విచారించి దోషిగా తేలి జైలుకెళ్లేవారు. కానీ, ఇప్పుడు ఆ వ్యక్తిని ముందుగా అరెస్ట్ చేసి జైల్లో పెడతారు. ఆ తర్వాత కేసు పెడతారు. ప్రభుత్వాలను కూలదోస్తారు. తాజాగా, వారు జార్ఖండ్ ముఖ్యమంత్రిని అరెస్టు చేశారు. రేపు నన్ను, ఇతరులను అరెస్టు చేయవచ్చు. కాలచక్రం తిరుగుతుంది. అధికార పక్షం ప్రతిపక్షం, ప్రతిపక్షం అధికార పక్షం అవుతుంది. తమ హోదా గురించి గర్వపడే వారు ఈ విషయాన్ని గుర్తుంచుకుంటే మంచిది" అని అన్నారు.

డీఎంకే నేత, తమిళనాడు మంత్రి పళనివేల్ త్యాగరాజ్ మాట్లాడుతూ, గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సమాఖ్య సూత్రాలను సమర్థించిన నరేంద్రమోడీ, ప్రధాని అయ్యాక సమాఖ్య సూత్రాల పునాదులను తారుమారు చేసే పనిలో నిమగ్నమై ఉన్నారని విమర్శించారు.

రాష్ట్రాలను మున్సిపాలిటీలుగా చూస్తున్న మోడీ

- కేంద్రంపై నిప్పులు చెరిగిన స్టాలిన్
- కేరళ నిరసనోద్యమానికి సంఘీభావం

కేరళ నిరసనోద్యమాన్ని ఉద్దేశించి వీడియో ద్వారా సందేశమిస్తున్న స్టాలిన్

చెన్నై : దేశంలో రాష్ట్రాలు వుండడం లేదా ఆ రాష్ట్రాలకు ముఖ్యమంత్రులు వుండడం ప్రధాని నరేంద్ర మోడీకి నచ్చడం లేదని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ గురువారం వ్యాఖ్యానించారు. న్యూఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్నానుద్దేశించి స్టాలిన్ ఆన్‌లైన్‌లో ప్రసంగించారు. స్పెయిన్ పర్యటనకు వెళ్లి ఇప్పుడు వచ్చినందున కేరళ నిరసనోద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొనలేకపోతున్నానని, డిఎంకె ఎంపీలు స్వయంగా వెళ్లి పాల్గొన్నారని స్టాలిన్ తెలిపారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సంపూర్ణ మద్దతు ఉంటుందని, ముఖ్యమంత్రి పనరయి, ఆయన మంత్రివర్గం చేపట్టిన పోరటానికి మద్దతుగా ఉంటామని తెలిపారు. రాష్ట్రాలను, రాష్ట్ర ప్రజలను గౌరవించిన గత ప్రధానుల్లా కాకుండా మోడీ రాష్ట్రాలను మున్సిపాలిటీలుగా భావిస్తున్నారని ఆయన విమర్శించారు. వాస్తవానికి మోడీ ప్రధాని కాకముందు గుజరాత్ ముఖ్యమంత్రిగా వున్నారని, కానీ ఆయన ప్రధాని పదవి చేపట్టిన తర్వాత చేసిన మొదటి పని రాష్ట్రాల హక్కులను లాగేసుకోవడమేనని విమర్శించారు. విద్యా హక్కులను, భాషా హక్కులను, చట్టపరమైన హక్కులను ఇలా అన్నింటినీ లాక్కుంటున్నారని అన్నారు.

ఆర్థిక వ్యవహారాల్లో కూడా రాష్ట్రాల హక్కులను లాక్కుంటున్నారని, ఇదెలా వుందంటే ఒక మనిషికి ఆక్సిజన్‌ను నిలిపివేయడంలా వుందని,. ప్రస్తుతం కేంద్రంలో బిజెపి చేస్తోందదేనని స్టాలిన్ విమర్శించారు. జిఎస్‌టి వ్యవస్థను విధించినప్పటి నుండి అన్ని రాష్ట్రాలు కూడా తీవ్ర ఆర్థిక సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయన్నారు. ఆ సంక్షోభాలను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, కానీ అలా జరగడం లేదన్నారు. అభివృద్ధి పథకాలను అమలు చేసేందుకు రుణాలు తీసుకోకుండా రాష్ట్రాలకు అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు. తమ రోజువారీ అవసరాలను రాష్ట్ర ప్రభుత్వాలు తీరుస్తాయని ప్రజలు భావిస్తారని, కానీ అలా జరగకుండా కేంద్రం అడ్డుపడుతోందన్నారు. ఈ పరిస్థితిని వ్యతిరేకిస్తూ రాష్ట్రాలన్నీ ఒక్క తాటిపైకి రావాలని ఆయన కోరారు. ఈ ఫాసిస్ట్ బిజెపిని నిలువరించి, అన్ని రాష్ట్రాలను సమానంగా గౌరవించే భారతదేశాన్ని మనం సృష్టించాలన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులనూ ఆయన హెచ్చరించారు. ఈ రోజు ప్రతిపక్షాల పాలనలో వున్న రాష్ట్రాల పరిస్థితులే రేపు మీకు కూడా ఎదురు కావచ్చని ఆయన హెచ్చరించారు.

ఢిల్లీ - యుపి సరిహద్దులో రైతులను భారీ బారికేడ్లతో అడ్డుకున్న పోలీసులు

అన్నదాతలపై దాష్టీకం

న్యూఢిల్లీ : డిమాండ్ల సాధన కోసం పార్లమెంట్ వైపు ప్రదర్శనగా వెళుతున్న వేలాది మంది అన్నదాతలను ఢిల్లీ-ఉత్తరప్రదేశ్ సరిహద్దులో పోలీసులు గురువారం అడ్డుకున్నారు. రాజధానిలోకి ప్రవేశించకుండా వారిని నిలువరించారు. ఆర్‌ఎఎఫ్, పోలీస్ సిబ్బంది నీటి ఫిరంగులు, బుల్డోజర్లు, క్రేన్లతో సరిహద్దు వద్ద మోహరించి యుద్ధ వాతావరణాన్ని తలపింపజేశారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించి రాజధానిలో ప్రవేశించే వారిని తక్షణమే అరెస్ట్ చేసి తరలించేందుకు వీలుగా బస్సులను సిద్ధంగా ఉంచారు. పార్లమెంటును ఘెరావ్ చేయాలని నోయిడా, గ్రేటర్ నోయిడాకు చెందిన 160 గ్రామాల ప్రజలు పిలుపునిచ్చారు. ఎన్టీపీసీ, దాద్రీ నుండి తమను తరిమివేయడాన్ని వారంతా వ్యతిరేకించారు. ఎన్టీపీసీ కోసం గతంలో భూములు ఇచ్చిన రైతులందరికీ సమానంగా నష్టపరిహారం చెల్లించాలని, బాధిత కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని, తమ కోసం ఆస్పత్రిని నిర్మించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. గ్రేటర్ నోయిడాలో ఎనిమిది రోజుల పాటు ధర్నా చేశామని, ఎన్టీపీసీ, నోయిడా అథారిటీ ప్రాంతాలలో రెండు నెలలుగా ఆందోళన చేస్తున్నామని వారు తెలిపారు. నోయిడా-గ్రేటర్ నోయిడా ఎక్స్‌ప్రెస్‌వేను రైతులు దిగ్బంధించినట్లు వార్తలు అందాయి. నోయిడా సెక్టార్-24లో ఉన్న ఎన్టీపీసీ కార్యాలయం వద్ద గత సంవత్సరం డిసెంబర్ 18న రైతులు సమ్మె చేశారు. అంతకుముందు వారిని ఎన్టీపీసీ ప్రధాన ద్వారానికి కొద్ది దూరంలోనే పోలీసులు నిలిపివేయడంతో రోజంతా నిరసనకు దిగారు. ఎన్టీపీసీ దాద్రీ ప్లాంట్ కారణంగా తాము నష్టపోయామని 24 గ్రామాల ప్రజలు ఆరోపించారు. భారతీయ కిసాన్ పరిషత్ నేత సుఖ్‌బీర్ ఖలీఫా నేతృత్వంలో రైతులు ఆందోళన కొనసాగిస్తున్నారు. 'ఎన్టీపీసీ దాద్రీ వద్ద రైతులు అనేక నెలలుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీర్ఘకాలిక ఉద్యోమాన్ని ప్రారంభించారు. అనేక దఫాలుగా అధికారులతో చర్చలు జరిగాయి. రైతుల డిమాండ్లు సమంజసమైనవేనని వారు అంటున్నప్పటికీ వాటిని నేటి వరకూ నెరవేర్చలేదు. అందుకే ఈసారి నిర్ణయాత్మక పోరుకు సిద్ధమయ్యాం' అని ఆయన చెప్పారు. కాగా బాధితులకు సమాన నష్టపరిహారం, కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించడం సాధ్యంకాదని ఎన్టీపీసీ అంటోంది.

మోడీ పుట్టుకతో ఒబిసి కాదు : రాహుల్

ఝుర్సుగూడా (ఒడిషా) : ప్రధాని నరేంద్ర మోడీ పుట్టుకతో ఒబిసి కారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలిపారు. 'ఆయన తెలీ కులంలో జన్మించారు. 2000వ సంవత్సరంలో గుజరాత్‌లో బిజెపి అధికారంలో ఉన్నప్పుడు ఆ కులాన్ని ఒబిసి జాబితాలో చేర్చింది. అందువల్ల మోడీ పుట్టుకతో ఒబిసి కారు' అని చెప్పారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా ఒడిషాలో పర్యటిస్తున్న రాహుల్ గురువారం ఝుర్సుగూడా జిల్లాను సందర్శించారు. ఈ సందర్భంగా బేల్‌పహార్‌లోని మహిమా చౌక్ వద్ద జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ ఎస్సీ, ఎస్టీ, ఒబిసి జాబితాలో లేని సాధారణ కులంలో మోడీ జన్మించారని, అయితే గుజరాత్‌లో ఆయన పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ కులానికి ఒబిసి హోదా ఇచ్చిందని అన్నారు.

ఢిల్లీలో శ్రీను కుటుంబ సభ్యుల ధర్నా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విశాఖ ఎయిర్‌పోర్టులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడికి సంబంధించిన కేసులో జైలులో ఉన్న శ్రీను కుటుంబ సభ్యులు ఢిల్లీలో ధర్నాకు దిగారు. గురువారం నాడిక్కడ ఎపి భవన్‌లో అంబేద్కర్ విగ్రహం ముందు శ్రీను తల్లి, అన్న సుబ్బరాజు, టిడిపి మైనార్టీ హక్కుల నాయకులు ధర్నా చేపట్టారు. జగన్ కోర్టుకు రావాలని, సాక్ష్యం చెప్పాలని నినాదాలు చేశారు. ఎపిలో దళితులు, మైనార్టీలపై జరుగుతున్న దాడులు ఆపాలని నినాదాలు చేశారు. జగన్‌పై దాడి కేసులో నిందితులు ఎవరనేది జగన్ చెప్పాలని శ్రీను కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.

జమిలి ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధం : సిపిఐ

న్యూఢిల్లీ : 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' ప్రతిపాదనను సిపిఐ తీవ్రంగా వ్యతిరేకించింది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీకి సిపిఐ ప్రధానకార్యదర్శి డి రాజా బృందం ఈ మేరకు ఒక వినతిపత్రం అందజేసింది. సమాఖ్య వ్యవస్థకు వ్యతిరేకమైన, రాజ్యాంగ విరుద్ధమైన ఈ ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని కోరారు. 'బహుళ పార్టీ ప్రజాస్వామ్యం, అపారమైన వైవిధ్యం ఉన్న మనదేశంలో 'జమిలి' ఎన్నికలు అసాధ్యం. రాజ్యాంగానికి విరుద్ధం' అని రాజా పేర్కొన్నారు. ఈ ప్రతిపాదన అప్రజాస్వామికమని, సమాఖ్య నిర్మాణానికి పూర్తి వ్యతిరేకమని ఆయన విమర్శించారు.

పాక్ పోలింగ్ హింసాత్మకం

- ఇద్దరు చిన్నారులతో సహా 12మంది మృతి
- ప్రారంభమైన ఓట్ల లెక్కింపు

ఇస్లామాబాద్ : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పాకిస్తాన్‌లో గురువారం జరిగిన పోలింగ్ హింసాత్మకంగా మారింది. సాయుధ గ్రూపులు హింసకు పాల్పడ్డాయి. దేశంలోని వేర్వేరు చోట్ల జరిగిన ఘర్షణల్లో ఇద్దరు చిన్నారులు, ఆరుగురు భద్రతా సిబ్బందితో సహా 12 మంది మరణించారు. హింసాత్మక ఘటనల నేపథ్యంలో కౌటింగ్‌పై నీలినీడలు అలుముకున్నాయి. తాజా పరిణామాల దరిమిలా ఎన్నికల సంఘం మొబైల్ ఫోన్ సర్వీసులను సైతం నిషేదించింది. ఓటింగ్ ప్రక్రియ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు ప్రారంభమైందని పాక్ ఎన్నికల కమిషన్ (ఇసిపి) వెల్లడించింది. రాత్రంతా ఓట్ల లెక్కింపు సాగనుంది. శుక్రవారం తెల్లవారు జామున స్పష్టత వచ్చేవీలుంది. మొబైల్ సర్వీసులపై నిషేధం విధించడం ఒక రకమైన రిగ్గింగేనని మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సలహాదారు వ్యాఖ్యానించారు. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 8గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. కాగా పోలింగ్ సమయాన్ని పొడిగించాల్సిందిగా దాదాపు అన్ని ప్రధాన పార్టీలు కోరాయి. కానీ ఎన్నికల కమిషన్ తిరస్కరించింది. కాగా దేశవ్యాప్తంగా మిశ్రమ ఫలితాలు వస్తాయని ప్రస్తుతమున్న ధోరణులను బట్టి తెలుస్తోంది. కాగా మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ మాత్రం మెజారిటీ లభిస్తుందన్న విశ్వాసంతో వున్నారు. పార్లమెంట్ దిగువ సభ అయిన నేషనల్ అసెంబ్లీకి, ఖైబర్ ఫంఖ్తుఖ్వా, పంజాబ్, బలూచిస్తాన్, సింధ్ ప్రావిన్షియల్ అసెంబ్లీలకు ప్రస్తుతం ఎన్నికలు జరిగాయి. అభ్యర్థి మృతి కారణంగా ఒక స్థానానికి ఎన్నిక వాయిదా పడడంతో నేషనల్ అసెంబ్లీలో 265 స్థానాలకు పోలింగ్ జరిగింది. 5 వేల మంది పైగా అభ్యర్థులు బరిలో వున్నారు. ఓటింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత ఒక గంట వ్యవధిలో ఏ పోలింగ్ స్టేషన్ అనధికార ఫలితాలను కూడా ప్రకటించకుండా మీడియాతో సహా అన్ని సంస్థలపై ఇసిపి నిషేధం విధించింది. దేశ జనాభాలో సగానికి పైగా అంటే 12.8 కోట్ల మంది ప్రజలు ఓటు వేసేందుకు అర్హులని ఇసిపి ప్రకటించింది. కాగా నాలుగు ప్రావిన్షియల్ అసెంబ్లీల్లోని 590 సీట్లకు 12 వేల మందికి పైగా అభ్యర్థులు పోటీ పడుతున్నారు. నేషనల్ అసెంబ్లీలో మొత్తంగా 336 మంది సభ్యులుంటారు. వీరిలో 266 మందినే ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. 60 సీట్లు మహిళలకు, 10 సీట్లు మతపరమైన మైనారిటీలకు రిజర్వ్ చేశారు.

కరాచీలోని ఒక పోలింగ్ కేంద్రంలో ఓటు వేస్తున్న పాక్ అధ్యక్షులు ఆరిఫ్ అల్వి

వేడెక్కుతున్న భూగోళంలో మార్పులపై స్కానింగ్

- వాతావరణ ఉపగ్రహాన్ని ప్రయోగించిన నాసా

కేప్ కేన్వరాల్ : ప్రపంచంలోని మహా సముద్రాలు, వాతావరణంపై అధ్యయనం చేసేందుకు నాసా కొత్త వాతావరణ ఉపగ్రహాన్ని గురువారం ప్రయోగించింది. గతంలో ఎన్నడూ లేని రీతిలో సవివరమైన డేటా కోసం ఈ ప్రయోగాన్ని చేపట్టింది. 948 మిలియన్ల డాలర్ల వ్యయంతో రూపొందించిన పేస్ ఉపగ్రహాన్ని ఫాల్కన్ రాకెట్ గురువారం తెల్లవారు జామున కక్ష్యలోకి తీసుకెళ్ళింది. అత్యంత అరుదైన ధృవ కక్ష్యను చేరేందుకు అట్లాంటిక్ మీదుగా దక్షిణ దిశగా వెళ్ళేలా ఈ రాకెట్‌ను నింగిలోకి పంపించారు. 676 కిలోమీటర్ల ఎత్తులో వుండి మూడేళ్ళపాటు మహా సముద్రాలపై, అలాగే వాతావరణంపై ఈ ఉపగ్రహం అధ్యయనం జరుపుతుంది. తన వద్ద గల రెండు సైన్స్ సాధనాలతో మొత్తంగా గ్లోబ్‌ను రోజుకు రెండుసార్లు స్కాన్ చేస్తుంది. ఉపగ్రహంలో గల మూడో సాధనం నెలవారీ గణాంకాలు ఇస్తుంది. మన భూగోళం గురించి గతంలో ఎన్నడూలేని రీతిలో సమాచారం అందనుందని ప్రాజెక్ట్ శాస్త్రవేత్త జెరిమీ వెర్డెల్ తెలిపారు. హరికేన్‌లు, తీవ్రమైన వాతావరణ హెచ్చరికలు వంటి వాటి సమాచారాన్ని మరింత మెరుగుపరుచుకునేందుకు ఈ పరిశీలనలు తోడ్పడతాయని భావిస్తున్నారు. అలాగే భూగోళం వేడెక్కుతున్న నేపథ్యంలో సంభవించే మార్పులను పరిశీలించడానికి కూడా దోహదపడతాయని భావిస్తున్నారు. ప్రమాదకరమైన రీతిలో జల వనరుల్లో నాచు పెరిగిపోవడాన్ని మెరుగైన రీతిలో ఊహించడానికి కూడా ఈ సర్వే ఉపయోగపడుతుంది. ఇప్పటికే కక్ష్యలో నాసాకు 25కి పైగా వాతావరణ ఉపగ్రహాలు వున్నాయి.

ఆశాలపై ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

సుమారు గంటపాటు రెండువైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది. అనంతరం పోలీసులు సిఐటియు రాష్ట్ర నాయకులు కె.సుబ్బరావమ్మ, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పోచమ్మ తదితరులను అరెస్టు చేసి వేర్వేరు పోలీసుస్టేషన్లకు తరలించారు. అదే సమయంలో మంగళగిరిలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం సమీపంలో జాతీయ రహదారిపై ఐద్వా నాయకులు రమాదేవి, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు నేతాజీ, వెంకటేశ్వరరావు, కమల ఆధ్వర్యాన ఆశాలు బైఠాయించారు. అక్కడ కూడా పోలీసులు తీవ్ర నిర్బంధం ప్రయోగించారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరితే చర్చలకు పిలిచి అరెస్టు చేయడం ఏం ప్రజాస్వామ్యమని నాయకులు ప్రశ్నించారు. దీంతో పోలీసులు వారిని బలవంతంగా అరెస్టు చేశారు. ఈ సమయంలో పెనుగులాట జరిగింది. నాయకులతోపాటు పలువురు మహిళలు రోడ్డుపై పడిపోయారు. అరెస్టు చేసిన వారిని గుంటూరు, మంగళగిరి, తుళ్లూరు పరిసర ప్రాంతాల్లో స్టేషన్లకు, కళ్యాణ మండపాలకు తరలించారు. వడ్డేశ్వరం వద్ద అరెస్టయిన వారిలో సిఐటియు నాయకులు సుబ్బరావమ్మ, ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పోశమ్మతో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులు డి.జ్యోతి, సిహెచ్.లక్ష్మి, సౌభాగ్య తదితరులు ఉన్నారు. మంంగళగిరి ఎన్ఆర్ఐ ఆస్పత్రి వద్ద అరెస్టయిన వారిలో సిఐటియు నాయకులు సాయిబాబు, జె.వి.రాఘవులు, డి.వెంకటరెడ్డి, ఎం.రవి, భాగ్యరాజు, బి.లక్ష్మణరావు, బాలాజీ, గుంటూరు జిల్లా నాయకులు ధనలక్ష్మి ఉన్నారు.

కార్యాలయాల్లోకి చొరబాటు

ఆశాల ఆందోళన నేపథ్యంలో పోలీసులు సిఐటియు ప్రజా సంఘాల కార్యాలయాల్లోకి చొరబడ్డారు. దుర్గాపురంలోని సిఐటియు కార్యాలయంలోకి పోలీసులు నేరుగా వెళ్లి ఆశా నాయకులను లాక్కొచ్చేందుకు ప్రయత్నించగా, సిఐటియు నాయకులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో బయటకు వెళ్లారు. అలాగే వడ్డేశ్వరంలోని సుందరయ్య స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల కార్యాలయాల్లోకి వెళ్లడంతోపాటు వాటి గేట్లకు తాళాలు కూడా వేశారు. పోలీసుల తీరును సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్‌కుమార్ తీవ్రంగా ఖండించారు.

సిపిఎం రాష్ట్ర కమిటీ ఖండన

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు చలో విజయవాడ ధర్నా కార్యక్రమానికి రాకుండా ఎక్కడికక్కడ జిల్లాల్లో నోటీసులిచ్చి అరెస్టు చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఖండించారు. వైద్య, కుటుంబ ఆరోగ్యశాఖ అధికారులు చర్చలకు రావాలని పిలిచి, నాయకులను అరెస్టు చేయడం రాష్ట్ర ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరికి అద్దం పడుతోందని పేర్కొన్నారు. వందలాది మంది ఆశా కార్యకర్తలు కాలకృత్యాలు తీర్చుకుంటున్న భవనానికి తాళాలువేసి బంధించడం దారుణమని పేర్కొన్నారు. ఆశా వర్కర్లు కనీస వేతనం, సెలవులు, మెటర్నిటీ లీవులు, రిటైర్‌మెర్ బెనిఫిట్స్, పనిభారం తగ్గించాలని తదితర కోర్కెలతో గత కొంతకాలంగా ఆందోళన చేస్తూ ప్రశాంతంగా ధర్నాకు వస్తున్న ఉద్యోగులను అరెస్టు చేసి శాంతిభద్రతల సమస్యగా చేయడం సరైందికాదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నాయకులతో చర్చించి వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు.

అంగన్‌వాడీల ఖండన

ఆశా వర్కర్లను అరెస్టు చేయడాన్ని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ ఖండించింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బేబీరాణి, కె.సుబ్బరావమ్మ ప్రకటన విడుదల చేశారు. అర్ధరాత్రి భర్త, పిల్లల ముందు ఆశా వర్కర్లను అరెస్టు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు.

రైతు, కౌలురైతు సంఘాల ఖండన

ఆశా వర్కర్ల అరెస్టులను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకరరెడ్డి, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు తీవ్రంగా ఖండించారు.

శ్వేత పత్రం అలా

(మొదటి పేజీ తరువాయి)

ఆమె ఆ పత్రంలో సెలవిచ్చారు. యుపిఏ అవినీతి, ధరలు, చెడ్డ అప్పులు, విధానపరమైన అనిశ్చితితో భారత వ్యాపార వాతావరణాన్ని దెబ్బ తీసిందని ఆర్థికమంత్రి పేర్కొన్నారు. 2014లో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేటప్పటికి ఆర్థిక వ్యవస్థ చాలా పెళుసుగా ఉందని అన్నారు.పబ్లిక్ ఫైనాన్స్, ఆర్థిక క్రమశిక్షణా రాహిత్యం యుపిఏలో పెరిగిపోయిందని ఆమె ఆరోపించారు. ఎప్పటిలానే పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నుంచి రాహుల్ గాంధీవరకు కాంగ్రెస్ నాయకులపై మోడీ ప్రభుత్వం తన అక్కసునంతా ఈ శ్వేత పత్రులో వెళ్లగక్కింది. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను దెబ్బతీయడమే లక్ష్యంగా బిజెపి ఇటీవల వరుస దాడులకు దిగుతోంది. దానికి కొనసాగింపుగానే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తీసుకొచ్చిన ఈ శ్వేత పత్రం. గత పదేళ్ళ కాలాన్ని ఒక్కసారి వెనక్కి తిరిగి చూసినట్లైతే, గత ప్రభుత్వం వదిలిపెట్టిన సవాళ్ళన్నింటినీ విజయవంతంగా అధిగమించగలిగామని సంతృప్తికరంగా చెప్పగలుగుతామంటూ ఆ పత్రంలో ప్రభుత్వం పేర్కొంది. అయితే అంతటితో అగలేదు. అమృతకాలం ఇప్పడే ప్రారంభమైందని, 2047కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా రూపొందించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇది కర్తవ్య కాలమని ఆమె తన పద గాంభీర్యాన్నంతటినీ ప్రదర్శించారు.

బ్లాక్ పేపర్ ఇలా..

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపక్షాలను ఆడిపోసుకుంటారు. ఈ పరిస్థితుల్లో ప్రజలకు వాస్తవాలను తెలియజే సేందుకు ఈ బ్లాక్ పేపర్ ప్రవేశపెట్టామని ఖర్గే అన్నారు. మోడీ పదేళ్ల పాలనలో జిడిపి వృద్ధి రేటు ఇదివరకెన్నడూ లేని విధంగా 5 శాతానికి పడిపోయింది. ద్రవ్యోల్బణం రెండంకెలకు చేరుకుంది. దేశం చెల్లింపుల సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. బ్యాంకింగ్ వ్యవస్థ ఛిన్నా భిన్నమైంది. నిపుణులు దేశం విడిచి వెళ్లిపోతున్నారు. ఆర్థిక మాంద్యం వెంటాడుతోంది' అని పేర్కొన్నారు. ' 45 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగం పెరిగిపోవడం, నోట్ల రద్దు, లోపభూయిష్ట జిఎస్‌టి వంటి ఆర్థిక విపత్తులు మోడీ సర్కార్ పుణ్యమేనని బ్లాక్ పేపర్ విమర్శించింది. ప్రభుత్వ అనాలోచిత విధానాల వల్ల మిలియన్ల మంది రైతులు, రోజువారీ కూలీ కార్మికుల భవిష్యత్తు ప్రమాదంలో పడింది. నిత్యావసర వస్తువుల ధరలు ఆల్‌టైమ్ గరిష్ట స్థాయికి చేరడం, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కి ఎంఎస్‌పికి చట్టబద్ధత కల్పించేందుకు నిరాకరించింది. ఇప్పుడు దేశంలో 'మొదానీ రాజ్' సాగుతోంది అని ఆ పత్రం ధ్వజమెత్తింది. ఆర్థిక నేరగాళ్లకు సురక్షితమైన స్వర్గధామాలను తొలగిస్తామని చెప్పిన మోడీ దానికి భిన్నంగా క్రోనీ క్యాపిటలిజాన్ని పెంచిపోషిస్తున్నారు. సామాజిక అన్యాయం కింద, గత దశాబ్దంలో 'మహిళలు, ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలు, మైనారిటీలపై క్రూరమైన వివక్ష, అణచివేత' కొనసాగుతోంది. 'ద్వేషం, మత పరమైన సమీకరణలు , దేశ సామాజిక నిర్మాణ చట్రాన్ని నాశనం చేస్తున్నాయి. 'అగ్నిపథ్' పేరుతో సైన్యాన్ని ప్రభుత్వం అణగదొక్కిందని. ఇడి, సిబిఐ దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రత్యర్థులను వేధించే సాధనాలుగా మార్చేసింది. ఎన్నికల సంఘం, సుప్రీంకోర్టు, ఆర్‌బిఐ వంటి స్వతంత్రతపైనా దాడులకు దిగుతోందని బ్లాక్ పేపర్ విమర్శించింది.

రోడ్డెక్కి బిగ్గరగా నినదిస్తున్న ఆశా వర్కర్

ఆశాలపై మగపోలీసుల దౌర్జన్యం

రాష్ట్రవ్యాప్తంగా నిర్బంధం

అక్రమ అరెస్టులను నిరసిస్తూ ఆశాల ఆందోళనలు

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు గురువారం చేపట్టిన చలో విజయవాడను పోలీసులు భగ్నం చేశారు. బుధవారం సాయంత్రం నుంచి విజయవాడలోని మహాధర్నాకు వెళ్లొద్దంటూ ఆశా వర్కర్లకు, సిఐటియు నాయకులకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. తీవ్ర నిర్బంధం ప్రయోగించారు. విజయవాడకు తరలివస్తున్న వారిని ఎక్కడికక్కడ అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. కొన్ని చోట్ల నేతలను గృహనిర్బంధం చేశారు. పోలీసుల తీరును నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, ఆందోళనలు చేశారు.

కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలంలో 57 మందిని అరెస్టు చేశారు. తూర్పుగోదావరి జిల్లాల్లో పలువురిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాకినాడలో సొంత వాహనాలలో వస్తున్న వారిని సైతం నిర్బంధించారు. పోలీసుల తీరును నిరసిస్తూ కాకినాడ సుందరయ్య భవన్ నుంచి కలెక్టరేట్ వరకు ఆశాలు నిరసన ప్రదర్శన చేపట్టారు. నంద్యాల నుంచి విజయవాడకు బస్సులో వస్తున్న 15 మందిని ప్రకాశం జిల్లా త్రిపురాంతకం టోల్‌గేట్ వద్ద పోలీసులు నిలిపేసి.. వారిని స్టేషన్‌కు తరలించారు. ఆశాల అక్రమ అరెస్టులకు నిరసనగా ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో పలుచోట్ల ఆశా వర్కర్లు, సిఐటియు నేతలు నిరసనలు చేపట్టారు. తిరుపతి, నెల్లూరు జిల్లాల నుంచి విజయవాడకు ఆర్‌టిసి బస్సులో వెళ్తున్న 25 మంది ఆశ వర్కర్లను ముసునూరు టోల్ ప్లాజా వద్ద అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఏలూరు జిల్లా సిఐటియు అధ్యక్షులు ఆర్.లింగరాజును భీమడోలు పోలీస్‌స్టేషన్‌లో, జిల్లా కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్‌ను సిఐటియు కార్యాలయంలో నిర్బంధించారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేయలంటూ ఏలూరులోని సిఐటియు కార్యాలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకూ ఆశావర్కర్లు ప్రదర్శన నిర్వహించారు. భీమడోలులో 50 మంది ఆశా కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

చాట్రాయి, చింతలపూడి మండలాల నుంచి 40 మందిని, కొయ్యలగూడెం, నిడమర్రు, నూజీవీడు రూరల్, కలిదిండిలో ఆశాలను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురం, పోడూరు పాలకోడేరు, తణుకు, ఆచంట, కాళ్ల, ఆకివీడు, వంటి ప్రధాన ప్రాంతాల్లో సుమారు 200 మందిని అక్రమంగా అరెస్టు చేశారు. ఆకివీడులో 63 మందికి నోటీసులిచ్చారు. నరసాపురంలో 30 మంది, పాలకొలులో 53, ఆచంటలో 40 మందిని అరెస్టు చేసి పాలకొల్లు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆశాల అక్రమ అరెస్టులను నిరసిస్తూ అన్నమయ్య జిల్లా సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపి వినతి పత్రం అందించారు. విశాఖ జగదాంబ జంక్షన్‌లో, అనకాపల్లిలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ కూడలిలో ఆశాలు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. విశాఖలో ముందుగా సిఐటియు కార్యాలయం నుంచి జగదాంబ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు.

నిరంకుశ పాలనకు నిదర్శనం

ఆశా వర్కర్లపై లాఠీచార్జ్‌పై అచ్చెన్నాయుడు

డిమాండ్ల పరిష్కారం కోసం చలో విజయవాడ చేపట్టిన ఆశా వర్కర్లపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం జగన్ నియంతృత్వ పాలనకు పరాకాష్ట అని, ఈ చర్యను ఖండిస్తున్నట్లు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు తెలిపారు. ఐదేళ్లుగా ఆశాలతో వెట్టిచాకిరీ చేయిస్తున్న జగన్ వారి సమస్యలను పరిష్కరించకపోవడం దుర్మార్గం కాదా అని గురువారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. బాధితుల పక్షాన నిలబడాల్సిన పోలీసులు అధికార వైసిపికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆశాలకు రూ.10 వేలు వేతనం ఇస్తానని ముఖ్యమంత్రిగా మొదటి సంతకం చేసిన జగన్ హామీని ఎందుకు నిలబెట్టుకోలేదని ప్రశ్నించారు. వారి డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పోలీసులు తాళాలు వెయ్యడంతో వర్థీశ్వరంలోని సుందరయ్య స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ గేటుదూకి బయటకు వస్తున్న ఆశాలు

ఐద్వా నేత రమాదేవిని బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు

అంగన్‌వాడీ నేత సుబ్బరావమ్మను అరెస్టు చేస్తున్న పోలీసులు

జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న ఆశాలు

గుంటూరు జిల్లా మంగళగిరి పోలీస్ స్టేషన్‌లో ఆశాలను పరామర్శిస్తున్న వి శ్రీనివాసరావు, సిహెచ్ బాబూరావు తదితరులు

ఆశా వర్కర్ ను ఈడ్చుకు వెళుతున్న పోలీసులు

జగన్, చంద్రబాబు, పవన్ ఉద్యమిస్తే

వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఎందుకు ఆగదు?

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ధర్నాలో నేతలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రతిపక్ష నేత ఎన్ చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కలిసి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఉద్యమిస్తే వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఎందుకు ఆగదో చూద్దామని నేతలు అన్నారు. 'విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి. వంద శాతం పెట్టుబడుల ఉపసంహరణ, ప్రైవేటీకరణ ఆపాలి. ఇనుప ఖనిజం కేటాయించాలి. సెయిల్‌లో వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను విలీనం చేయాలి' అని డిమాండ్ చేస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో గురువారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మూడేళ్లగా ఆందోళన చేస్తున్న కార్మిక వర్గానికి వందనాలు తెలిపారు. ఈ పోరాటం వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు మాత్రమే పరిమితం కాలేదని, దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో భాగమని అన్నారు. ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, ఐద్వా కోశాధికారి ఎస్ పుణ్యవతి మాట్లాడారు. కార్యక్రమంలో సిబిఐ మాజీ డైరెక్టరు జెడి లక్ష్మీనారాయణ, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్, ఐద్వా అధ్యక్షులు మరియం ధావలే, సినీ డైరెక్టరు పి సత్యరెడ్డి, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు డి ఆదినారాయణ, ఎం రాజశేఖర్, జె అయోధ్యరాము తదితరులు పాల్గొన్నారు.

పినరయి విజయన్‌ను కలిసిన విశాఖ స్టీల్‌ప్లాంట్ పోరాట కమిటీ నేతలు

విశాఖ ఉక్కు పోరాటానికి పినరయి విజయన్ మద్దతు

వైజాగ్ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మద్దతు తెలిపారు. ఈ మేరకు పినరయి విజయన్‌ను విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు కలిశారు. వైజాగ్ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం సిద్ధపడిందని, దానికి వ్యతిరేకంగా మూడేళ్లుగా ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు పోరాడుతున్నారని తెలుపుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. విశాఖ ఉక్కు పోరాటానికి తన మద్దతు ఉంటుందని పినరయి విజయన్ తెలిపారు.

కోహ్లి కష్టమే..!

- మూడు, నాలుగు టెస్ట్‌లకు అందుబాటులో ఉండనని ప్రకటన
- నేడు జట్టును ప్రకటించనున్న బిసిసిఐ?

ముంబయి: ఇంగ్లండ్‌తో తొలి రెండు టెస్ట్‌లకు వ్యక్తిగత కారణాలతో దూరమైన టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి మూడు, నాలుగు టెస్ట్‌లకూ అందుబాటులో ఉండనని స్పష్టం చేశాడు. ట్విటర్‌లో బిసిసిఐకి ఈ విషయాన్ని తెలియజేశాడు. ఇంగ్లండ్‌తో మిగిలిన మూడు టెస్ట్‌లకు జట్టును ప్రకటించేందుకు సిద్ధమవుతున్న బిసిసిఐకి ఇది మరింత ఇబ్బందుల్లోకి నెట్టింది. గురువారం రాత్రి ఇంగ్లండ్‌తో మిగిలిన మూడు టెస్ట్‌లకు జట్టును ప్రకటించేందుకు తొలుత బిసిసిఐ సిద్ధమైనా.. చివర్లో ఆ నిర్ణయాన్ని శుక్రవారానికి వాయిదా వేసింది. అలాగే కెప్టెన్ రోహిత్ శర్మ, శ్రేయస్ అయ్యర్ ఫామ్ లేమి బిసిసిఐని కలవర పాటుకు గురి చేస్తోంది. ఇక గాయాల బారిన పడి బెంగళూరులోని ఎన్‌సిఎ అకాడమీలో కోలుకుంటున్న ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా కెఎల్ రాహుల్ ఫిట్‌నెస్ నిరూపించుకోవాల్సి ఉంది. ఇక శ్రేయస్ అయ్యర్ ఫామ్ లేమితో ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో యువ బ్యాటర్లు సర్ఫరాజ్ ఖాన్, రజిత్ పటీదార్‌లలో ఒకరి చోటు దక్కడం ఖాయం. రాజ్‌కోట్ వేదికగా మూడో టెస్ట్ ఫిబ్రవరి 15నుంచి జరగనుంది. ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో ఇరుజట్లు ఒక్కో టెస్ట్‌లో నెగ్గి 1-1తో సమంగా ఉన్న సంగతి తెలిసిందే.

ఎన్‌సిఏకు జడేజా, కెఎల్ రాహుల్..

గాయాల బారిన పడి మిడిలార్డర్ బ్యాటర్ కెఎల్ రాహుల్, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా బెంగళూరులోని ఎన్‌సిఎ అకాడమీలో ఇప్పటికే చికిత్స పొందుతున్నారు. వీరిద్దరూ విశాఖ టెస్ట్‌కూ దూరమైనా.. మిగిలిన టెస్ట్‌లకు అందుబాటులోకి రావడం కూడా కష్టమే. జస్ప్రీత్ బుమ్రాపై ఒత్తిడి తగ్గించాలనే ఉద్దేశ్యంతో బిసిసిఐ అతడిని మిగిలిన మూడు టెస్ట్‌లకు విశ్రాంతి ఇవ్వాలని నిర్ణయించింది.

సర్ఫరాజ్‌కు స్థానం దక్కేనా..?

మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ బ్యాటింగ్‌లో నిరాశపర్చడంతో టీమిండియాను కలవరపాటుకు గురిచేస్తోంది. దీంతో అతడి స్థానంలో సర్ఫరాజ్ ఖాన్‌కు చోటు దక్కడం ఖాయంగా కనబడుతోంది. శ్రేయస్ ఇప్పటివరకు నాలుగు టెస్టుల్లో కనీసం ఒక్క అర్ధ సెంచరీ కూడా చేయలేదు. దాంతో, ఇంగ్లండ్‌తో చివరి మూడు టెస్టుల్లో అతడిపై వేటు పడే ఛాన్స్ ఉన్నట్లు సమాచారం. దక్షిణాఫ్రికా పర్యటన వైఫల్యాన్ని ఇంగ్లండ్ సిరీస్‌లోనూ కొనసాగిస్తూ నిరాశపరుస్తు న్నాడు. అయ్యర్ ఇప్పటివరకూ ఎనిమిది ఇన్నింగ్స్‌ల్లో వరుసగా.. 31, 6, 0, 4 నాటౌట్, 35, 12, 27, 29 పరుగులు మాత్రమే చేశాడు. దాంతో, అతడిపై వేటు వేయాలనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంగ్లండ్‌తో తొలి రెండు టెస్టులు ముగియడంతో.. మిగతా మూడు టెస్టులకు బిసిసిఐ స్క్వాడ్‌ను ప్రకటించనుంది. దాంతో, ఆ లిస్ట్‌లో అయ్యర్ స్థానంలో ఎవరిని ఎంపిక చేస్తారో చూడాలి. ఇక రజత్ పటీదార్‌కు ఛాన్స్ దక్కినా ఆశ్చర్యపోనక్కర్లేదు. గాయం కారణంగా వైజాగ్ టెస్టుకు దూరమైన కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజాలు ఫిట్‌నెస్ సాధిస్తే భారత్‌కు బ్యాటింగ్ కష్టాలు తప్పినట్టే.

ఇంగ్లండ్‌తో మిగిలిన మూడు టెస్ట్‌ల షెడ్యూల్...

ఫిబ్రవరి 15-19: మూడోటెస్ట్(రాజ్‌కోట్)
ఫిబ్రవరి 23-27: నాల్గోటెస్ట్(రాంచీ)
మార్చి 7-11 : ఐదోటెస్ట్(ధర్మశాల)

11నుంచి టిడిపి 'శంఖారావం'

- రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి పధాన కార్యదర్శి నారా లోకేష్ ఈ నెల 11వ తేదీ నుంచి 'శంఖారావం' పేరుతో మరో యాత్ర నిర్వహించనున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు తెలిపారు. రానున్న ఎన్నికలకు పార్టీ కేడర్‌ను కార్యోన్ముఖులను చేసే లక్ష్యంతో యాత్ర సాగనుందని తెలిపారు. వైఎస్ జగన్ కుట్రలు, కుతంత్రాల వల్ల చంద్రబాబు జైలుకు వెళ్లడంతో లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర అనుకున్న విధంగా ముందుకుసాగలేదని, కొన్ని నియోజకవర్గాల్లో కొనసాగించలేకపోయారని చెప్పారు. టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి ప్రారంభం కానున్న లోకేష్ శంఖారావం యాత్ర 11 రోజుల పాటు 31 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సాగుతుందన్నారు. వార్డు స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించే కార్యక్రమంలో ప్రభుత్వ వైఫల్యాలు, దోపిడీ విధానాలను ప్రజల్లో ఎండగడతారని చెప్పారు. అదే సమయంలో వివిధ వర్గాలకు భరోసా కల్పిస్తూ అధినేత ప్రకటించిన సూపర్ సిక్స్ కార్యక్రమాలపై ప్రజలను చైతన్యవంతం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఎంఎ షరీఫ్, టిడి జనార్ధన్, నిమ్మల కిట్టప్ప పాల్గొన్నారు.

నిరంకుశ పాలనకు నిదర్శనం

డిమాండ్ల పరిష్కారం కోసం చలో విజయవాడ చేపట్టిన ఆశా వర్కర్లపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం జగన్ నియంతృత్వ పాలనకు పరాకాష్ట అని, ఈ చర్యను ఖండిస్తున్నట్లు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు తెలిపారు. ఐదేళ్లుగా ఆశాలతో వెట్టిచాకిరీ చేయిస్తున్న జగన్ వారి సమస్యలను పరిష్కరించక పోవడం దుర్మార్గం కాదా అని గురువారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. బాధితుల పక్షాన నిలబడాల్సిన పోలీసులు అధికార వైసిపికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆశాలకు రూ.10 వేలు వేతనం ఇస్తానని ముఖ్యమంత్రిగా మొదటి సంతకం చేసిన జగన్ హామీని ఎందుకు నిలబెట్టుకోలేదని ప్రశ్నించారు. వారి డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మందుల రంగంలో అక్రమాలను అరికట్టాలి

- ఎఫ్‌ఎంఆర్‌ఎఐ సమావేశాల్లో పలు తీర్మానాలు ఆమోదం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ రిప్రజంటేటివ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో భాగంగా రెండో రోజు గురువారం పలు తీర్మానాలను ప్రవేశపెట్టారు. విజయవాడ ఎంబివికెలో జరిగిన కార్యక్రమంలో సంస్థ జాతీయ కార్యవర్గ సభ్యులు శాంతునన్ మిత్ర తీర్మానాలను ప్రవేశపెట్టారు. మందుల రంగంలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని, మందులపై జిరో శాతం జిఎస్‌టి ఉండాలని, మందుల ధరలు నిర్ణయించడం లోపభూయిష్టంగా ఉందని, ప్రభుత్వ రంగ మందుల కంపెనీలను పునరుద్ధరించాలని పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ మాట్లాడుతూ.. బిజెపి నయా ఉదారవాద ఆర్థిక విధానాల వల్ల దేశంలో ఎప్పుడూ లేనంతగా ఆర్థిక, రాజకీయ, సామాజిక అంతరాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులను నిర్వీర్యం చేస్తూ, ఇన్సూరెన్స్ కంపెనీలకు ప్రజారోగ్యాన్ని అప్పగించే ప్రయత్నం చేస్తోందన్నారు. అనంతరం కేరళకు మద్దతుగా ఎంబి భవన్ వద్ద నిరసన తెలిపారు.

తీర్మానాలను ప్రవేశపెడుతున్న మిత్ర

కేంద్ర వివక్షకు నిరసనగా తమిళనాడు ఎంపిల ఆందోళన

న్యూఢిల్లీ : రాష్ట్రాలకు నిధుల కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం, పక్షపాతం చూపు తుందంటూ తమిళనాడు ఎంపిలు గురువారం ఆందోళనకు దిగారు. పార్లమెంట్ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం వద్ద నల్ల వస్త్రాలు ధరించి ఎంపిలు టిఆర్ బాలు, కనిమొళి, ఎ రాజా తదితరలు నిరసన తెలిపారు. గురువారం లోక్‌సభ సమావేశాల్లో కూడా తమిళ ఎంపిలు నల్ల వస్త్రాలు ధరించి పాల్గొన్నారు. ప్రశ్నోత్తరాలు, జీరో అవర్ సమయంలో ఈ అంశాన్ని ప్రస్తావించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్‌షాలతో ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ సమావేశమైనా కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు రాలేదని విమర్శించారు.

భారత్ ప్రత్యర్థి ఆస్ట్రేలియా

సెమీస్‌లో పాక్‌పై వికెట్ తేడాతో నెగ్గిన ఆసీస్

ఐసిసి (అండర్-19) వన్డే ప్రపంచకప్

జొహన్నెస్‌బర్గ్: ఐసిసి(అండర్-19) వన్డే ప్రపంచకప్ ఫైనల్లో భారత ప్రత్యర్థి ఎవరో తేలిపోయింది. బెనోని వేదికగా జరిగిన రెండో సెమీస్‌లో పాకిస్తాన్‌పై వికెట్ తేడాతో ఆస్ట్రేలియా జట్టు విజయం సాధించి ఫైనల్లోకి ప్రవేశించింది. పాకిస్తాన్ నిర్దేశించిన 180పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆస్ట్రేలియా జట్టు 164పరుగులకే 9వికెట్లు కోల్పోయి ఓటమి అంచుల్లో నిలిచినా.. చివరి వికెట్‌కు మెక్ మిల్లన్(19), కల్లామ్(2) ఆసీస్‌ను గెలిపించి ఫైనల్‌కు చేర్చారు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్‌ను ఆస్ట్రేలియా బౌలర్లు కట్టడి చేశారు. టాప్ ఆర్డర్‌లో హసైన్(17), అజన్(52), అరాఫత్(5) మాత్రమే రెండంకెల స్కోర్ చేశారు. ఆస్ట్రేలియా బౌలర్ టామ్ స్ట్రక్కర్ ఆరు వికెట్లు కూల్చి పాకిస్తాన్‌ను కట్టడి చేశాడు. దీంతో పాకిస్తాన్ జట్టు 48.5ఓవర్లలో 179పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఆ తర్వాత పాకిస్తాన్ బౌలర్లు రాణించినా,,. ఆసీస్ బ్యాటర్లు డిక్సన్(50), మిడిలార్డర్‌లో పెర్కే(49), క్యాంప్‌బెల్(25) మెరిసారు. దీంతో ఆస్ట్రేలియా జట్టు 49.1 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 181పరుగులు చేసి గెలిచింది. ఆదివారం జరిగే టైటిల్ పోరులో ఆస్ట్రేలియా యువ జట్టు భారత యువజట్టుతో తలపడనుంది.

ఆంధ్రకు కఠిన పరీక్ష

నేటినుంచి ఉత్తరప్రదేశ్‌తో రంజీ మ్యాచ్

విశాఖపట్నం: రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్-బిలో ఆంధ్రప్రదేశ్ జట్టు పటిష్ట ఉత్తరప్రదేశ్‌తో లీగ్ మ్యాచ్ ఆడనుంది. ఆంధ్రజట్టు ఈ సీజన్‌లో అద్భుత విజయాలతో దూసుకెళ్తోంది. దీంతో గ్రూప్‌లోనూ రెండోస్థానంలో కొనసాగుతోంది. ఈ గ్రూప్‌లో ఆంధ్ర 22 పాయింట్లతో 2వ స్థానంలో కొనసాగుతుంటే.. యుపి జట్టు 14పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. యుపి జట్టు ఈ టోర్నమెంట్‌లో ఒక మ్యాచ్‌లో మాత్రమే గెలిచి మిగిలిన మ్యాచ్‌లను డ్రా చేసుకుంది. ఉత్తర్రప్రదేశ్ జట్టును ఏమాత్రం తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. ఆ జట్టులో జాతీయ జట్టుకు ఆడిన భువనేశ్వర్ కుమార్, రింకు సింగ్, నితీశ్ రాణా, కరణ్ శర్మ, కార్తీక్ త్యాగి వంటి ఆటగాళ్లు ఉన్నారు. వీరిలో ఎందుకు ఆంధ్రతో మ్యాచ్‌కు అందుబాటులో ఉంటారో చెప్పలేం. ఇక ప్లేట్ గ్రూప్‌లో అగ్రస్థానంలో ఉన్న హైదరాబాద్ జట్టు నాగాలాండ్‌తో మ్యాచ్ ఆడనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68